ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 10, డిసెంబరు 2024



ఈయన పేరు పల్లా రాములు. పెద్దాదోర్నాల మండలం తిమ్మాపురం. మూడు ఎకరాల్లో మిరప సాగు చేశారు. రెండు ఎకరాల్లో పంట మొత్తం తెగులుతో దెబ్బతింది. ఖరీదైన మందులు ఎన్ని పిచికారీ చేసినా ఫలితం లేదు. ఇప్పటికే రూ.2లక్షల మేర ఎరువులు, పురుగు మందులకు ఖర్చు చేశారు. కొద్దోగొప్పో దిగుబడి వచ్చినా ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు లేవు. కాసిన కాయలు కోయాలంటే మళ్లీ రూ.50 వేల వరకు ఖర్చుచేయాల్సి ఉంది. ఇంతచేసినా చివరికి మిగిలేది నష్టమే.

రైతు పేరు దేవిరెడ్డి సుబ్బారెడ్డి. తర్లుపాడు మండలం కారుమానుపల్లి. రెండు ఎకరాల్లో మిరప సాగు చేశారు. తేజ రకం విత్తనాలు వినియోగించారు. తొలుత పైరు బాగానే ఉన్నా నెలరోజులుగా ఎండుకొమ్మ, కుచ్చుముడత తెగుళ్లు సోకాయి. ఇప్పటికే ఎకరాకు రూ1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం పొలంలో ఉన్న కాయలను కోస్తే ఐదు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. ధరలు కూడా తగ్గాయి. క్వింటా రూ.10వేల లోపే ఉంది. కోత ఖర్చు రెండెకరాల మీద రూ.30వేలు అవుతుంది. ఎటుచూసినా రూ1.20లక్షల మేర నష్టపోయే అవకాశమే కనిపిస్తోంది.



మిరప రైతు కుదేలు

జిల్లాలోని పశ్చిమప్రాంతంలో మిరప రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. నెలరోజులుగా మంగు వాతావరణంతో పంటపై తెగుళ్లు, పురుగుల ఉధృతి ఎక్కువైంది. ప్రధానంగా కుచ్చు, బొబ్బర, ఎండుకొమ్మ తెగుళ్లు సోకాయి. వాటి ప్రభావంతో దిగుబడులు భారీగా పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. మరోవైపు మార్కెట్‌లో ధరలు దిగజారిపోయాయి. దీంతో రైతుల పరిస్థితి 'పెనంపై నుంచి పొయ్యిలో పడ్డట్లు' అన్న చందంగా తయారైంది. ఎటుచూసినా ఈ ఏడాది మిర్చి సాగు చేసిన కర్షకులకు నష్టాలు మిగలడం ఖాయంగా కనిపిస్తోంది.

మార్కాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం డివిజన్‌లో సాగులో ఉన్న వాణిజ్య పంటల్లో మిరపది అగ్రస్థానం. ఆ పంటకు అనుకూలమైన భూములు డివిజన్ పరిధిలో విస్తారంగా ఉన్నాయి. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగానే కురిశాయి. భూగర్భ జలాలు బాగా ఉన్నాయి. దీంతో బోర్ల కింద ఎక్కువగా మిర్చి సాగైంది. నాలుగేళ్లుగా దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో డివిజన్ పరిధిలో ఈ ఏడాది కూడా సాధారణం కంటే అధికంగానే రైతులు మిరప వేశారు. జిల్లావ్యాప్తంగా 57వేల ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు చేయగా అందులో సింహభాగం మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలోనే ఉంది. ఈ మూడు సబ్ డివిజన్ల పరిధిలోని 13 మండలాల్లో 42,673 ఎకరాల్లో మిరప సాగైంది. రైతులు ఎర్ర బంగారంగా భావించే మిర్చి ఈ ఏడాది కన్నీళ్లు మిగిల్చే పరిస్థితులు నెలకొన్నాయి. తొలుత పంట పరిస్థితి బాగానే ఉన్నా, నెలరోజులుగా తెగుళ్ల ఉధృతి ఎక్కువైంది. వేలాది రూపాయలు ఖర్చుపెట్టి పురుగుమందులు పిచికారీ చేసినా తెగుళ్ల ఉధృతి తగ్గలేదు. గతంలో ఎకరాకు రూ.50వేలకుపైగా పెట్టుబడి పెట్టిన రైతులు

మిగతా 6వ పేజీలో

- చుట్టుముట్టిన కుచ్చు, బొబ్బర, ఎండుకొమ్మ తెగుళ్లు
- రకరకాల మందులు వినియోగించినా ఫలితం శూన్యం
- ఎకరాకు రూ.50వేలకుపైగానే నష్టపోనున్నరైతులు
- దిగజారిన ధరలతో మరిన్ని కష్టాలు


తెగులు బారిన పడిన మిర్చి పంట



నాలుగోసారైనా..!

- రేపు నీటిసంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్
- తాజా షెడ్యూల్ ప్రకటించిన ప్రభుత్వం
- 14న డబ్ల్యూయూఏలు, 17న డీసీలకు ఎన్నిక
- ఈసారైనా జరిగేనా అన్న అనుమానాలు
- రెవెన్యూ సదస్సులే కారణం

ఒంగోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు తాజాగా షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 11న నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు షెడ్యూల్ అందింది. ఆ ప్రకారం జిల్లాలో 342 డబ్ల్యూయూఏలు, 10 డీసీల ఎన్నికలకు అధికారులు నోటిఫికేషన్ ఇస్తారు. డబ్ల్యూయూఏలకు 14వతేదీన ఎన్నిక జరగనుంది. తొలుత ఆయా డబ్ల్యూయూఏలోని ప్రాదేశికాలకు (టీసీలకు) ఎన్నికలు నిర్వహించి అదేరోజు వారితో సమావేశం ఏర్పాటు చేసి అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. అనంతరం 17న డీసీలకు ఎన్నిక జరుగుతుంది. మేజర్ నీటి వనరుల పరిధిలోని డబ్ల్యూయూఏల అధ్యక్షులు ఆ పరిధిలోని డీసీ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. అయితే గతంలో మూడుసార్లు నీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ వాయిదా పడింది. ఇక నాలుగోసారైనా జరుగుతుందో లేదో వేచిచూడాలి.

కసరత్తు అంతా పూర్తి

జిల్లాలో మొత్తం 342 డబ్ల్యూయూఏలు, 10 డీసీలు, మూడు ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. ఆయా సంఘాల వారీ ఓటర్ల జాబితాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. గతంలోనే ఎన్నికల సిబ్బంది, నిర్వహణాధికారులను నియమించి వారికి శిక్షణ కూడా ఇచ్చారు. తొలుత బుడమేర వరదలు, తర్వాత అసెంబ్లీ సమావేశాలు, మూడోసారి తుఫాన్ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశాక ఎన్నికలు వాయిదా పడ్డాయి. తాజాగా నాల్గోసారి ఎన్నికల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇప్పుడైనా ఈ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జరుగుతాయా? లేదా? అన్న అనుమానాలు ఇటు అధికారుల్లోనూ, అటు రైతుల్లోనూ వ్యక్తమవుతున్నాయి. అందుకు ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సులే కారణంగా కనిపిస్తోంది. ప్రభుత్వం నెలరోజులపాటు రెవెన్యూ సదస్సులను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. మొత్తం రెవెన్యూ యంత్రాంగానిది కీలకపాత్ర. ఈ పరిస్థితుల్లో నీటిసంఘాల ఎన్నికలు తాజా షెడ్యూల్ ప్రకారం జరుగుతాయా? లేక మళ్లీ వాయిదా పడతాయా? అన్న సంశయం నెలకొంది.


కొండమట్టిని టిప్పర్లలో నింపుతున్న ఎక్స్‌కవేటర్లు

కొల్లగొడుతున్నారు!

- ఎర్రకొండలో ఆగని తవ్వకాలు
- యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు
- అయోమయంలో అధికార యంత్రాంగం
- ఇదేమిటని ప్రశ్నించిన గ్రామస్థులకు బెదిరింపులు

తాళ్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగువారిపాలెం ఎర్రకొండ నుంచి గ్రావెల్ అక్రమ తరలింపు అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది. అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. గ్రావెల్ తరలింపుపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో కొన్నిరోజులు గప్‌చుప్‌గా ఉన్నారు. మరలా రోడ్డు నిర్మాణం కోసం భారీస్థాయిలో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. ఆ గ్రామానికి చెందిన బొద్దికూరపాడు సర్వే నంబర్ 489లో బెంగళూరు-అమరావతి హైవే రోడ్డు నిర్మాణం కోసం సంబంధిత కాంట్రాక్టర్ పూర్వపు తహసీల్దార్ ద్వారా మైనింగ్ అధికారులకు తాత్కాలిక అనుమతి కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. ఎనిమిది నెలలు కావస్తున్నా అనుమతి లభించలేదు. ఎర్రకొండ నుంచి గ్రావెల్ తరలింపునకు అనుమతిలేకపోయినా, ఐదు నెలలుగా తరలిస్తున్నారని

మిగతా 6వ పేజీలో

- పొదిలిలో నిరుపేద దివ్యాంగుల ఉన్నత ఆశయం
- కష్టాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులకు తోడ్పాటు
- రక్షక్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి విస్తృత సేవలు
- పలువురికి ట్రైసైకిళ్లు, వీల్‌చైర్స్ పంపిణీ
- అండగా ముందుకు వస్తున్న దాతలు
- వారి స్ఫూర్తికి మెచ్చి పలు సన్మానాలు, సత్కారాలు

7

దివ్యమైన సేవలు



నిరుపేదలకు దుస్తులను పంపిణీ చేస్తున్న రక్షక్ ఫౌండేషన్ నిర్వాహకులు


వివరాలను వెల్లడిస్తున్న ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు

ఒడిశా టూ ఒంగోలు

- జోరుగా గంజాయి అక్రమ రవాణా
- 12 మంది ముఠాను అరెస్టు చేసిన పోలీసులు
- 4 కిలోల గంజాయి, రూ.10వేలు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు

వివరాలు మెయిన్‌లో..

త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుస్తాం


చెరువుకొమ్ముపాలెంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ డీఎం వరలక్ష్మి, అధికారులు

- తొందరపడి ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించొద్దు
- సివిల్ సప్లయీస్ డీఎం వరలక్ష్మి

దర్శి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తుందని సివిల్ సప్లయీస్ డీఎం జి.వరలక్ష్మి తెలిపారు. త్వరలో కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామని చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. 'కొనుగోల్‌మాల్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు సివిల్ సప్లయీస్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు మండలంలోని లంకోజనపల్లి, రాజంపల్లి, చెరువుకొమ్ముపాలెం, బొట్లపాలెం తదితర గ్రామాల్లో పర్యటించారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన వారి బ్యాంకు ఖాతాలో మూడు రోజుల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. ధాన్యం విక్రయాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే టోల్ ఫ్రీ నెంబరు 1967కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం గ్రేడ్-ఏ రకం ధాన్యం క్వింటా రూ.2,320, సాధారణ రకం రూ.2,300కు కొనుగోలు చేస్తామన్నారు. ఆమె వెంట ఏడీఏ బాలాజీనాయక్, డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, వ్యవసాయాధికారులు బాలకృష్ణానాయక్ సంఘమేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

జడ్పీనే లక్ష్యం

నిన్న గోవా టూర్.. నేడు నియోజకవర్గాల సమావేశాలు

- తొలి సమావేశాలకే ముగ్గురు జడ్పీటీసీ సభ్యులు డుమ్మా
- ముందుగానే మరో ఇద్దరు టీడీపీలో చేరిక
- అందుకే నేతల ప్రసంగాల్లో స్థానిక అంశాలను జోడించని వైనం


గిద్దలూరు సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా కోఆర్డినేటర్ చెవిరెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)
జిల్లా పరిషత్‌పై పెత్తనాన్ని కాపాడుకునేందుకు విపక్ష వైసీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేయడం ప్రారంభించింది. చేజారుతున్న జడ్పీటీసీ సభ్యులను నిలుపుకునేందుకు ఇటీవల విహారయాత్ర పేరుతో గోవా తీసుకెళ్లిన విషయం విదితమే. తాజాగా నియోజకవర్గాల వారీ విస్తృత స్థాయి సమావేశాల పేరుతో సరికొత్త కార్యక్రమానికి ఆపార్టీ నేతలు శ్రీకారం పలికారు. అందులోభాగంగా సోమవారం గిద్దలూరు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల సమావేశాలను నిర్వహించారు. వాటికి ముగ్గురు జడ్పీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. గతంలోనే మరో ఇద్దరు టీడీపీలో చేరిపోయారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్‌కు ఎన్నికలు జరిగాయి. ఆ పార్టీ ఉమ్మడి జిల్లాలోని అత్యధిక సంఖ్యలో జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకొని జిల్లాపరిషత్‌ను దక్కించుకుంది. జడ్పీ చైర్‌పర్సన్‌గా వెంకాయమ్మ ఉండగా ఆమె కుమారుడు శివప్రసాద్‌రెడ్డి గత ఎన్నికల్లో దర్శి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అమల్లో ఉన్న చట్టం ప్రకారం నాలుగేళ్ల కాలపరిమితి నిండాలి. వెంకాయమ్మ చైర్‌పర్సన్ అయి మూడు సంవత్సరాల మూడు నెలలు గడిచింది. ఇంకో తొమ్మిది మాసాలు పూర్తయిన తర్వాతే అవిశ్వాసం ప్రవేశపెట్టాలి. ఈలోపే గడువును కూటమి ప్రభుత్వం తగ్గిస్తూ ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది. దీంతో జిల్లా పరిషత్‌ను కాపాడుకునేందుకు వైసీపీ తంటాలు పడుతోంది. రమారమి నెలరోజుల

మిగతా 6వ పేజీలో

నిశిత పరిశీలన

- చిలకపాడులో పింఛన్లను తనిఖీ చేసిన అధికారులు
- ప్రభుత్వానికి ప్రత్యేక యాప్‌లో సమాచారం
- తొలిరోజు 380 మందిని విచారించిన బృందాలు

7



హోరాహోరీ

సంతనూతలపాడులో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మూడోరోజైన సోమవారం హోరాహోరీగా సాగాయి. వివిధ జిల్లాల క్రీడాకారులు నువ్వా-నేనా అన్నట్లు పోరాడారు. కొన్ని పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. పలువురు అత్యుత్తమ ప్రతిభతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

వివరాలు 7వ పేజీలో


చిలకపాడులో పింఛన్‌దారుడి వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

నారాయణస్వామి ఆదాయం రూ.1.34 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం రూ.లక్షా 340 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.41,600, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.15,160, శాశ్వత అన్నదానానికి రూ.40,582, ఇతర విరాళాల ద్వారా రూ.300 వచ్చినట్లు తెలిపారు.

చీమకుర్తిలో కిడ్నాప్ కలకలం?

గ్రానైట్ లారీల పట్టివేతలో ప్రమేయం ఉందనే అనుమానంతో..

ఘటనపై ఫిర్యాదు అందలేదంటున్న పోలీసులు

చీమకుర్తి, డిసెంబరు(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పోలీసులకు సమాచారం అందించి గ్రానైట్ రవాణా చేస్తున్న లారీలను పట్టించటంలో పాత్ర ఉందనే అనుమానంతో ఓ యువకుడిని కిడ్నాప్ చేసి, దాడిచేసి వదలిపెట్టారనే వార్తలు సోమవారం సోషల్‌మీడియాలో హల్‌చల్ చేశాయి. దీనిపై చీమకుర్తి సీఐ సుబ్బారావు స్పందిస్తూ తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, ఇటువంటి సంఘటన చీమకుర్తిలో జరిగే అవకాశం లేదన్నారు. ఈ సంఘటనకు సంబంధించి హల్‌చల్ అవుతున్న వివరాలు ఇలా ఉన్నాయి..

చీమకుర్తి మండలం అయ్యపురాజుపాలేనికి చెందిన యువకుడు విష్ణు ఓ గ్రానైట్ వ్యాపారి కారుకు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. మూడురోజుల క్రితం చీమకుర్తి, సంతనూతలపాడులో పోలీసులు, మైన్స్, విజిలెన్స్ అధికారుల మెరుపు దాడులు చేసి గ్రానైట్ శ్లాబులు రవాణా అవుతున్న లారీలను సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో విష్ణునే పోలీసులకు ముందస్తుగా సమాచారాన్ని అందచేయటం వలనే పెద్దఎత్తున లారీలు పట్టుబడ్డాయి అని ఒంగోలుకు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి అనుమానించాడు. అతను తన అనుచరులతో విష్ణుని కిడ్నాప్ చేశాడు. చీమకుర్తి శివారున్న పాటిమీదపాలేనికి వెళ్లే రహదారి వద్దకు విష్ణుకి ఫోన్ చేసి రావాలని చెప్పి, వచ్చిన తర్వాత కారులో ఒంగోలుకు తీసుకెళ్లి, ఇలాంటి పనులు ఇంకోసారి చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించటంతోపాటు దాడికి పాల్పడినట్లు సమాచారం. తాను ఎటువంటి సమాచారం పోలీసులకు అందచేయలేదని చెబుతున్నా వినకుండా అతనిని కొట్టినట్లు తెలిసింది. ఈ విషయం ఎవరికైనా చెబితే లేపేస్తాం అంటూ బెదిరించి వదలిపెట్టారు. దీంతో భయభ్రాంతులు గురి అయిన విష్ణు సింగరాయకొండకు వెళ్లి అక్కడ నుంచి సోషల్ మీడియాకు జరిగిన వివరాలను, తనకు గాయాలైన ఫొటోలను పంపించాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే తనతో పాటు కుటుంబ సభ్యులకు ప్రమాదం ఉంటుందని, అందువల్ల తాను బయటకి కూడా రావటం లేదని విష్ణు తెలిపినట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. కాగా సోషల్‌మీడియాలో షికారు అవుతున్న ఈ సంఘటన నిజంగా జరిగిందా లేదా అని ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటన ఎటువంటి పరిణామాలకు దారితీస్తాయే వేచిచూడాల్సి ఉంది.




విష్ణు కాలికి తగిలిన గాయాలు

కొల్లగొడుతున్నారు!

(5వ పేజీ తరువాయి)

గత నెల 29న తహసీల్దార్ కె.సంజీవరావు కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. గ్రావెల్‌ను అక్రమంగా తరలించకుండా వీఆర్‌వో, వీఆర్ఏను కొండ వద్ద కాపాలా ఉంచుతామని చెప్పారు. ఎర్రకొండ నుంచి అనుమతికి మించి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు సాంకేతికంగా నిర్ధారణైతే వారిపై కేసులు నమోదు చేస్తామని మైనింగ్ అధికారులు కూడా కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్‌కు తహసీల్దార్, మైనింగ్ అధికారులు నివేదికలైతే పంపారేగాని చర్యలకు ఉపక్రమించిన దాఖలాలు లేవు.

గ్రామస్థులకు బెదిరింపులు

రోడ్డు నిర్మాణ కంట్రాక్టర్ గ్రావెల్‌ను తరలిస్తుండగా కొందరు గ్రామస్థులు వెళ్లి కొండను తవ్వేందుకు ఎవరు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఆ సమయంలో కాంట్రాక్టర్ కొందరితో ఫోన్‌లో దురుసుగా మాట్లాడారని స్థానికులు చెప్తున్నారు. కొండను 20 ఏళ్ల క్రితమే లీజుకు తీసుకున్నామని, తాము ఏడాదికి కోటిపైగా ప్రభుత్వానికి సెస్ చెల్లిస్తున్నామని పేర్కొన్నట్లు చెప్పారని వారు తెలిపారు. గ్రావెల్ తోలకానికి అడ్డు వస్తే ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారని తెలిపారు. 20 ఏళ్లనాడు కొండకు పొందిన లీజు పత్రాలు చూపమన్నా చూపించాల్సిన పనిలేదంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడారని గ్రామస్థులు తెలిపారు.

ఉన్నతాధికారుల అండదండలతోనే..

గ్రామస్థుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు కొండను పరిశీలించేందుకు వెళితే ఎందుకు వెళ్లారని వారిపై కొందరు ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఓ అధికారి అండదండలతోనే రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ గ్రావెల్‌ను తరలిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్, మైనింగ్ అధికారులు చర్యలు చేపడతామని కలెక్టర్‌కు నివేదికలు ఇచ్చారే తప్ప, కొండ నుంచి గ్రావెల్ అక్రమంగా తరలి వెళుతున్నా మిన్నకుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్రాభివృద్ధి కోరే కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయకపోవటంపై విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి గ్రావెల్ అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

మిరప రైతు కుదేలు

(5వ పేజీ తరువాయి)

సరాసరిన 25 క్వింటాళ్ల వరకు దిగుబడులు సాధించే వారు. కానీ ప్రస్తుతం ఎకరాకు రూ.లక్షకుపైగా ఖర్చు చేస్తున్నా దిగుబడులు 10క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఎకరాకు రూ.50వేలకుపైగా నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయి.

రైతులను ముంచిన తెగుళ్లు

వాస్తవానికి మిరప తోటల సాగు అత్యంత వ్యయప్రయాసలతో కూడుకున్నది. మొక్క నాటిన దగ్గర నుంచి దిగుబడులను మార్కెట్‌లో అమ్ముకునే వరకు రైతులు ఎంతో కష్టపడాలి. దిగుబడులు, ధరలు స్థిరంగా ఉంటే కొంత మేరకు ఆదాయం వస్తుంది. కానీ ఈ ఏడాది రైతుల ఆశలపై తెగుళ్లు నీళ్లు చల్లాయి. ముఖ్యంగా ఎండుకొమ్మ, పండాకు, బూజు తెగుళ్లతో ప్రారంభ దశలోనే చాలావరకు తోటలు తెబ్బతిన్నాయి. తర్వాత తెల్లదోమ ఉధృతి ఎక్కువవడంతో కుచ్చు తెగులు సోకింది. కొద్దిపాటి మందులను పిచికారీ చేస్తే అదుపులోకి వచ్చే కుచ్చు తెగులు ఈ పర్యాయం మొండిగా తయారైంది. వేలాది రూపాయలు వెచ్చించి ఖరీదైన మందులు చల్లినా అదుపులోకి రాలేదు. ప్రస్తుతం ఎర్ర నల్లి, తెల్ల నల్లి ప్రభావంతో మిరప తోటలు దెబ్బతింటున్నాయి. పైరు ఎదుగుదల ఆగిపోయింది. పూత, పిందె తగినంత రావడం లేదు. మొక్కలు ఏపుగా పెరిగితేనే మిరపలో అధిక దిగుబడులకు సాధ్యమవుతుంది. కానీ డివిజన్ పరిధిలో ఎక్కడచూసినా ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం చాలా గ్రామాల్లో మిరప కోతలు మొదలయ్యాయి. దిగుబడులు అంతంతమాత్రంగా ఉండగా కోతకు క్వింటాలుకు రూ.5వేలకుపైగా ఖర్చయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. రూ.300 నుంచి రూ.500 వరకూ కూలి చెల్లించాల్సి ఉంది. తెగుళ్ల ప్రభావంతో రైతన్నలు ఈ సంవత్సరం నష్టాలు మూటకట్టుకునే పరిస్థితి నెలకొంది.

దిగజారిన ధరలు

దిగుబడులు తగ్గి రైతులు ఇబ్బందులు పడుతుంటే మార్కెట్‌లో ధరల పరిస్థితి మరో రకంగా ఉంది. ప్రస్తుతం తేజ రకం సన్నాల్లో మేలైన మిర్చి ధర క్వింటా రూ.10వేల నుంచి రూ.12 వేల వరకు ఉంది. లావు రకానికి అసలు డిమాండ్ లేదు. క్వింటా రూ.8వేలల్లోపే వ్యాపారులు కొంటున్నారు. గత సంవత్సరం ఇదే సమయంలో తేజ వెరైటీకి రూ.25వేల వరకు ధర పలికింది. లావు రకాలు కూడా రూ.18వేల వరకు అమ్ముడయ్యాయి. అప్పట్లో దిగుబడులు సమృద్ధిగా ఉన్నప్పటికీ చివర్లో మినహా మార్కెట్ స్థిరంగా ఉంది. కానీ ఈ సంవత్సరం ధరలు పెరగకపోవడానికి నిల్వలు అధికంగా ఉండటమే కారణమని తెలుస్తోంది. అంతేకాక రాష్ట్రంలోని మిరపను ఎక్కువగా చైనా దేశం దిగుమతి చేసుకుంటుంది. అయితే అక్కడి నుంచి ఆర్డర్లు రాకపోవడం కూడా ధరలు పెరగకపోవడానికి మరో కారణంగా చెబుతున్నారు. ఏదిఏమైనా ఒకవైపు తెగుళ్లు, మరోవైపు దిగజారిన ధరలతో రైతులు తీవ్రంగా నష్టాలపాలవుతున్నారు.

జడ్పీనే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

క్రితం వైసీపీ జడ్పీటీసీలందరినీ ఎమ్మెల్యే, ఆ పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడైన శివప్రసాద్‌రెడ్డి, చైర్‌పర్సన్ వెంకాయమ్మలు గోవా టూర్ తీసుకెళ్లారు.ఎన్నికలకు ముందే కొంతమంది జడ్పీటీసీలు టీడీపీలో చేరిపోగా ఎన్నికల అనంతరం మరికొందరు టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలకు దగ్గరయ్యారు. కొందరు ప్రత్యక్షంగా టీడీపీలో చేరగా మరికొందరు పరోక్షంగా టీడీపీ శ్రేణులతో కలిసిపోతున్నారు. మధ్యలో వైసీపీ నుంచి జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితో మరికొందరు టచ్‌లో ఉన్నారు.

వైసీపీ నాయకుల్లో కలవరం

చేజారిపోతున్న జడ్పీటీసీలను చూసి వైసీపీ నాయకుల్లో కలవరం ప్రారంభమైంది. గోవా టూర్‌కే పరిమితమైతే ఉపయోగం లేదని పార్టీపరంగా నమ్మకాన్ని కల్పించి వారిని కాపాడుకునేందుకు వైసీపీ నాయకత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రస్తుతం రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు నాయకులు చెబుతున్నప్పటికీ చేజారునున్న జడ్పీటీసీ సభ్యులకు మనోధైర్యం కల్పించి కాపాడుకునే ఉద్దేశంతోనే ఈ సమావేశాలకు శ్రీకారం పలికినట్లు తెలుస్తుంది. అందుకు అనుగుణంగానే కొందరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిలు అప్పుడే సమావేశాలు అవసరమా అయినా తాము ఖర్చు భరించే పరిస్థితి లేదంటూ తమ నిరాసక్తత కూడా వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. అయితే సమావేశం నిర్వహణ, కార్యకర్తల భోజనాలకు తామే వ్యయం చేస్తాం.. సమావేశాలు పెట్టమని జిల్లా నాయకులు వత్తిడి చేసినట్లు తెలిసింది.

పట్టున్న చోటే చేజారుతున్న సభ్యులు

జిల్లాలోని పశ్చిమప్రాంతం వైసీపీకి ఆయువుపట్టు. గెలిచిన రెండు అసెంబ్లీ స్థానాలు ఆ వైపే ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతంలోని జడ్పీటీసీ సభ్యులు చేజారకుండా చూసేందుకు ఆ వైపు నుంచే పర్యటనలు ప్రారంభించారు. సోమవారం మధ్యాహ్నం గిద్దలూరులో సాయంత్రం వైపాలెంలో సమావేశాలు నిర్వహించారు. గిద్దలూరులో జనసేనలో చేరిన బాలినేని సన్నిహితులను సమావేశానికి ఆహ్వానించకపోవటం విశేషం. బాలినేనికి సన్నిహితుడిగా ఉన్న కొమరోలు ప్రాంతానికి చెందిన రమణారెడ్డిని అసలు పిలవలేదు. ఆయనకు మద్దతుగా ఆ మండలం ఎంపీపీతోపాటు పలువురు ముఖ్య నాయకులు గైర్హాజరయ్యారు. అర్ధవీడు జడ్పీటీసీ చెన్నె విజయ కూడా గైర్హజరుకావటం విశేషం. ఎన్నికలకు ముందే గిద్దలూరు, కంభం జడ్పీటీసీలు టీడీపీలో చేరారు. ప్రస్తుతం మరో జడ్పీటీసీ వెళ్లలేదు. దీంతో గిద్దలూరు నియోజకవర్గంలో జడ్పీటీసీ సభ్యులు ఇరుపార్టీలకు సమానంగా మారిపోయారు. అలాగే గిద్దలూరు సమావేశానికి కార్యకర్తలు కూడా తక్కువసంఖ్యలో హాజరుకావటం విశేషం. కొందరు ద్వితీయశ్రేణి నాయకుల ప్రసంగాలతో వాగ్వివాదాలు కూడా చోటుచేసుకున్నాయి.

వైపాలెంలోనూ అదే తీరు

ఆ తర్వాత వైపాలెం నియోజకవర్గంలో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశాలకు నియోజకవర్గంలో కొందరు ముఖ్యనాయకులతోపాటు ఇద్దరు జడ్పీటీసీలు గైర్హాజరుకావటం విశేషం. పుల్లలచెరువు, త్రిపురాంతకం జడ్పీటీసీ సభ్యులు రమావత్‌నాయక్, జాన్‌పాల్‌లు రాలేదు. దీంతో రెండు నియోజకవర్గాల్లో సోమవారం సమావేశాలకు ముగ్గురు వైసీపీ జడ్పీటీసీలు గైర్హాజరైనట్లు తేటతెల్లమైంది. మరో ఇద్దరు గతంలో పార్టీ మారినందున రెండు నియోజకవర్గాల్లో 11మంది జడ్పీటీసీలకు ఐదుగురు బహిరంగంగానే టీడీపీకి మద్దతు ఇస్తున్నట్లు తేలిపోయింది. వీరుకాక మరో ముగ్గురు టీడీపీ నాయకులకు టచ్‌లో ఉన్నారు. దీంతో సమావేశాల అనంతరం జడ్పీటీసీలు గైర్హాజరుపై వైసీపీ నాయకుల్లో చర్చ ఆరంభమైంది. ఇదిలాఉండగా ఈ సమావేశాల్లో పాల్గొన్న అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, రీజనల్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, లోక్‌సభ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితోపాటు ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కూడా కూటమి ప్రభుత్వంపై, చంద్రబాబుపై విమర్శలు చేశారే తప్పా రెండు నియోజకవర్గాల్లోని పార్టీశ్రేణుల ఇబ్బందులు, సమస్యలు కాని ప్రస్తావించకపోవటం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబును పల్లెత్తు మాట అనకపోవటం వైసీపీ అసలు లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తుంది.

దివ్యమైన సేవలు

- కష్టాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులకు తోడ్పాటు
- రక్షక్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి విస్తృత సేవలు
- పలువురికి ట్రైసైకిళ్లు, వీల్‌చైర్స్ పంపిణీ
- అండగా నిలుస్తున్న దాతలు
- ఆ ఇద్దరి స్ఫూర్తికి మెచ్చి పలు సన్మానాలు, సత్కారాలు

పొదిలిలో ఇద్దరు నిరుపేద దివ్యాంగుల ఉన్నత ఆశయం

ఆ ఇద్దరూ పుట్టుకతో దివ్యాంగులు. రెండు కాళ్లూ లేవు. మరొకరి సాయం లేకుండా ఎక్కడికీ వెళ్లలేరు. పైగా రెక్కాడితేగాని డొక్కాడని బడుగు జీవులు. వారి కుటుంబాల పోషణ భారం కూడా వారిదే. అయినా పరిస్థితులకు కుంగిపోలేదు. కష్టాలకు వెరవలేదు. శారీరక లోపానికి శిరస్సు వంచలేదు. తోటి దివ్యాంగులకు తోడు నిలవాలనుకున్నారు. ఆపదలో ఉన్నవారికి ఆసరాగా ఉండాలనుకున్నారు. సాయం చేసేందుకు మేమున్నాం అంటూ ముందుకొచ్చారు. ఏకంగా ఫౌండేషన్ స్థాపించి అనేక సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. దాతల నుంచి అపూర్వ ఆదరణ పొందుతున్నారు. శారీరక లోపమున్నా మానసికంగా మహోన్నతులు అని పేరు గడించారు. ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులుమిన్న అని నిరూపిస్తున్నారు. వారే పొదిలికి చెందిన బత్తిన నరసింహారావు, దేవుళ్ల ఆంజనేయులు. ఆత్మస్థైర్యమే ఆలంబనగా సాగుతున్న వారి స్ఫూర్తిదాయకమైన జీవనశైలిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..



సేవలను గుర్తించి విశాఖపట్నంలో తాసుబెల్లి ఫౌండేషన్ నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న నరసింహారావు, ఆంజనేయులు

పొదిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పొదిలికి చెందిన నరసింహారావు, ఆంజనేయులు ఇద్దరు 1997లో పొదిలమ్మ పాఠశాలలో చదువుకునేవారు. నరసింహారావుకు ట్రైసైకిల్ ఉండేది. ఆంజనేయులుకు మూడుచక్రాల బండి ఉండేది. ఆంజనేయులు వాళ్ల అమ్మ తిరుపతమ్మ నరసింహారావు దగ్గరకు వచ్చి ఆంజనేయులును కూడా ట్రైసైకిల్‌పై తీసుకెళ్లాలని కోరింది. ఆ మరుసటి రోజు నుంచి ఇద్దరూ ట్రైసైకిల్‌పై బడికి వెళ్లేవారు. ఆ క్రమంలో ఇద్దరూ మంచి మిత్రులయ్యారు. కష్టాల్లో ఉన్నవారికి సాయపడాలనేది నరసింహారావు ఆలోచన. పైగా దివ్యాంగులు కష్టాల్లో ఉంటే చూస్తూ ఉండలేనితత్వం. ఆ ఆలోచన ఆంజనేయులుకు కూడా నచ్చింది. ఆ ఇద్దరూ తమ లాంటి దివ్యాంగులకు సేవ చేయాలని నిర్ణయించుకున్నారు. ఆపదలో ఉన్నవారికి 2009 నుంచి సాయం చేయడం మొదలు పెట్టారు. సేవా కార్యక్రమాల కోసం 2016 నుంచి దివ్యాంగుల రక్షక్ ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేశారు.

వారిద్దరికీ రుణపడి ఉంటాం

నా కుమార్తె అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. ఈ విషయం తెలుసుకొని దాతల ద్వారా నరసింహారావు, ఆంజనేయులు ఏడాదిపాటు నిత్యావసర సరుకులు అందించారు. అది చాలా ఆనందంగా ఉంది. వారి దయ వల్లే నా కుమార్తెకు రోజూ తిండి దొరికింది. వారిద్దరికీ ఎప్పుడూ రుణపడి ఉంటాం.

\- బాజీ

ఇలాంటి కొడుకు ఒక్కడైనా చాలు

అన్ని అవయవాలూ ఉండి ఎవరికీ చిన్న సాయం చేయలేనివారు చాలామంది ఉన్నారు. నా కొడుకును ఎత్తుకొని వస్తేగాని బండిమీదకు రాలేడు. అటువంటి స్థితిలో ఉండి కూడా పదిమంది ఆకలి తీరుస్తున్నాడంటే మాకు ఎంతో ఆనందంగా ఉంది. ఇలాంటి కొడుకు ఒక్కడు ఉన్నా చాలనిపిస్తోంది.

\-తిరుపతయ్య, ఆంజనేయులు తండ్రి

సేవలకు సత్కారం..


ఒంగోలు హాస్టల్‌లో 40 మంది విద్యార్థులకు చాపలు, వాటర్ బాటిళ్లు అందజేస్తూ..

రాష్ట్రంలో 130 స్వచ్ఛందసేవా సంస్థలను గుర్తించి వైజాగ్‌లో నిర్వహించిన భారత సేవారత్న పురస్కారాల్లో తాసుబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యాన నరసింహారావుకు సత్కారం జరిగింది. ఒంగోలుకు చెందిన నేచురల్ ఫౌండేషన్, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవుళ్ల ఆంజనేయులును సన్మానించారు. హైద్రాబాద్, చెన్నై, వైజాగ్ పట్టణాల్లో కొన్ని సంస్థలు సన్మానానికి ఆహ్వానించినా ఆర్థిక స్థోమతలేక వెళ్లలేకపోయినట్టు ఆంజనేయులు, నరసింహారావు తెలిపారు.

దాతల నుంచి అపూర్వ సాయం

- ఆ ఇద్దరి సర్వీసుకు మెచ్చి దాతలు వెంటనే సాయం అందిస్తున్నారు. దాతల సాయంతో తోటి దివ్యాంగులకు ట్రైసైకిళ్లు ఇప్పించారు. ఇప్పటి వరకు దాతల ద్వారా 5 ట్రైసైకిళ్లు, ప్రభుత్వం ద్వారా 15 ట్రైసైకిళ్లు అందించారు.
- పలువురి దగ్గర పక్కన పడేసి ఉన్న ట్రైసైకిళ్లను తీసుకొచ్చి ఫౌండేషన్ ద్వారా రిపేరు చేయించి ముగ్గురికి అందించారు. మరో ముగ్గురికి వీల్‌ఛైర్స్ ఇచ్చారు.
- కనిగిరి, దర్శి, రాజంపల్లి సమీపంలో ఉన్న వృద్ధాశ్రమాలకు కూడా దాతల సహాయంతో నగదు, బియ్యం, దుస్తులు అందించారు.
- వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని ఈ ఇద్దరూ సేకరించి ట్రైసైకిళ్లపై నిరుపేదల నివాస ప్రాంతాలకు తీసుకెళ్లి తిండిలేని వారికి అందిస్తున్నారు.
- పరీక్షలకు వెళుతున్న నిరుపేద విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామగ్రి అందిస్తున్నారు.
- రెండు నెలల క్రితం ఒంగోలులోని సంక్షేమ హాస్టల్‌లో ఉన్న 40 మంది విద్యార్థులకు చాపలు, వాటర్ బాటిళ్లు కూడా అందజేశారు.
- నాలుగు నెలల క్రితం విద్యుత్ షాక్‌తో రెండు చేతులు కోల్పోయిన బాధితుడికి దాతల ద్వారా ఆర్థిక సాయాన్ని అందించారు.
- పట్టణంలో మంచానికే పరిమితమైన ఒక దివ్యాంగురాలి కుటుంబ అవసరాలకు నెలకు రూ.రెండువేల చొప్పున ఏడాదిపాటు అందించారు.
- దాతలు చేసిన సాయంతో ఏ పని చేశాం? సాయాన్ని ఎలా ఉపయోగించాం? వాటి ఖర్చుల వివరం... తదితరాలన్నీ వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో అప్‌లోడ్ చేస్తున్నారు. అవి చూసినవాళ్లు ఫౌండేషన్ ఫోన్ నెంబరుకు కాల్ చేసి వీలైనంత సాయం అందిస్తున్నారు. ఆ విధంగా దాతల సంఖ్యను పెంచుతున్నారు.

తోటివారికి సేవ చేయడంలోనే ఆనందం


నరసింహారావు

పొదిలిలోని బెస్తపాలెం కాలనీకి చెందిన బత్తిన నరసింహారావు, వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు బత్తిన నరసింహారావు. ఈయనకు అక్క నరసమ్మ, భార్య రాధ ఉన్నారు. అంతా ఒక కుటుంబంగానే ఉన్నారు. సోడా సీసాల వ్యాపారం ఉంది. నరసింహారావు ట్రైసైకిల్‌పై పట్టణంలోని దుకాణాలకు సోడాలు వేసి వస్తుంటారు. ఇదే జీవన మార్గం. మరో ఆదాయం లేదు. ఉన్న కొద్ది ఆదాయంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. అమ్మ, నాన్నలకు చేదోడుగా ఉంటూ కొంత సమయం దివ్యాంగుల సేవకు కేటాయిస్తున్నారు.

బడ్డీ బంకు నిర్వహిస్తూ తోటివారికి సాయం



పట్టణానికి చెందిన దేవుళ్ల తిరుపతయ్య, నారాయణమ్మలకు ఏకైక కుమారుడు ఆంజనేయులు. పొగాకు బోర్డుకు వెళ్లే దారిలో పోలీస్ పెట్రోల్ బంక్ వద్ద చిన్న బడ్డీకొట్టు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. పుట్టుకతోనే దివ్యాంగుడు. బడ్డీకొట్టు ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబం నడుస్తోంది.

ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని సేవలు

ఫౌండేషన్‌కు నెలకు రెండువేలు అద్దె చెల్లిస్తున్నాం. అద్దె భారంగా మారింది. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే దాతల సహాయంతో చిన్న రేకులషెడ్డు ఏర్పాటు చేస్తాం. దివ్యాంగులు ఎక్కువ మంది వచ్చినప్పుడు ఉండటానికి ఉపయోగపడుతుంది. భోజనం తీసుకెళ్లేందుకు వాహనం ఏర్పాటు చేస్తే మరింత సర్వీస్ చేయడానికి ఉపయోగపడుతుంది.

\- నరసింహారావు, ఫౌండేషన్ నిర్వాహకుడు

ప్రభుత్వ వైద్యశాలలో నాణ్యమైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి


వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో మంచి వైద్యం అందుతుందనే నమ్మకంతో పేదప్రజలు వస్తున్నారని, వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వైద్యులకు సూచించారు. సోమవారం సాయంత్రం గిద్దలూరు ప్రాంతీయ ఆసుపత్రిని ఆయన పరిశీలించి రోగులతో మాట్లాడారు. వైద్య శాలలో వైద్యసదుపాయాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. వైసీపీ పాలనలో ప్రభుత్వ వైద్యశాల నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగా యని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న ప్పుడు 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే, గత వైసీపీ పాలకులు దానిని 40 పడకల ఆసుపత్రిగానే కుదించారన్నారు. వైద్యశాల నిర్మాణం చేపట్టిన మెగా కంపెనీ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించ కుండా డొల్లతనం ప్రదర్శించిందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్య క్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఆదామ్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

కంభం : కంభం ప్రభుత్వ వైద్యశాలలో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే పేదరోగులకు మెరుగైన వైద్యం అందించ డమే మనందరి బాధ్యత అని వైద్యులకు సూచించారు. సోమవారం ఆయన కంభం ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో వైద్యులతో మాట్లాడారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో వైద్యసేవలకు కంభం, బేస్తవార పేట, అర్ధవీడు మండలాల రోగులు అధికంగా వచ్చేవారన్నారు వైద్యశాలలో మెరుగైన వైద్యం అందుతుందని అప్పట్లో ఈ వైద్యశాలకు గుర్తింపు ఉండేదన్నారు. అయితే వైసీపీ హయాంలో నిర్వహణ సరిగా లేక రోగుల సంఖ్య తగ్గిందన్నారు. ప్రస్తుతం టీడీపీ పాలనలో వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యశాలలో ఆర్‌వో ప్లాంటు మరమ్మతులకు గురైందని, రోగులు తాగునీటికి ఇబ్బందులు పడుతు న్నారని, డెంటల్ క్లీనిక్‌లో ఎక్స్‌రే, జనరేటర్ చెడిపోవడంతో ఆపరేషన్ సమయంలో, ఇన్‌పేషంట్లకు ఇబ్బందిగా ఉందని తన దృష్టికి వచ్చిందన్నారు. అదే విధంగా అంబులెన్స్ లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై తాను తక్షణం ఆర్‌వో ప్లాంటును బాగు చేసేందుకు రూ.15వేలు మంజూరు చేసినట్లు వైద్యశాల సూపరింటెండెంట్ శిరీషకు తెలిపారు. మిగిలిన సమస్యలన్నింటిని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైద్యులు, ఇతర సిబ్బంది గతంలో ఉన్న పద్ధతులు మార్చుకుని రోగులకు సేవలు అందించాలన్నారు. వైద్యశాలలో మరుగుదొడ్లు శుభ్రంగా లేవని, మందులకు మాత్రమే ఇండెంట్ పెట్టాలని, అనవసరమైన మందులకు పెట్టవద్దన్నారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సమష్టిగా కృషి చేయాలి

పొదిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని దర్శి విద్యుత్ ఈఈ పి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ ప్రమాదాలను నివారిం చేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఏర్పాటు చేసిన ఫీజులు తక్కువ ఎత్తులో ఉన్నాయని దాని చుట్టూ చిల్లచెట్లు పెరిగాయని, వాటిని వెంటనే తొలగించడం ద్వారా ప్రమాదాలు నివారించ వచ్చని సిబ్బందికి సూచించారు. రైతులు మోటార్లు ఆన్ చేసే సమయంలో చేతులు తడిలేకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ వినియోగదారుడికి నాణ్యమైన, మెరుగైన సేవలు అందించాలన్నదే విద్యుత్‌శాఖ ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకు అధికారులు ఎప్పుడు లైన్లను పరిశీలిస్తుండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఇచ్చిన రాయితీలుపోను మిగిలిన బకాయిలను వసూలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మీ పరిధిలో విద్యుత్ పనులు జరుగుతున్నా, ప్రమాదాలు జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. హర్ ఘర్ సోలార్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం సోలార్ సిస్టంను ప్రతి ఇంటిలో ఏర్పాటు చేసుకొనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్ యూనిట్ ధర రూ.2.20 లక్షలు కాగా ప్రభుత్వ రాయితీ రూ.78వేలు ఇస్తుందన్నారు. లీఫ్ ఇండస్ట్రీస్ ప్రతినిధుల ద్వారా ఎక్కువ యూనిట్‌లు అయ్యేలా చూడాలని ఈ పథకంపై సిబ్బందికి అవగాహన కల్పించాల న్నారు. కార్యక్రమంలో ఏడీఈ డి.హరిబాబు, ఏఈ మోహన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు


హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ పోటీలను తిలకిస్తున్న ప్రేక్షకులు

సంతనూతలపాడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో సోమవారం రాత్రి జరిగిన 71వ ఆంధ్ర సీనియర్ పురుషులు, మహిళల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు మూడవరోజు హోరాహోరీగా సాగాయి. జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, హైదరాబాద్ డిఎస్‌పి అన్నుగోపాల్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రాభాస్కరరావు సెమీఫైనల్‌కు చేరిన జిల్లాల టీముల వివరాలను తెలిపారు. పురుషుల విభాగంలో తూర్పుగోదావరి జిల్లాతో శ్రీకాకుళం తలపడగా తూర్పుగోదావరి, కృష్ణాజిల్లాతో విశాఖపట్నం జిల్లా తలపడగా కృష్ణాజిల్లా, గుంటూరు జిల్లాతో పశ్చిమగోదావరి జిల్లా తలపడగా గుంటూరు, ప్రకాశం జిల్లాతో నెల్లూరు జిల్లా తలపడగా ప్రకాశం జిల్లా టీములు సెమీఫైనల్‌కు చేరినట్లు తెలిపారు. మహిళల విభాగంలో విజయనగరం జిల్లాతో విశాఖపట్నం జిల్లా తలపడగా విజయనగరం, కర్నూల్ జిల్లాతో శ్రీకాకుళం జిల్లా తలపడగా శ్రీకాకుళం, కృష్ణాజిల్లాతో గుంటూరు జిల్లా తలపడగా కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాతో చిత్తూరు తలపడగా చిత్తూరు జిల్లా టీములు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. పురుషుల విభాగంలో సెమీఫైనల్‌కు చేరిన ప్రకాశం, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల మధ్యన, మహిళల విభాగంలో విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణా, చిత్తూరు జిల్లాల మధ్య నేడు మంగళవారం తుదిపోరు కొనసాగుతుందని, ఫైనల్ పోటీలు కూడా మంగళవారమే జరుగుతాయన్నారు.

నిశిత పరిశీలన

- చిలకపాడులో పింఛన్లను తనిఖీ చేసిన అధికారులు
- ప్రభుత్వానికి ప్రత్యేక యాప్ ద్వారా సమాచారం
- తొలిరోజు 380 మందిని విచారించిన బృందాలు
- నేడు కూడా కొనసాగనున్న ప్రక్రియ


చిలకపాడులో లబ్ధిదారు నుంచి వివరాలు సేకరిస్తున్న అధికార బృందం

ఒంగోలు నగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒకే రోజు.. ఒకే గ్రామం.. 10 బృందాలు.. సామాజిక పింఛన్లను తనిఖీ చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం అనర్హుల చేతిలో ఉన్న పింఛన్లను రద్దు చేయడం, వాటిని అర్హులకు అందించడం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి తనిఖీ చేసింది. ఇందులోభాగంగా జిల్లాలోని సంతనూతలపాడు మండలం చిలకపాడులో సోమవారం అధికారుల బృందాలు పింఛన్ల లబ్ధిదారులను పరిశీలించాయి. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో జిల్లాలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి తనిఖీలు చేపట్టింది. ఆయా గ్రామాల్లోని అన్ని పింఛన్లను తనిఖీ చేశారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన చిలకపాడులో ఇతర మండలాల ఎంపీడీవోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు 10 బృందాలుగా ఏర్పడ్డాయి. ఒక్కో బృందం సోమవారం 40 పింఛన్ల వంతున పరిశీలన చేసింది. చిలకపాడులో మొత్తం పింఛన్లు 397 ఉండగా సోమవారం 380 మందిని బృంద సభ్యులు విచారించారు. వారితో అధికారులు స్వయంగా మాట్లాడారు. వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్నవారు వారి వయస్సు సక్రమంగా ఉందా లేదా.. వితంతు పింఛన్ తీసుకుంటున్న వారి భర్త చనిపోయిన వివరాలు, దివ్యాంగుల పింఛన్ పొందుతున్న వారి సదరమ్ సర్టిఫికెట్లను పరిశీలించారు. పింఛన్ తీసుకునేందుకు అర్హులా కాదా? అనే దిశగా పరిశీలన జరిపారు.

ప్రత్యేక యాప్‌లో నివేదన

ప్రభుత్వం ఈ పరిశీలన కోసం ప్రత్యేక యాప్‌ను కూడా ఏర్పాటు చేసింది. పింఛన్ పొందుతున్న వారిని ఈ బృందాల సభ్యులు కలిసి వారి వాస్తవిక వివరాలను తెలుసుకుని యాప్ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. సోమవారం పరిశీలన చేయగా మిగిలిపోయిన 17 మంది వివరాలను మంగళవారం కూడా పరిశీలన చేయనున్నారు. వీరు సోమవారం గ్రామంలో అందుబాటులో లేకపోవటంతో మంగళవారం గ్రామానికి పిలిపిస్తున్నారు. మంగళవారం ఒకటీ రెండు బృందాలే ఈ పరిశీలనలో పాల్గొననున్నాయి. బృందాలు చేసిన పరిశీలన వివరాలను గోప్యంగా ఉంచుతూ యాప్ ద్వారా మాత్రమే వాస్తవ పరిస్థితులను నమోదు చేశారు. లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులు, వారి ఇంటి కరెంటు బిల్లు వివరాలు, భూముల వివరాలు కూడా తెలుసుకుని యాప్ ద్వారా నమోదు చేశారు.

బోగస్‌ల ఏరివేతే లక్ష్యం

పింఛన్‌ల పరిశీలన ప్రక్రియను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ వరప్రసాదు, ఏపీ ఆన్‌లైన్ టెక్నికల్ సిబ్బంది నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఈ తనిఖీలతో జిల్లావ్యాప్తంగా ఉన్న బోగస్ సర్టిఫికెట్లతో పింఛన్ పొందుతున్నవారు, అర్హులుకాని వారిలో వణుకు మొదలైంది. వారు తమ పింఛన్ రద్దుకాకుండా చూసుకునేందుకు మార్గాలను అన్వేషిస్తున్నారు. వైసీపీ పాలనలో పింఛన్లను అర్హులకు కాకుండా పార్టీకి చెందిన వారికి ఇబ్బడిముబ్బడిగా మంజూరుచేశారు. సదరమ్ సర్టిఫికెట్లు అయితే పింఛన్ల కోసం ఇష్టానురీతిగా జారీచేశారు. ఈ సర్టిఫికెట్లను సమర్పించి దివ్యాంగుల పింఛన్లను పొందుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన తనిఖీలు కొద్దిరోజుల్లోనే అన్ని గ్రామాల్లో నిర్వహించే అవకాశం ఉంది. బోగస్‌లను ఏరిపారేసి వారి స్థానంలో అర్హులకు అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది.

అవీ..ఇవీ


సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

క్రీస్తు మార్గం అనుసరణీయం

- ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కరునామయుడు, ప్రేమ స్వరూపి ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం అని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ అన్నారు. క్లౌ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మిషన్ కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దామచర్ల కేక్ కట్ చేసి ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు విలియంకేరీ, పాస్టర్ ఏలియాతోపాటు, చర్చి ప్రతినిధులు కొమ్మూరి రవికుమార్, టీడీపీ నాయకులు కొమ్మూరి రవిచంద్ర, గొల్లపూడి బాబూరావు, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.


దుస్తులు స్వీకరించిన క్రీడాకారులతో పాఠశాల ఉపాధ్యాయులు

క్రీడాకారులకు దుస్తుల బహూకరణ

కొత్తపట్నం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రీడల పోటీల్లో రాణిస్తున్న విద్యార్థులకు అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చక్కా కోటేశ్వరరావు క్రీడా దుస్తులను బహూకరించారు. కొత్తపట్నంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చక్కా కోటేశ్వరావు తన సొంత ఖర్చుతో క్రీడా దుస్తులను సమకూర్చారు. ఈ దుస్తులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని మన్నం శ్రీదేవి చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలప్రధానోపాధ్యాయిని శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడల్లోనే కాకుండా జాతీయ స్థాయి క్రీడల్లో కూడా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ వంశీకృష్ణారెడ్డి, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు, క్రీడాఉపాధ్యాయులు సాయి కిషోర్, ఫయాజ్, డెన్షన్ తదితరులు పాల్గొన్నారు.


నారాయణస్వామి వర్ధంతి సభలో మాట్లాడుతున్న చిట్టిపాటి

ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : దేశాన్ని కార్పొరేట్ శక్తుల కంబంధహస్తాల్లోకినెట్టిన ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా ప్రతిఘటన పోరాటాలు నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయంలో సోమవారం మాదాల నారాయణస్వామి 11వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. కే నాంచర్లు అధ్యక్షతన జరిగిన సభలో చిట్టిపాటి మాట్లాడుతూ నారాయణస్వామి 68 ఏళ్ల పాటు కమ్యూనిస్టుగా తన పోరాట జీవితాన్ని కొనసాగించారన్నారు. అంతకుముందు మైనంపాడులోని నారాయణస్వామి స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్, ఆర్ మోహన్, బి. పద్మ, చొప్పర జాలన్న ఉన్నారు.

నవోదయలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఒంగోలు విద్య, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక నవోదయ విద్యాలయంలోపూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థులను విద్యాలయ ప్రిన్సిపాల్ గీతాలక్ష్మి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా గీతాలక్ష్మి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సూచనలు, సలహాలు, విద్యార్థుల భవిష్యత్‌కు దోహదపడతాయన్నారు. ఎస్‌బీఐ మేనేజర్ వి. కిరణ్‌కుమార్, కేవీకే చైతన్య సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఐ. ప్రశాంతి, ఉపాధ్యాయుడు కె. రాము, గీతేశ్వర్, ఫార్మసీ అధికారి రత్నాకర్‌లు సమ్మేళనంలో పలు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమానికి సీహెచ్ అయ్యన్న, బి.చంద్రశేఖర్‌రెడ్డిలు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం


మీకోసంలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపు హాలులో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)లో వివిధప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ మాట్లాడుతూ పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని ఆదేశించారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లో అర్జీలు పెండింగ్‌లో ఉంచరాదని సూచించారు. అధికారులు ప్రతిరోజూ లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 223 అర్జీలను అధికారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరకుమార్‌తో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

పశువులు మేపు భూములను కాపాడాలి

జిల్లాలోని అనేక గ్రామాల్లో పశువులు, గొర్రెలు, మేకలు మేపుకోనేందుకు ప్రభుత్వం కేటాయించిన భూములను కొందరు ఆక్రమించుకొని దొంగ పట్టాలు పుట్టించుకున్నారని ద్రావిడ దేశం అధ్యక్షుడు వి. కృష్ణారావు సోమవారం జిల్లా రెవెన్యూఅధికారి చిన ఓబులేషును కలిసి ఫిర్యాదు చేశారు. పుల్లలచెరువు మండలం మానేపల్లి, అయ్యవారిపాలెం, సిద్దనపాలెం గ్రామాల్లోని 152, 152/2 సర్వే నెంబరుగల భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఆయా భూములపై సమగ్ర విచారణ చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి


మాట్లాడుతున్న రుద్రకోటి

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీ సంక్షేమానికి పెద్ద పీట వేసిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు అని, ఆయన బాటలోనే ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ద్వారానే బీసీల అభ్యున్నతి సాధ్యపడుతుందని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం పేర్కొన్నారు. సోమవారం స్థానిక హైదరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్ రెడ్డి 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి, ఒక్కపైసా నిధులు ఇవ్వకుండా ఘోరంగా మోసం చేశారన్నారు. కార్పొరేషన్‌లకు కేటాయించిన నిధులు కూడా నవరత్నాలకు మళ్లించారని ఆరోపించారు. అందువలనే బీసీలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని తెలిపారు. అంతే కాకుండా బీసీ సంక్షేమ పథకాలను, ఆదరణ పథకాలను నిలిపివేయడంతో రాష్ట్రంలోని బీసీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయాలలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ. 15వేల వేతనాన్ని రూ. 25వేలకు పెంచారన్నారు. అలయపాలక మండళ్లలో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుదే అన్నారు. ఈ సమావేశంలో నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం. రమేష్, నాదెండ్ల రాఘవ్, కే. రామకృష్ణ, ఎస్. యలమందరావు, పి. మధు, వెంకట్రావు, కనకారావు తదితర నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చిలకపాడులో పెన్షన్‌ల పరిశీలన


చిలకపాడులో పెన్షన్ల తనిఖీకి వచ్చిన బృందం

సంతనూతలపాడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనర్హత కలిగిన పెన్షన్‌దారుల వివరాల సేకరణకు పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోని చిలక పాడు సచివాలయం ఎంపికైందని, ఈక్రమంలో సోమవారం గ్రామంలో 397 మంది పెన్షన్‌దారులను పక్కమండలాలకు చెందిన అధికారులు పరిశీలించినట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ఒక ప్రత్యేకమైన యాప్ ద్వారా ఇంటింటికీ తిరిగి సర్వేచేసినట్లు ఆయన తెలిపారు. ఏప్రాతిపదికన, ఏ అర్హతతో లబ్ధిదారులను ఎంపికచేశారో అనేవాటిపై మొత్తం 10 బృందాలు పెన్షన్‌దారుడి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు వివరాలతో యాప్ ద్వారా పరిశీలించినట్లు తెలిపారు. ఒకవేళ అనర్హత కలిగి ఉంటే ఆ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో వెంటనే రాష్ట్రస్థాయి అధికారులకు వెళ్లిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో చిలకపాడు పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్.ప్రతాప్‌లు అధికారులకు దగ్గరుండి లబ్ధిదారుల చిరునామాను తెలిపారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

నాగులుప్పలపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి బేబిరాణి సూచించారు. పోతవరం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి బేబిరాణి మాట్లాడుతూ ప్రజలు రెవెన్యూ సమస్యలపై సదస్సులో అర్జీలను అందిస్తే అధికారులు రసీదు అందించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. సమస్యను పరిశీలించి సత్వర అవకాశం ఉన్న వాటిని గ్రామసభలోనే పరిష్కరిస్తామని తెలిపారు. సత్వర పరిష్కారం కాని వాటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. సదస్సులో 25 అర్జీలు రాగా ఒకటి తక్షణమే పరిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి


తాలూకా ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తున్న అర్జునరావు తదితరులు

ఒంగోలు (క్రైం)డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాపు సంఘం అధ్యరంలో ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు , మంత్రి లోకేష్ లుపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు, శ్రీరెడ్డి, జోగిరమేష్, పోసాని కృష్ణమురళిపై విడివిడిగా చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును తాలుకా ఎస్సై సందీప్‌కు అందజేశారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్ అధ్యక్షుడు గొర్రెపాటి అర్జునరావు, జనరల్ సెక్రటరీ కె.చెన్నకేశవనాయుడు,గోపిశెట్టి దుర్గ, తోట రామారావు తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో చీమకుర్తి చిన్నారుల విజయభేరి


చిన్నారులను అభినందిస్తున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి):జాతీయ స్థాయి కరాటే-కుంగ్‌ఫూ పోటీల్లో చీమకుర్తి విద్యార్థులు ప్రతిభచాటి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. చిలకలూరిపేటలో జరిగిన పోటీల్లో చీమకుర్తికి చెందిన తథాగత్ బోధి ధర్మ మార్షల్ ఆర్ట్స్ సంస్థలో మాస్టర్ డీఎస్‌వీ సుధాకర్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఎల్.రేణుశ్రీ, టీ.సాయి సునంద, ప్రహ్లదిక, డీ.లక్ష్మి, జి.తేజస్, డి.వెంకటసాయి, పి.గురువిష్ణు, పి.కౌస్తులు బంగారు పతకాలు సాధించారు. విద్యార్థులు, కోచ్ సుధాకర్‌ని సోమవారం చీమకుర్తి సీఐ సుబ్బారావు అభినందించారు.

తూర్పునాయుడుపాలెం హైస్కూల్‌లో వనం-మనం

టంగుటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎన్‌వీ సుధారాణి, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ క్లైయిమ్స్‌ను పరిష్కరించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ డిమాండ్‌చేశారు. ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దారుణంగా ఉందన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి నిర్మాణదారులకు ఉచితంగా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జేసీ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి. అవులయ్య, ఆర్. మాలకొండయ్య, థామస్, ఎన్. శ్రీనివాసులు, డి. ఆనందరావు, వై సింగరయ్య తదితరులు ఉన్నారు.

మద్దిపాడులో పారిశుధ్య పనులు

మద్దిపాడు, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి):మద్దిపాడు గ్రామంలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య పనులను కార్యదర్శి నూరుల్లా ఆధ్వర్యంలో చేపట్టారు. ఎస్సీ కాలనీలో మురుగు కాలువలలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో గ్రామస్థులు సమస్యను కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి పారిశుధ్య కార్మికులతో కాలువల్లో మురుగును తొలగించారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

టంగుటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని సింగరాయకొండ సీఐ హజరత్తయ్య అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా శిరస్త్రాణం ధరించాలని సూచించారు. స్థానిక టోల్‌ప్లాజా వద్ద ఆయన సోమవారం ఎస్సై నాగమల్లేశ్వరరావుతో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయబోమని, రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామని వారితో ప్రమాణం చేయించారు.

అప్రంటీస్‌మేళాలో 43మంది విద్యార్థుల ఎంపిక

ఒంగోలు విద్య, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో సోమవారం జరిగిన ప్రధానమంత్రి జాతీయ అప్రంటీస్ మేళాలో 43 మంది విద్యార్థులు ఎంపికైనట్లు అప్రంటీస్ సలహాదారు, ప్రధానాచార్యులు ఎంవీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేళాకు 72 మంది విద్యార్థులు హాజరు కాగా 43 మంది అప్రంటీస్ షిప్ శిక్షణకు ఎంపికయ్యారన్నారు. ఈ ఎంపికలో ఎంప్లాయిమెంట్ అధికారి టి. భరద్వాజ్, డీఎస్‌డీవో జే రవితేజలు పాల్గొని విద్యార్థులకు మేళాపై అవగాహన కల్పించారు.

సోనియా జన్మదిన వేడుకలు

ఒంగోలు(క్రైం)డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, రాష్ట్రకాంగ్రెస్ కార్యదర్శి ఈదా సుధాకర్‌రెడ్డి , నాయకులు మల్లికార్జునరావు, మన్నం ప్రసన్నరాజు, సుదర్శ రవిపాల్గొన్నారు


కొప్పోలు రోడ్డులోని ఇందిరా కాలనీలో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఒంగోలు నగర మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు,ఆర్అండ్‌బీ ఈఈ గోపినాయక్

రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు

- వెంటనే తొలగించండి
- ఆక్రమణదారులకు కమిషనర్ వెంకటేశ్వరరావు హెచ్చరిక

ఒంగోలు(రూరల్),డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు - కొప్పోలు నాలుగు వరుసల రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేయవద్దని, అలాంటి నిర్మాణాలు ఉంటే వెంటనే తొలగించుకోవాలిని ఒంగోలు నగర మునిసిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఒంగోలు నగరం కొప్పోలు ఆర్అండ్‌బీ నాలుగు వరుసల రోడ్డు రైల్వే ఫ్లైఓవర్ వంతెన దగ్గరనుంచి జాతీయ రహదారివరకు ఉన్న ఆక్రమణలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్‌మాట్లాడుతూ మార్కింగ్‌ను దాటి రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, ఇది మంచిపద్ధతి కాదని అన్నారు. వెంటనే రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేసే వారు ఆయా పనులను నిలిపివేయాలని సూచించారు. త్వరలో ఈ రోడ్డు మార్జిన్‌లలో సైడుకాలువలు నిర్మాణాలు చేపడతామని, ఆలోపు ఆక్రమణలు తొలగించుకోకుంటే తామే తొలగించేస్తామని కమిషనర్ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఒంగోలు మండల తహసీల్దార్ కె.వాసు, మండల సర్వేయర్ నాళం వెంకటేశ్వర్లు, మునిసిపల్ ,ఆర్అండ్‌బీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు చెక్కును అందజేస్తున్న రేగుల వీరనారాయణ

కళాశాల అభివృద్ధికి దాతల చేయూత

మర్రిపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆలోచన మేరకు రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు విజయవంతమైన నేపథ్యంలో ఆ స్ఫూర్తితో విద్యా సంస్థల అభివృద్ధికి పలువురు దాతలు ముందుకొస్తున్నారు. మర్రిపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణం ఐదు సంవత్సరాల క్రితం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో విద్యార్థినీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో కళాశాల ప్రిన్సిపాల్ చొరవతీసుకొని సోమవారం గ్రామపెద్దలు, నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా విద్యార్థినిలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకొచ్చారు. అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణానికి చేయూతనందించాలని కోరారు. దీంతో కెల్లంపల్లికి చెందిన టీడీపీ నాయకుడు అవదారి సుబ్బారావు రూ.20 వేల సాయాన్ని ప్రకటించడంతోపాటు ఆ మొత్తాన్ని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ చేతుల మీదుగా ప్రిన్సిపాల్ అల్లూరయ్యకు అందజేశారు. విశ్రాంత ఎంఈవో రామ్‌ప్రసాద్ మరో రూ.10వేలు విరాళాన్ని ప్రకటించారు. ఈ డబ్బుతో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తవుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. అడిగిందే తడవుగా చేయూతనందించిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

మద్దిపాడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.జ్యోతి అన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద రైతులు పండ్ల తోటలు వేసుకోవాలని, పొలాల్లో మెరక పనులు చేపట్టాలని ఆమె అన్నారు. ప్రతి కూలీకి పనులు కల్పించే బాధ్యత ఉందని, రైతులు పొలం గట్లపై పండ్ల మొక్కలను నాటాలని ఆమె సూచించారు.

క్రైం సమాచారం

చెన్నుపాడులో యువతి ఆత్మహత్య


యువతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అనూక్

పొన్నలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపాడు గ్రామానికి చెందిన గుత్తి మౌనిక (22) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై అనూక్ కథనం ప్రకారం.. మౌనిక తల్లి ఏడాది క్రితం మృతి చెందింది. తాను కూడా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనేపథ్యంలో సోమవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈమేరకు మౌనిక తండ్రి అంజయ్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


గుర్తుతెలియని మృతదేహం

టంగుటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు ఉత్తర బైపాస్‌లో ఆచూకీ తెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం పోలీసులు కనుగొన్నారు. అతని వయసు 40 ఏళ్ల లోపు ఉంటుంది. నీలిరంగు జీన్ ప్యాంటు, కృష్ణ బులుగు రంగు చొక్కా ధరించి ఉన్నాడు. కాలర్‌పైన టాన్ ట్యాట్స్ టైలర్స్, చిలకలూరిపేట అని రాసి ఉందని ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తనకు కానీ, సింగరాయకొండ సీఐ, ఒంగోలు డీఎస్పీలలో ఎవరికైనా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

చీమకుర్తిలో గంజాయి పట్టివేత

చీమకుర్తి,డిసెంబరు(ఆంధ్రజ్యోతి):చీమకుర్తి పట్టణంలో ప్యాకెట్ల రూపంలో గంజాయిని తీసుకెళ్తున్న మహిళ డి.భాగ్యమ్మను అదుపులోకి తీసుకొని ఆమె నుంచి కేజీన్నర గంజాయిని స్వాధీనపరచుకున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.గంజాయి విక్రయాలు,రవాణా చేస్తే కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఉరివేసుకొని వాచ్‌మన్ ఆత్మహత్య

ఒంగోలు (క్రైం)డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని సాయిబాబాగుడిలో వాచ్‌మన్‌గా పనిచేసే గజ్జలకొండ వెంకటేశ్వర్లు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానిక రాజీవ్ నగర్‌లో సోమవారం సాయత్రం జరిగింది. వివరాలలోకి వెళితే వెంకటేశ్వర్లు సాయిబాబా గుడిలో వాచ్‌మన్‌గా పనిచేస్తూ రాజీవ్‌నగర్‌లో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాడు. ఇంటిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని మృతిచెందాడు. ఆయన భార్య సాయిబాబా గుడి వద్ద ఇస్త్రీ బంకు నిర్వహిస్తారు. అయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె కాలేజీ నుంచి వచ్చే సరికి ఇంటిలో ఉరివేసుకొని మృతిచెందాడు. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి వెంకటేశ్వర్లును కిందకు దించారు. వెంకటేశ్వర్లు భార్య ఒంగోలు వన్‌టౌన్‌పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవీ..ఇవీ

విద్యుత్ శాఖ అధికారుల తనిఖీ


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తర్లుపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్‌శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మార్కాపురం ఏడీఏ పీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 37 బృందాలుగా విడిపోయి 33 గ్రామాల్లో 2532 సర్వీస్‌లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 36 మందిపై కేసులు నమోదు చేశారు. రూ.1.36లక్షల అపరాద రుసుం విధించినట్లు నాగేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో ఒంగోలు డీఈ హైమావతి, డీఈఈలు ఎన్‌సీయూ నాయక్, హనుమంత నాయక్, కమ్మం, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి


ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అందె నాసరయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాసరయ్య మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ26వేలు ఇవ్వాలన్నారు. బదిలీ అయిన కార్మికుల వారి పిల్లలకు వేతనంతో పాటు పెన్షన్ ఇవ్వాలన్నారు. పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు, దుస్తులు ఇవ్వాలన్నారు. పలు సమస్యలను వివరిస్తు కమిషనర్ డీవీఎస్ నారాయణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు హరిబాబు, మార్కాపురం శాఖ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు దరగయ్య, మహిళా నాయకురాళ్లు కాశింబీ, కోటమ్మ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి షేక్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి

- ఆత్మ డీపీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు


మిరపతోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దారవీడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసిన పంటలలో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఆత్మ డీపీడీ ఎం.సుబ్రమణ్యేశ్వరరావు అన్నారు. మండలంలోని గొబ్బూరు, దేవరాజుగట్టు గ్రామాల పరిధిలో సాగుచేసిన శనగ, కంది, మిరప, వరిగ పంటలను జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్రమణేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం పూత, కాయదశలో ఉన్న కందిలో గింజ పరిమాణం పెరగడానికి 13-0-45ను వినియోగించాలన్నారు. మిరపలో ఎకరాకు 35 కిలోల ఎర్రపొటాషియం, 10 కిలోల యూరియాను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జి.రమేష్, వ్యవసాయాధికారులు ఏశైలజ, వి.వి.శేషమ్మ, బుజ్జిబాయ్, విస్తరణాధికారులు సునీల్‌నాయక్, సౌజన్య పాల్గొన్నారు.

జార్జ్ కళాశాలకు నాక్'ఏ' గుర్తింపు


కేక్ కత్తిరిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): స్థానిక జార్జి ఇంజనీరింగ్ కళాశాల కు నాక్'ఏ' గుర్తింపు లభించినట్లు మాజీ మంత్రి, కళాశాల సాంకేతిక సలహాదారు ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. స్థానిక జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివరాలు వెల్లడించారు. అన్నిరంగాల్లో వెనుకబడిన మార్కాపురం డివిజన్ కేంద్రంలో పేద విద్యార్థులకు కూడా సాంకేతిక విద్యనందించాలన్న గొప్ప ఆశయంతో డాక్టర్ శామ్యూల్ జార్జ్ కళాశాలను స్థాపించారన్నారు. గత 28 సంవత్సరాలుగా జార్జ్ విద్యాసంస్థలు విలువలతో కూడిన విద్యనందిస్తున్నాయన్నారు. కళాశాలలో ఉత్తమబోధన, నాణ్యతా ప్రమాణా లను పాటించడంలో ముందుండడంతోనే నాక్'ఏ' గుర్తింపు లభించిం దన్నారు. త్వరలో అటానమస్ గుర్తింపు కూడా లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులతో కలిసి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కేక్ కత్తిరించి అందిరకీ పంచి పెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, డీన్ ఎం.మస్తానయ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీమందులు అమ్మితే కఠినచర్యలు


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో

పొదిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నకిలీ పురుగు మందులు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని ఏవో జైన్‌లుబ్దీన్ అన్నారు. పట్టణంలో సోమవారం పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలకు పంటలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. పురుగు మందులు పిచికారి చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారన్నారు. అది అదునుగా చేసుకొని దుకాణ యజమానులు రైతులకు నకిలీ మందులు ఇచ్చి ఇబ్బందులకు గురి చేయరాదన్నారు. అదేవిధంగా రైతులు కొనుగోలు చేసిన పురుగుమందులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. బిల్లు ఇవ్వకపోయినా, స్టాకు రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోయినా చర్యలు ఉంటాయన్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

గిద్దలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా రాచర్ల మండలం చినగానిపల్లెలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పగడాల రంగస్వామి కేక్ కట్ చేశారు. ప్రజలకు, పార్టీ శ్రేణులకు స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల షేక్ జమాల్, నాగేశ్వరరావు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

చెన్నారెడ్డిపల్లిలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి




చెన్నారెడ్డిపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్, ఎల్.కోటలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

తర్లుపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలు పరిష్కారమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి, తాడివారిపల్లెలో రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో వచ్చిన అర్జీల్లోని సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి 45 రోజులలోపు ఖచ్చితంగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

చెన్నారెడ్డిపల్లెలో సర్వే నెం.150-2లో 1.18 ఎకరాలు, 156-2లో 90 సెంట్ల భూమిని గతంలో వైసీపీ నాయకుడు అక్రమంగా ఆక్రమించుకున్నాడని గుమ్మా ఆది విష్ణు అర్జీ ఇచ్చారు. 93-3లో 80 సెంట్లు, 96-1లో 96 సెంట్ల భూమిని గతంలో పనిచేసిన వీఆర్‌వో కాశీశ్వరరెడ్డి అవినీతికి పాల్పడి వేరే వాళ్లకు ఆన్‌లైన్ చేయించారని గొలమారి శ్రీనివాసులరెడ్డి అర్జీ ఇచ్చారు. 170-1లో 2.45 ఎకరాల భూమిని వైసీపీ నాయకులు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారని టి.పెద్దక్క అర్జీ ఇచ్చారు. 20-2లో కూడా 1.94 ఎకరాల భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారని అశోక్ అనే రైతు అర్జీ సమర్పించారు. 2015-16లో పనిచేసిన వీఆర్‌వో కాశీశ్వరరెడ్డి అనేక అక్రమాలకు పాల్పడి ఒకరి భూములు ఒకరికి ఆన్‌లైన్ చేయించారన్నారు. అసైన్‌మెంట్ భూములు ఇప్పిస్తానని పేదలను కూడా మోసం చేశాడని పలువురు ఫిర్యాదులు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైసీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పేదల భూములు అడ్డగోలుగా కొల్లగొట్టిన వారి భరతం పట్టేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో వస్తున్న భూసమస్యలను పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమార్కులపై వెంటనే కేసులు నమోదు చేయించాలని తహసీల్దార్ యు.భాస్కర్‌ను ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డి.శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఈవోఆర్‌డీ సుకుమార్, సర్వేయర్ సురేష్ కుమార్, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


మోడంపల్లి అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేక అధికారి రవికుమార్

పెద్దారవీడు : ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. మండలంలోని బోయలదుంపలలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలలో సమస్యలను నిబద్ధతతో పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది పనిచేయాలన్నారు. బోయలదుంపల రెవెన్యూ సదస్సులో 17 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ శైలేంద్రకుమార్ తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఖలీల్, ఎంఆర్ఐ గోపి, వీఆర్వోలు, ప్రజలు పాల్గొన్నారు.

కంభం : అపరిష్కృతంగా ఉన్న భూముల పరిష్కారానికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎల్.కోట గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో వైసీపీ ప్రభుత్వం 'ల్యాండ్ టైటిల్ యాక్ట్' కింద రైతుల భూములు కాజేసేందుకు చేసిన కుట్రను కూటమి ప్రభుత్వం అడ్డుకోవడమే కాకుండా రద్దు చేసిందన్నారు. వైసీపీ పాలనలో రైతాంగం అనేక ఇబ్బందులకు గురైందన్నారు. నాడు ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే 'ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయడమే కాకుండా మోటార్లకు మీటర్లు బిగించేందుకు స్వస్తి చెప్పారన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని కోరుకునే ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్ ఎంపీడీవో వీరభద్రాచారి, సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు, టీడీపీ మండల నాయకులు తోట శ్రీనివాసులు, కార్యదర్శి మల్లికార్జున, మాజీ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసులు, ఎస్సీ నాయకులు గోన చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు : మండలంలోని మోడంపల్లి గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ ప్రత్యేకాధికారి టి.రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ భూ సమస్యలపై 23 అర్జీలు వచ్చాయి. పారదర్శకంగా అర్జీలను పరిశీలించి న్యాయం చేస్తామని ప్రత్యేక అధికారి రవికుమార్ ఈసందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు భాస్కర్‌రావు, వీఆర్‌వో వై.పి.రంగయ్య, దేమా శ్రీరాములు, శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని జమ్మనపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు సందర్భంగా రైతులు పొలాలకు వెళ్లేందుకు ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించినట్లు తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామసభలో తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో రైతులకు ఉన్న రస్తా సమస్యలను ఇరువర్గాల వారితో మాట్లాడి పరిష్కరించినట్లు తెలిపారు. ఎక్స్‌కవేటర్ సాయంతో రస్తా మార్గాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ గ్రామసభలో గ్రామస్థుల వద్ద నుండి 39 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వాటిలో 7 అర్జీలు రస్తాకు సంబంధించినవి కాగా 2 జనన, ధ్రువీకరణ పత్రాల మంజూరుకోసం వచ్చాయి. కార్యక్రమంలో సర్వేయర్ సంజీవయ్య, వీఆర్‌వో బాష, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

మార్కాపురం : తనకు వారసత్వంగా వచ్చిన భూమిని సమీప బంధువు వెంకట్రావు గతంలో అధికారుల అండతో ఆన్‌లైన్ నమోదు చేయించుకున్నాడని, కొమరోలు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన తోట మూర్తెయ్య సోమవారం మీ కోసం కార్యక్రమంలో అర్జీ అందజేశాడు. ఇప్పుడు తనను ఇబ్బందులు పెడుతున్నాడన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమంలో మొత్తం 19 అర్జీలు దాఖలయ్యాయి. వాటిల్లో ఎక్కువ భాగం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు అధికారులకు అందాయి. కార్యక్రమంలో డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు


మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధరకల్పించి న్యాయం చేస్తుందని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని విశ్వనాథపురం ఎండూరివారిపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ధాన్యం సేకరించిన 24 గంటలలోనే రైతుల ఖాతాల్లో నగదును జమ చేసే వీలు కూడా కల్పించిందన్నారు. దళారులను నమ్మవద్దని, ప్రతిరైతూ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. గతంలో ఇక్కడ చాలా అవినీతి జరిగిందని, ప్రస్తుతం పారదర్శకంగా కేంద్రాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో నీరజ, టీడీపీ నాయకులు ఎం.వలరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, డి.చలమయ్య, నాసరరెడ్డి, జి.వెంకటనారాయణ, కె.కొండలు, బి.వెంగళరెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అందరికీ ఇసుకను అందుబాటులో ఉంచేందుకు కృషి

మార్కాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అందరికీ అందుబాటులో ఇసుకను ఉంచేందుకే కూటమి ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలో నిల్వకేంద్రాన్ని ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక బోడపాడు రోడ్డులో నియోజకవర్గస్థాయి ఇసుక నిల్వకేంద్రాన్ని సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుకను ప్రజలకు అందుబాటులో లేకుండా చేశారన్నారు. దీంతో ఒకవైపు కార్మికులు పని లేక, మరోవైపు భవన నిర్మాణదారులు అధిక ధరలతో తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చిందన్నారు. గత ప్రభుత్వ పాపాలతో నిర్మాణరంగం కుదేలై, తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక విధానాన్ని ప్రకటించి ప్రజలకు అందుబాటు ధరలో ఇసుకను అందిస్తోందన్నారు. నిల్వ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మైనింగ్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తొలి సమావేశంలో వైసీపీలో పొడచూపిన విభేదాలు

గిద్దలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల అనంతరం తొలిసారిగా గిద్దలూరులో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి వైసీపీ కార్యకర్తల సమావేశంలోనే అసంతృప్తులు పొడచూపాయి. కొందరు ముఖ్య నాయకులు అసలు సమావేశానికే రాలేదు. కార్యకర్తలకు భరోసా ఇవ్వాల్సిన ఆవశ్యకత గురించి మాజీ ఎంపీపీ ప్రసంగిస్తున్న సమయంలో ఆయన ప్రసంగానికి మరో మాజీ ఎంపీపీ అడ్డు తగిలారు. దీంతో సభ రసాభసగా మారింది. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కుందూరు నాగార్జునరెడ్డి, ఇతర నాయకులు సర్ది చెప్పడంతో గొడవ సర్దుమనిగింది. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కుందూరు నాగార్జునరెడ్డి అధ్యక్షతన స్థానిక విఠా.సుబ్బరత్నం కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, వైసీపీ పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జడ్‌పి చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే అయిన బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఈవీఎంలపై పాతపాటే పాడారు. ప్రజలు వ్యతిరేకంగా తమకు ఓటువేశారని తాము అనుకోవడం లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇస్తే అవి అవుతుందన్న ధీమా ప్రజల్లో ఉండేదన్నారు. ఎన్నికల ముందు మాగుంటకు అధికంగా క్రాస్ ఓటింగ్ జరుగుతుందని తనకు అందరూ చెప్పారని, కానీ ఎన్నికలు అయ్యాక చూస్తే ఎమ్మెల్యే మెజారిటీలతో పోలిస్తే ఎంపీ ఓట్లలో తనకే సుమారు 50వేల అధికంగా ఓట్లు వచ్చాయని పేర్కొన్నారు. రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పరిపాలనను గాలికి వదిలివేసిందని విమర్శించారు.. వైసీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా చేస్తామని జగన్ మాటగా తాను చెబుతున్నానని పేర్కొన్నారు.

పలువురు నేతలు గైర్హాజరు

నియోజకవర్గంలో తొలిసారిగా జరిగిన సమావేశానికి వైసీపీలోని పలువురు ముఖ్య నాయకులు గైరుహాజరు కావడం గమనార్హం. కారణాలు ఏవైనా అర్థవీడు ఎంపీపీ వెంకటరావు, జడ్పీటీసీ సభ్యుడు చెన్ను విజయ, రాచర్ల ఎంపీపీ ఖాశింబీ, కొమరోలు ఎంపీపీ కామూరి అమూల్య సమావేశానికి డుమ్మా కొట్టారు. గత ఎన్నికల్లో టికెట్ ఆశించిన కామూరి రమణరెడ్డికి, వర్గీయులు కూడా సమావేశానికి డుమ్మా కొట్టగా వీరికి సమావేశం ఉందంటూ, రావాలంటూ ఆహ్వానం అందనట్లు తెలియ వచ్చింది.

సభలో గందరగోళం

అర్థవీడు మాజీ ఎంపీపీ గొటికె రాజేశ్వర్‌రెడ్డి సమావేశానికి హాజరై మాట్లాడుతూ తనకు కూడా ఈ సమావేశానికి హాజరు కావాలని ఎవరూ పిలువలేదన్నారు. అయినప్పటికీ తాను వైసీపీ కార్యకర్తను కావడంతో సిగ్గు లేకుండా పిలువక పోయినా వచ్చానన్నారు. ఈ సందర్భంలో బేస్తవారపేట మాజీ ఎంపీపీ వెంకటరాజు అతని ప్రసంగానికి అడ్డు తగిలాడు. గత ఎన్నికల్లో నీవు వైసీపీకి ఓట్లు వేయించలేదని, టీడీపీ అభ్యర్థికి పని చేశావని విమర్శించడం గమనార్హం.

సూపర్ సిక్స్ పథకాల అమలులో టీడీపీ విఫలం

వైసీపీ రీజనల్ కోఆర్డీనేటర్ నాగేశ్వరరావు


మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల అమలులో చంద్రబాబునాయుడు విఫలమయ్యారని, వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం ఎర్రగొండపాలెంలోని వైష్ణవి గార్డెన్స్‌లో వైసీపీ నాయకుల ఆత్మీయ సమావేశాన్ని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కో-ఆర్డీనేటర్ తోపాటు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి పాల్గొని కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డికి టికెట్ ఇస్తే గెలిపించుకుంటానని చెప్పిన బాలినేని ఎక్కడ ఉన్నావు. అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనను ఎంపీ అభ్యర్థిగా నిలబెడితే ఈ ప్రాంతంలో 52వేలు క్రాస్ ఓటింగ్ జరిగిందన్నారు. అక్రమ కేసులు ఎన్ని పెట్టిన భయపడేది లేదన్నారు. కార్యకర్తలకు అండగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ తోడుగా ఉంటారన్నారు. ముందుగా జాతీయ రహదారి లోని వైఎస్ఆర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులు అర్పించారు.

ఎంఎల్‌సీ విజయంతో సంబరాలు


ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పొదిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీగా బొర్రా గోపిమూర్తి గెలుపొందిన సందర్భంగా పొదిలి యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి బాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక యూటీఎఫ్ కార్యాలయం నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు బాణసంచా కాలుస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ముందుగా ఉపాధ్యాయ ఉద్యమనేత చెన్నుపాటి లక్ష్మయ్య 56వ వర్థంతి వర్థంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణారెడ్డి, పొదిలి, కొనకన మిట్ల మండల అధ్యక్ష ప్రధాన కార్యద ర్శులు కార్యదర్శులు సానికొమ్ము సత్యనారా యణరెడ్డి, పాలడుగు వెంకటేశ్వర్లు, కామేశ్వర రావు, పించనర్ల యూనియన్ అధ్యక్షులు ఏ బాదుల్లా, మదార్‌వలి, తదితర యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఆటో బహూకరణ


ఎలక్ట్రిక్ ఆటోను అందచేస్తున్న డాక్టర్ హరినాథరెడ్డి

గిద్దలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈసీహెచ్ఎస్ ఆస్పత్రి (మిలటరీ ఆసుపత్రి)కి స్థానిక డీజీఆర్ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ డి.హరినాథరెడ్డి ఎలక్ట్రికల్ ఆటోను ఉచితంగా అందచేశారు. మాజీ సైనికులు, సైనిక వితంతువుల సౌకర్యార్థం ఈ ఆటోను వినియోగించుకోవాలన్నారు. ఈసీహెచ్ఎస్ ఆసుపత్రి ప్రతినిధులు డాక్టర్ హరినాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులు కెప్టెన్ అంకన్న, వేణుగోపాలరావు, కోటారెడ్డి, శ్యాంసన్, దేవసహాయం పాల్గొన్నారు.

విశేషంగా గంధంపూజ

గిద్దలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హజరత్ ఖాదర్‌వలి స్వామి 173వ ఉరుసు మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా మొదలైంది. తొలిరోజు 5వ వార్డులోని శ్రీహజరత్ ఖాదర్‌వలిస్వామి చిన్న దర్గా నుంచి దర్గా కమిటీ ప్రతినిధులు మేళతాళాలతో పెద్దదర్గా వరకు గంధాన్ని తీసుకొచ్చి దర్గాలో గంధంపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు. దర్గా కమిటీ అధ్యక్షులు పఠాన్ లతీఫ్‌ఖాన్, కమిటీ ప్రతినిధులు షేక్ అబ్దుల్‌సుకూర్, పి.వై.ఖాన్, నబీరసూల్, ఖాదర్‌భాషా తదితరులు ఆయా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో బోరు ఏర్పాటు

గిద్దలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరవ గ్రామంలోని ఎస్సీపాలెంలో నీటిసమస్య పరిష్కారం కోసం నూతన బోరును తవ్వించారు. సర్పంచ్ బండి శ్రీనివాసులు బోరు డ్రిల్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కొత్త బోరు వలన ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు.

మైనారిటీల సమస్యలను పరిష్కరించాలి

- కార్పొరేషన్ చైర్మన్‌ను రఫీ వినతి


ముస్తాక్‌అహమ్మద్‌ను సన్మానిస్తున్న టీడీపీ ఎన్ఆర్ఐ సయ్యద్ రఫీ

కంభం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా సోమవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన ముస్తాక్ అహమ్మద్‌ను కంభం మండల ఎన్ఆర్ఐ సయ్యద్‌రఫీ ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన చైర్మన్‌తో మాట్లాడారు. మైనారిటీలు గత ప్రభుత్వంలో సమస్యలు ఎదుర్కొన్నారని, ముస్లిం మైనారిటీ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన మైనార్టీ నాయకులు

పెద్దదోర్నాల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టిన మౌలానా మస్తాక్ అహ్మద్‌ను దోర్నాల మండల ముస్లిం మైనార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంటు మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ సమ్మద్‌బాష ప్రకాశం జిల్లాలోని మారుమూల ప్రాంతంలో ముస్లిం మైనార్టీలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. జీవనోపాధుల పెంపునకు సహకరించాలని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. చైర్మన్‌ను కలిసిన వారిలో తెలుగు యువత కార్యదర్శి షేక్ సత్తార్, నాయకులు పఠాన్ సత్తార్, షేక్ మౌలాలి, మొగల్ రఫీ, షేక్ యూసుఫ్, సయ్యద్ సలీం ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కేపీకి వైసీపీ నేతల పరామర్శ


కేపీ కొండారెడ్డిని పరామర్శిస్తున్న నేతలు

మార్కాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం శాసన సభ్యులు, సీనియర్ నాయకులు కేపీ కొండారెడ్డిని వైసీపీ నాయకులు సోమవారం ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. రీజనల్ కో-ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వర రావు, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు స్థానిక లక్ష్మీచెన్నకేశవనగర్‌లోని కేపీ.కొండారెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వయోభారంతో కొన్నేళ్లుగా ఇంటికే పరిమితమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో పార్టీ పరిస్థితి, భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను కొండారెడ్డితో వారు చర్చించారు.

మట్టి దోపిడీ జరగకుండా పటిష్ట చర్యలు

దర్శి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో మట్టి దోపిడీ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు గనులు, భూగర్భశాఖ అధికారి ఎం.విష్ణువర్ధన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మట్టి దోపిడీపై చర్యలు నిల్' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దర్శి ప్రాంతంలోని లంకోజనపల్లి, చందలూరు, తానంచింతల, వెంకటచలంపల్లి కొండల మట్టిని, బొట్లపాలెం రెవెన్యూలోని పశువులమేత పోరంబోకు భూమిలోని మట్టిని గత వైసీపీ ప్రభుత్వంలో కొల్లగొట్టారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి భవిష్యత్తులో మట్టి దోపిడీ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గతంలో మట్టి అక్రమరవాణ చేసిన కొంతమంది వ్యక్తులకు జరిమానాలు విధించినట్లు విష్ణువర్ధన్‌రావు వివరించారు. మట్టి దోపిడీ జరగకుండా నిరంతరం తనిఖీలు చేస్తామని ఆయన తెలిపారు.

కడపకు ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

పామూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పామూరు నుంచి కడపకు పల్లె వెలుగు బస్సు సర్వీసును ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు పామూరు నుంచి బయలుదేరి దుత్తలూరు, నందిపాడు, బద్వేల్, సిద్దవటం మీదుగా కడపకు చేరుకుంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీమాపై అవగాహన

తాళ్లూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రబీకి బీమా పథకాన్ని నమోదు చేసుకుని విపత్తు సమయంలో ఉపయోగించుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి అన్నారు. తాళ్లూరు, కొర్రపాటివారిపాలెం, విఠలాపురం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల వద్ద బీమా పథకంపై రైతులకు సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పంట బీమా చెల్లింపు ఈనెల 15తో ముగుస్తుందని చెప్పారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ బీమా పథకాల వివరాలను తెలియపరుస్తూ గోడ పత్రాలు విడుదల చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు మారం ఇంద్రసేనారెడ్డి, శ్రీదేవిరామయ్య, తహసీల్దార్ సంజీవరావు, డీటీ ఇమ్మానియేల్ రాజు, వీఏఏలు నాగరాజు నాయక్, అశోక్, వెంకట్రావు, ఏఈవో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరగాలి

కనిగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ జరిగి తీరాలని జైభీం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత బహుజన సంక్షేమ ఏపీ సంఘం వ్యవస్థాపకుడు సూరె రాజు పేర్కొన్నారు. వర్గీకరణకు తాము మద్దతు ఇస్తున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ పోరాటంతో ఎస్సీలలో ఉన్న 59 ఉపకులాలకు సమాన వాటా దక్కనుందన్నారు. అయితే, కొంతమంది వర్గీకరణను వ్యతిరేకించటం దుర్మార్గమన్నారు. మంద కృష్ణమాదిగకు తాను సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో భోజన సదుపాయం

కురిచేడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలకు వచ్చిన 300 మంది గర్భిణులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. ప్రతినెలా 9వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వీరికి మధ్యాహ్న సమయంలో భోజన సదుపాయాన్ని లయన్స్ క్లబ్ సభ్యులు అందిస్తారు.

సోమవారం 300 గర్భిణులకు పోలీస్ శాఖకు చెందిన మహ్మద్ అమీర్ కుటుంబసభ్యులు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ జేబీ రామారావు, అధ్యక్షుడు వీవీ రమణారావు, కోశాధికారి పెండ్యేల ప్రసాదరావు, శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది ప్రవీణ్, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రలతో విజ్ఞానం

కనిగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విహారయాత్రలు విద్యార్థులకు విజ్ఞాన బాటలు వేస్తాయని చింతలపాలెం హైస్కూల్ ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వర్లు అన్నారు.పట్టణ సమీపంలోని చింతలపాలెం హైస్కూల్ విద్యార్థులను ఆదివారం విహారయాత్రకు తీసుకెళ్లినట్లు తెలిపారు. యాగంటి, మహానంది క్షేత్రాలను సందర్శించినట్టు తెలిపారు. విహారయాత్రలో హెచ్‌ఎం రామశర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.లక్ష

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం రూ.లక్షా 340 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.41,600, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.15,160, శాశ్వత అన్నదానానికి రూ.40,582, ఇతర విరాళాల ద్వారా రూ.300 వచ్చినట్లు తెలిపారు.

నేడు అగ్రహారంలో రెవెన్యూ సదస్సు

ముండ్లమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమా మహేశ్వర అగ్రహారంలో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ తెలిపారు. గ్రామంలో రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే సదస్సు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో డ్రోన్ కెమెరాను ప్రారంభిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ తదితరులు

ముండ్లమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ముండ్లమూరు పోలీసు స్టేషన్‌కు సోమవారం దర్శి మండలం రాజంపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు తానికొండ వెంకటరావు డ్రోన్ కెమెరాను అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ నేరాల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈక్రమంలో సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్‌లను ఉపయోగించి ఎలాంటి నేరం జరగకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. నేరాలు, రోడ్డు ప్రమాదాలతో పాటు వివిధ ఘటనలలో వెంటనే నేరం చేసిన వారిని గుర్తించేందుకు డ్రోన్ కెమెరా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డ్రోన్ కెమెరా దాత వెంకటరావును ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, సీఐ రామారావు, ఎస్‌ఐలు వై.నాగరాజు, మురపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, కోడెగ మస్తాన్‌రావు, మేదరమెట్ల వెంకటరావు, వేముల పద్మజాన కిరామయ్య, కూరపాటి నారాయణ స్వామి, గజ్జల సుబ్బారెడ్డి, పాలపర్తి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- మండల ప్రత్యేకాధికారి మాధురి

తాళ్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తుందని మండల ప్రత్యేకాధికారి మాధురి అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమవారం మండలంలోని విఠలాపురం, కొర్రపాటివారిపాలెం గ్రామాల్లో జరిగిన సదస్సులకు సర్పంచ్‌లు మారం ఇంద్రసేనారెడ్డి, కొర్రపాటి శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మాధురి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల చెంతకే రెవెన్యూ యంత్రాంగాన్ని తీసుకొచ్చి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నదన్నారు. విఠలాపురంలో 17, కొర్రపాటివారిపాలెంలో 17 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ కె.సంజీవరావు, మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ అనూష, వీఆర్‌వో సుశీలరాణి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


తాళ్లూరు: విఠలాపురంలో జరిగిన సదస్సుల్లో పాల్గొన్న మండల ప్రత్యేకాధికారి మాధురి

సమస్యలను పరిష్కరించేందుకు సదస్సులు

దర్శి డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం సదస్సులను నిర్వహిస్తున్నదని తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని రామచంద్రాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు సంబంధించిన భూముల వివాదాలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా భూమి హక్కుల బదలాయింపు, ఆన్‌లైన్ తదితర అంశాలకు సంబంధించిన 17 అర్జీలు దాఖలయ్యాయి. కార్యక్రమంలో ఆర్‌ఐ పరిటాల శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి కృషి

పామూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తహసీల్దార్ బీవీ రమణారావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చిలంకూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రెవెన్యూ రికార్డుల్లో ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్దేందుకు ప్రభుత్వం ఈ సదస్సులను నిర్వహిస్తున్నదని చెప్పారు. మ్యుటేషన్‌కు ఏడు దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అంతకుముందు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మలినేని శ్రీనివాసులు, ఎంఆర్‌ఐ బి.మల్లికార్జున, వీఆర్వో షేక్ రసూల్, విలేజ్ సర్వేయర్లు శ్రీకాంత్, బ్రహ్మానందం, యర్రసింగ్ ముసలయ్య, పిరికిటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై 21 అర్జీలు

పీసీపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగుంపల్లిలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై 21 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సీహెచ్ ఉష తెలిపారు. 15మంది రైతులు తమ భూమిని ఆన్‌లైన్ చేసి పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. మరో ఆరుగురు వెబ్‌ల్యాండ్‌లో నమోదై ఉన్న తప్పులను సరిచేసి భూమిని సర్వేచేసి హద్దులను చూపించాలని కోరినట్టు చెప్పారు. వీటిని పరిశీలించి వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించాలని వీఆర్వో, సర్వేయర్‌లను తహసీల్దార్ ఆదేశించారు.

కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి కొండారెడ్డి, వీఆర్వో మధు, సర్వేయర్ మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలను పరిష్కరించుకోవాలి

కురిచేడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రజనీకుమారి సూచించారు. సోమవారం మండలంలోని పడమర నాయుడుపాలెం, వీవైకాలనీలలో జరిగిన సదస్సుల్లో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా పడమరనాయుడుపాలెం గ్రామంలో 24 అర్జీలు, వీవైకాలనీలో రెండు అర్జీలు వచ్చాయి. వాటిలో ఎక్కువగా పాస్‌పుస్తకాలు, ఆన్‌లైన్ కోసం వచ్చాయని తహసీల్దార్ రజనీకుమారి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దిగజారిన ధాన్యం ధరలు

- రూ.1,440కు పడిపోయిన వైనం

ముండ్లమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీపీటీ వరి రకం సాగు చేసిన రైతులు దిగజారిన ధరలతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ముమ్మరంగా నూర్పిళ్లు జరుగుతున్నాయి. గతేడాది బస్తా రూ.2100 పలకగా ఈ ఏడాది రూ.1440కు పడిపోయింది. ఈ ధరలతో రైతుపడిన కష్టానికి ఏ మాత్రం ఫలితం దక్కదు. కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ బోర్ల కింద పసుపుగల్లు, చింతలపూడి, పెదఉల్లగల్లు, రెడ్డినగర్, లక్ష్మీనగర్, కమ్మవారిపాలెం, వేముల, సింగనపాలెం, పులిపాడు, ముండ్లమూరు గ్రామాల్లో రైతులు బీపీటీ రకాన్ని సాగు చేశారు. మార్కెట్‌లో అమ్ముకోవాలనుకొనే సరికి ధర ఒక్కసారిగా పడి పోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు ధర చూస్తే నిరాశే మిగిలింది. పంట కోసం తెచ్చిన అప్పు లు ఎలా తీర్చాలంటూ ఆందోళన చెందుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.


పసుపుగల్లులో ధాన్యాన్ని కాటా వేస్తున్న కూలీలు

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసిన్ డిమాండ్



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కనిగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసిన్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను ఆప్కాస్‌లో నమోదు చేసి జీతాలు చెల్లించాలన్నారు. చనిపోయిన, రిటైర్ట్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను చేర్చుకోవాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్కువ మందితో ఎక్కువ పనిచేయించటం దుర్మార్గమన్నారు. మున్సిపాల్టీ పరిధిలో అవసరమైనంత మంది పారిశుధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు గుజ్జుల బాలిరెడ్డి, సీపీఐ నాయకుడు జీపీ రామారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోటయ్య, అశోక్, కిరణ్, సుబ్రహ్మణ్యం, మస్తాన్, శేషయ్య, ఇమాం హుస్సేన్, తాజుద్దీన్, ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణ

- రోకపోకలకు ఇబ్బందులు
- సిద్దాయిపాలెం గ్రామస్థుల ఆందోళన


ఎంపీడీవోకు సమస్యను వివరిస్తున్న సిద్దాయిపాలెం గ్రామస్థులు

దొనకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలు రాకపోకలు జరుపుకునే రహదారిని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆక్రమించుకోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈమేరకు సోమవారం సిద్దాయిపాలెం గ్రామస్థులు ఎంపీడీవోకు తమగోడు వెళ్లబోసుకున్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి ప్రజలు రాకపోకలు జరుపుకునే రహదారిపై మట్టికుప్పలు పోశారు. ట్రాక్టర్‌ను దారికి అడ్డంగా పెట్టి రాకపోకలు జరగకుండా దౌర్జన్యంగా అడ్డగిస్తున్నాడని మందగిరి ఇన్నయ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై న్యాయం చేయాలంటూ రెండుసార్లు జిల్లా అధికారులు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. ఇటీవల వీఆర్వో వచ్చి పరిశీలించారేగాని ఎటువంటి చర్యలు చేపట్టలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తే, తమకు సంబంధం లేదని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నట్టు వారు తెలిపారు.

రాకపోకలు జరుపుకునే దారిని ఆక్రమిస్తే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎవరికి వారు మౌనంగా వ్యవహరిస్తుండటంతో న్యాయం కోసం తాము ఎవరిని ఆశ్రయించాలో అర్థంకావడంలేదని వాపోయారు.

స్పందించిన ఎంపీడీవో శ్రీదేవి సమస్యను తహసీల్దార్‌తో ఫోన్‌లో చర్చించారు. తహసీల్దార్ సూచనల మేరకు గ్రామ కార్యదర్శి డేవిడ్, రెవెన్యూ సిబ్బంది వీలైనంత త్వరలో వచ్చి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

ఎన్‌సీసీకి మోడల్ స్కూల్ ఎంపిక

ముండ్లమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని మోడల్ స్కూల్ ఎన్‌సీసీకి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు తెలిపారు. 34వ ఎన్‌సీసీ బెటాలియన్‌కు చెందిన సుబేదార్ సంతోష్‌సింగ్, ఆర్మీ అధికారి వెంకటనారాయణ సోమవారం మోడల్ స్కూల్‌ను సందర్శించి 70 మంది విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మంది విద్యార్థులను ఎన్‌సీసీ మొదటి బ్యాచ్‌కి ఎంపికచేశారు. ఈసందర్భంగా సుబేదారు సంతోష్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఎన్‌సీసీ శిక్షణతో భవిష్యత్‌లో వివిధ దళాలు, పోలీసు నియామకాల్లో చాలా సులువుగా ఉద్యోగాలు సాధించవచ్చునని చెప్పారు.

ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ స్కూల్ ఎన్‌సీసీ యూనిట్‌కు కేర్ టేకర్‌గా సోషల్ ఉపాధ్యాయుడు సాధు వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారన్నారు. ఎన్‌సీసీకి మోడల్ స్కూల్ ఎంపిక కావడం పట్ల ఎస్‌ఎంసీ చైర్మన్ వీరపనేని రాంబాబు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



ఎన్‌సీసీకి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులతో ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, బెటాలియన్ సుబేదార్ సంతోష్‌సింగ్, ఆర్మీ అధికారి వెంకటనారాయణ


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రుద్రసముద్రం గ్రామస్థులు

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలి

దొనకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మాడపాకుల రమేష్ డిమాండ్ చేశారు. ఆపార్టీ ఆధ్వర్యంలో సోమవారం రుద్రసముద్రం గామస్థులు ధర్నా చేశారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ రుద్రసముద్రం గ్రామంలో ఎంతోమంది నిరుపేదలకు ఇళ్లు లేవన్నారు. గ్రామంలో అర్హులైన పేదలు ఇళ్లు కట్టుకునేందుకు సరిపడ స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కు ఇళ్ల స్థలాల కోసం దాదాపు 145 మంది దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో బీకే ఎంయూ నాయకుడు జూపల్లి కోటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి, కె.బాలయ్య, కనపర్తి సురేంద్ర, జి.స్టాలిన్, మరి యదాసు, తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ మహిళ మృతి

ముండ్లమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లు వద్ద ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో గాయపడ్డ మహిళ చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందారు. అద్దంకి పట్టణంలోని పసుమర్తివారిపాలెంకు చెందిన పసుమర్తి స్వరూప(40) అనే మహిళ తన భర్త సామేలుతో ద్విచక్ర వాహనంపై మార్కాపురం మండలం గజ్జలకొండకు వెళుతున్నారు. ఈక్రమంలో ఉల్లగల్లు వద్ద ద్విచక్ర వాహనంపైనుంచి జారి పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందింది. భర్త సామ్యేల్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె.నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

దొనకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో దొనకొండ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అప్పులుచేసి కుటుంబాలను పోషించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో శ్రీదేవి, గ్రామ కార్యదర్శి కృష్ణమూర్తి క్రిస్మస్ పండుగ నాటికి ఆరు నెలల వేతనాలు చెల్లిస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుందుర్తి నర్సింహులు, చిరుపల్లి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిలో ఆన్‌లైన్ నిలిపివేత

పామూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కరోళ్లపాడు రెవెన్యూ గ్రామంలో గల సర్వేనెంబర్ 34లో గల 30.26ఎకరాలను ఆన్‌లైన్ చేయడంలేదని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. ఈ భూమి కోర్టు వివాదంలో ఉన్నందున ఎవరిపేరు మీదున పాస్ పుస్తకం, ఆన్‌లైన్ చేయడం లేదని తెలిపారు. కరోళ్లపాడు సర్వేనెంబర్ 34లో భూ మాయ శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈభూమికి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. ఈభూమి ప్రసుత్తం సాగులో లేక పోవడంతో చిల్లచెట్లతో నిండి ఉందన్నారు. ఆ భూమిపై కనిగిరి జూనియర్ జడ్జి కోర్టులో ఓఎస్ నెంబర్ 117/2017 విచారణ పెండింగ్‌లో ఉందని తెలిపారు.

భూఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

పీసీపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దళితుల భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ సీహెచ్ ఉషకు ఫిర్యాదు చేశారు. చింతగుంపల్లి, వెలుతుర్లవారిపల్లి, వేపగుంపల్లి గ్రామాల్లో దళితులకు చెందిన పట్టా భూములను కొంతమంది ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని చింతగుంపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. విచారించి భూ సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, కేశవరావు, చినరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరుచేయాలి

తాళ్లూరు, డిశంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు గ్రామంలోని సర్వే నంబర్ 476లోని 1.80 ఎకరాభూమిని ఆక్రమణల నుండి తొలగించి గృహాలు లేని ఎస్సీలకు నివేశన పట్టాలు మంజూరు చేయాలని టీడీపీ ఎస్సీ సెల్ నేత అనపర్తి సుబ్బారావు కోరారు. ఈమేరకు సోమవారం ఆయన ఆధ్వర్యంలో కాలనీ వాసులు గ్రీవెన్ సెల్‌లో అధికారులకు అర్జీ ఇచ్చారు. తాళ్లూరు-వెల్లంపల్లి రోడ్డు మార్గంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం దగ్గర ఉన్న 1.80 ఎకరాల స్థలాన్ని కాలనీకి చెందిన నల్లూరి బాలనాగయ్య, ఏసోబు కుటుంబీకులు ఆక్రమించారన్నారు. వీరికి గ్రామంలో మూడు గృహాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందజేసిన భూమి కూడా ఉందని పేర్కొన్నారు. గతంలో ఆక్రమణదారుడు ఆక్రమించిన సర్వే నంబర్ 476లో 4.80 ఎకరాల్లో రెండు ఎకరాలను కేజీబీవీ విద్యాలయంకు కేటాయించారన్నారు. అందులో 1.80 ఎకరాల స్థలాన్ని ఆక్రమించారన్నారు. గతంలో అనేక మార్లు అధికారులకు విన్నవించగా నిషేధిత బోర్డు ఏర్పాటుచేశారన్నారు. దానికి తొలగించినా స్థానిక అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఎస్సీ కాలనీలో చాలా మందికి ఇళ్లు లేక ఒకే ఇంటిలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఇళ్లులేని ఎస్సీలకు నివేశన పట్టాలు మంజూరు చేయాలని విన్నవించారు.

యూటీఎఫ్ అభ్యర్థి విజయంపై హర్షం

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ఘన విజయం సాధించడం పట్ల ఆసంఘం సీఎస్‌పురం మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నారిశెట్టి వెంకట్రామయ్య, షేక్ పాదుషా, జిల్లా కార్యదర్శి అరియారం సురేష్‌లు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పోరాడుతున్న యూటీఎఫ్ సంఘాన్ని ఉపాధ్యాయులు ఆదరించి విజయాన్ని అందించడం ఉద్యమ స్ఫూర్తికి నిదర్శమన్నారు.

కాగా, ఉపాధ్యాయుడు స్వర్గీయ చెంచిరెడ్డి కుటుంబానికి కుటుంబ సంక్షేమ పథకం ద్వారా రూ.లక్షా 50వేల బ్యాంక్ చెక్‌ను అందజేసినట్టు వారు తెలిపారు.



1 మండలికి వెళ్లొద్దన్న ఆదేశాలను పాటించని ఏసురత్నం 1 సోషల్ సైకోల వ్యవహారంలో చంద్రగిరిపై అధిష్ఠానం గుర్రు 1 తప్పు ఎవరు చేసినా తప్పే అన్న మాజీ పోలీసు అధికారి 1 జగన్ వైఖరితో విసుగు.. జనసేన వైపు చూపు



ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

జగన్ వైఖరి ఆ పార్టీ నేతలకే నచ్చటం లేదా ? వైసీపీ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ఆ పార్టీకి దూరం అవుతున్నారా..? ఆయన రేపో మాపో పార్టీ మారనున్నారా..? ఈ ప్రశ్నలకు సమాధానం అవుననే అనిపిస్తుంది. గత కొద్దిరోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు ఎమ్మెల్సీ ఏసురత్నంకి ఆ పార్టీ నాయకత్వానికి మధ్య దూరం పెరిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన త్వరలో పార్టీకి గుడ్ బై చెప్పనున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరో వైపు జనసేన నాయకులు కూడా ఆయనతో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. ఆయన త్వరలో జనసేన తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలుస్తోంది.

మరో ఎమ్మెల్సీ

వైసీపీకి గుడ్‌బై?

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం ముగిసిన శాసన మండలి సమావేశాలు ఎమ్మెల్సీ ఏసురత్నంకి వైసీపీ అధిష్ఠానానికి మధ్య చిచ్చు రేపినట్లు సమాచారం. జగన్ అసెంబ్లీకి వెళ్ళటం లేదు కాబట్టి ఎమ్మెల్సీలు కూడా శాసనమండలికి వెళ్లాల్సిన పనిలేదని వైసీపీ అధిష్ఠానం ఆ పార్టీ సభ్యులకు హుకుం జారీచేసినట్లు సమాచారం. ఒకవేళ సమావేశాలకు వెళ్లినా అధికార కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చిపోవాలని సూచించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఏసురత్నం ఈ రెండు మాటలను పెడచెవిన పెట్టినట్లు చెబుతున్నారు. సమావేశం జరుగుతుంటే ఇంట్లో ఎలా కూర్చోవాలి అంటూ మండలికి వెళ్ళారు. దానిపై ముఖ్య నేతలు తీవ్రంగా హెచ్చరించినట్లు ప్రచారం జరుగుతోంది.

పోడియం దగ్గరకు ఎందుకు వెళ్ళలేదు...

ఈ సమావేశాల్లో సోషల్ మీడియా సైకోల అరెస్టులపై శాసనమండలిలో కొద్దిపాటి గొడవ జరిగింది. అన్యాయంగా తమ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ ఎమ్మెల్సీలు పోడియంను చుట్టుముట్టారు. ఆ సమయంలో ఏసురత్నం మండలిలోనే ఉన్నా పోడియం దగ్గరకు వెళ్ళలేదు. దానిపై వైసీపీ అధిష్ఠానం ఆయనపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒకరిద్దరు ముఖ్య నేతలు ఈ విషయం ఏసురత్నం వద్ద ప్రస్తావించగా ఆంధ్రప్రదేశ్ పోలీసులు అన్యాయంగా ఎవరినీ అరెస్టు చేసే అవకాశం లేదని చెప్పినట్లు సమాచారం. ఒక మాజీ

(మిగతా 8వ పేజీ)



జొన్నలు, రాగులు



కట్!

- రేషన్‌లో ఒక్క నెలకే ఆగిన పంపిణీ
- కిందటి నెలలో మిగిలినవే ఈ నెల పంపకం
- ఒక్కో షాపునకు 2 క్వింటాళ్లతో సరి
- గత ప్రభుత్వ నిర్వాకంతో నేటికీ తప్పని కష్టాలు



గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నవంబరు నుంచి తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రతి నెలా నాలుగు రకాల సరుకులు అందజేస్తామని ప్రకటించిన పౌర సరఫరాల శాఖ రెండో నెలలోనే తడబాటుకు గురయింది. బియ్యం, పంచదార, కందిపప్పు మూడింటి తోపాటు నాలుగో సరుకుగా చిరు ధాన్యాలైన రాగులుగానీ, జొన్నలుగానీ, సజ్జలుగానీ ఇస్తామని ప్రకటించింది. రాయలసీమ రైతులు పండించిన చిరుధాన్యాన్ని కొనుగోలు చేసి, ప్రజా పంపిణీ ద్వారా పేదలకు చౌకగా అందిస్తే అటు రైతులకు, ఇటు పేద ప్రజలకు బలవర్ధక ఆహారం దొరుకుతుందని భావించిన ప్రభుత్వం వరుసగా రెండు నెలలు రాగులు, జొన్నలు పంపిణీ చేసింది. చెప్పిన విధంగా కార్డుదారులకు అక్టోబరులో రాగులు, నవంబరు నెలలో జొన్నలు అందజేసిన ఆ శాఖ డిసెంబరు నెల వచ్చేసరికి చేతులెత్తేసింది.

నాటి పాపాలే.. నేటి శాపాలు

గత వైసీపీ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పేదలకు చౌక ధరలో సరుకులు అందజేసే రేషన్ షాపులను కేవలం బియ్యం అందజేసే షాపులుగా పరిమితం చేసింది. రేషన్ కార్డులను కూడా బియ్యం కార్డులుగా కుదించి సరుకులు ఆపేసింది. దానికి తోడు పౌర సరఫరాల కార్పొరేషన్‌పై భారీ మొత్తంలో రుణాలు తెచ్చి కార్పొరేషన్‌ను నిండా ముంచేసింది. వీటిని సరిదిద్దుకోవడం, కొత్త సరుకులు కొనుగోలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి సవాలుగా మారింది. దీంతో సరుకుల పంపిణీ సమస్యాత్మకంగా మారింది. అనారోగ్య బాధితులకు అత్యవసరంగా మారిన ఈ ధాన్యాలను అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బాధితులు కోరుకుంటున్నారు. అయితే తిరిగి జొన్నలు, రాగులు, సజ్జల పంపిణీ ఉంటుందా లేదా అన్నది మాత్రం అధికారులు కచ్చితంగా చెప్పలేకపోతున్నారు.

ఆరంభంలోనే అంతరాయం

2014- 19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేదలకు అనేక సరుకులు అందించింది. బియ్యం, పంచదార, కందిపప్పుతోపాటు పామాయిల్, ఉప్పు, చింతపండు వంటి అనేక సరుకులు అందించింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పౌర సరఫరాల శాఖ కోలుకోలేనంతగా దెబ్బతింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. పేదలకు దూరమైన రేషన్ సరుకులను ఒక్కొక్కటిగా పేదలకు అందించేలా చర్యలు చేపట్టింది. ఒక్కో నెల ఒక్కో సరుకును పెంచుకుంటూ పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తూ వస్తోంది. ఆ క్రమంలోనే ఈ జూలై నుంచి బియ్యం, పంచదారతోపాటు కందిపప్పును అందుబాటులోకి తెచ్చింది. అక్టోబరులో వాటితోపాటు రాగులు అందించింది. తాజాగా నవంబరు నెలలో రాగులకు బదులుగా జొన్నలు అందజేసింది. డిసెంబరు వచ్చే సరికి పరిస్థితి తారుమారయిపోయింది. ఈ నెల అదనంగా ఇస్తానన్న రాగులు, జొన్నలు, సజ్జలు అందుబాటులోకి రాలేదు. గత నెలలో కార్డుదారులు తీసుకోకపోవడంతో మిగిలిన జొన్నలను అధికారులు పంపిణీకి సిద్ధం చేశారు. ఇలా ఒక్కో రేషన్ షాపుకు ఒకటి, రెండు క్వింటాళ్లకు మించి జొన్నలు అందలేదు. దీంతో తొలి రోజు అందుకున్న కార్డుదారులకు మాత్రమే అవి దక్కాయి. ఫలితంగా ప్రజా పంపిణీ వ్యవస్థ విమర్శలకు గురయింది.

ఎప్పుడు వస్తాయో చెప్పలేం

జీ లక్ష్మి, డీఎం పౌర సరఫరాల శాఖ

రాయలసీమ రైతులకు ఊతం ఇచ్చేలా వారు పండించే జొన్నలు, రాగులు, సజ్జలను పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు అందించాలని భావించాం. అక్టోబరులో రాగులు, నవంబరులో జొన్నలు అందజేశాం. మళ్లీ అవి అందుబాటులోకి ఎప్పుడు వస్తాయో తెలియదు. అందుబాటులోకి వస్తే తిరిగి వాటిని పంపిణీ చేస్తాం.

రీ షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం

ఇప్పటికే రెండు సార్లు వాయిదా

14న నీటి సంఘాలకు.. 17న డీసీలకు ఎన్నికలు

సాగునీటి సంఘాల ఎన్నికలకు...

రేపు నోటిఫికేషన్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం రీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. 11న ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. ఇప్పటికే రెండు సార్లు ఎన్నికలు వాయిదా పడిన విషయం తెలిసిందే. 14న నీటి సంఘాలకు.. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేస్తారు. ఎన్నికల నిర్వహణకు జలవనరుల, రెవెన్యూ శాఖలు ఏర్పాటు చేస్తున్నాయి. ఎన్నికలను అధికార పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. సేవా భావం కలిగిన వారిని నీటి సంఘాలకు ఎన్నుకోవాలని ఇప్పటికే కూటమి నేతలు రైతులకు పిలుపునిచ్చారు. వైసీపీ అంతగా ఈ ఎన్నికలపై దృష్టి సారించలేదు. పూర్తిగా బలం ఉన్న చోట మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయాలని వైసీపీ భావిస్తోంది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఒకసారి, వర్షాల కారణంగా మరోసారి నీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. రీషెడ్యూలు ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 14న సాగునీటి సంఘాలకు.. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పటిష్ఠమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. టీసీల వారీగా ఓటర్ల జాబితాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. ఒక్కొక్క టీసీ పరిధిలో 2,500 నుంచి 3,000 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు. నీటి సంఘాల టీసీలకు 14న ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు సంఘాల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. నీటి సంఘాలకు కాలువ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు.



గుంటూరు బ్రాంచ్ కెనాల్

కుడి కాలువ పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఇవే..

కుడి కాలువ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి

(మిగతా 8వ పేజీ)

ప్రభావతి ముందస్తు బెయిల్ పిటీషన్ రేపటికి వాయిదా

గుంటూరు(లీగల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐదో నిందితురాలిగా ఉన్న అప్పటి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసుకున్న పిటీషన్ డిసెంబరు 11కు వాయిదా పడింది. ఈ కేసులో తాను నిర్దోషినని పేర్కొంటూ తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ డాక్టర్ ప్రభావతి గుంటూరు జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాది మల్లవరపు శేఖర్ బాబు ద్వారా పిటీషన్ దాఖలు చేసిన విషయం విదితమే. ఈ పిటీషన్‌లో తనను కూడా పార్టీగా చేర్చాలని, తన వాదనలు కూడా వినాలని కోరుతూ రఘురామకృష్ణంరాజు కూడా తన న్యాయవాదులు వీవీ లక్ష్మీనారాయణ, కావూరి గోపీనాథ్‌ల ద్వారా ఇంప్లీడ్ పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌లు సోమవారం రెండో అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా ఎదుట విచారణకు రాగా ప్రభావతి తరఫు న్యాయవాది శేఖర్ బాబు వాదనలు వినిపించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. అయితే ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితుడైన రాష్ట్ర పాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ పోలీసుల తరఫున వాదనలు వినిపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, అయితే ఈ కేసులో దర్యాప్తు అధికారి సెలవులో ఉండటంతో కేసు డైరీ తనకు అందలేదని కోర్టుకు తెలిపారు. ఇంప్లీడ్ పిటీషన్‌లో రఘురామకృష్ణంరాజు తరఫు న్యాయవాది కావూరు గోపీనాథ్ తన వాదనలు వినిపించారు. కేసు డైరీ అందకపోవడంతో ముందస్తు బెయిల్ పిటీషన్‌పై వాదనలు సాగలేదు. రఘురామకృష్ణంరాజు వేసిన ఇంప్లీడ్ పిటీషన్‌పై ఈనెల 11న ఉత్తర్వులు జారీ చేస్తానని న్యాయమూర్తి పేర్కొన్నారు ముందస్తు బెయిల్ పిటీషన్ కూడా 11వ తేదీకి వాయిదా వేశారు.

రెవెన్యూ సదస్సుకు ఆర్‌పీ సిసోడియా హాజరు

- దస్త్రాలు పక్కాగా ఉంచుకోండి..
- పర్చూరు అధికారులతో కలెక్టర్



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులు జయప్రదం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటమురళి సూచించారు. పర్చూరు మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. పర్చూరు మండలం చిననందిపాడు గ్రామంలో సోమవారం జరిగే రెవెన్యూ సదస్సుకు రెవెన్యూ శాఖ ప్రత్యే కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా హాజరవుతారన్నారు. ఈనేపథ్యంలో రెవెన్యూ దస్త్రాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. దేవాదాయ శాఖ భూముల వివరాలు, అడంగల్‌లు, ఆర్ఎస్ఆర్‌లు పక్కాగా ఉండాలన్నారు. ప్రజలు నుంచి వచ్చే ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆగ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. సీసీరోడ్ల నిర్మాణం అవసరాన్ని గుర్తించి వాటిపై నివేదిక ఇవ్వాలన్నారు. మురికినీటి వ్యవస్థ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూఅధికారి జీ గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పీ గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు కోసం..

కొత్తగా 63,607 దరఖాస్తులు

- రాత్రి 8.15 గంటల వరకు వచ్చిన వివరాల విడుదల
- అర్ధరాత్రి 12 గంటలకు మరికొన్ని పెరిగే అవకాశం

గుంటూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కృష్ణా- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఓటరు నమోదు ప్రక్రియకి సంబంధించి ముసా యిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం మరో 63,607 దరఖాస్తులు అందాయి. సోమవారం రాత్రి 8.15 గంటల వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలను ఎలక్టోరల్ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి విడుదల చేశారు. కాగా అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తుల దాఖలుకు గడువు ఉన్నందున ఈ సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉందన్నారు. పూర్తి గణాంకాలను ఎన్నికల సంఘం మంగళవారం సాయంత్రం విడుదల చేస్తుందని చెప్పారు. బాపట్ల జిల్లాలో 4619, ఏలూరులో 1743, గుంటూరులో 23656, కృష్ణాలో 8047, ఎన్‌టీఆర్‌లో 15575, పల్నాడులో 9987 దరఖాస్తులు డ్రాఫ్టు పబ్లికేషన్ అనంతరం వచ్చాయన్నారు. డ్రాఫ్టు పబ్లిష్ చేసే నాటికి 2 లక్షల 90 వేల 978 మందికి ఓటు హక్కు కల్పించారు.

- ఫ్రీహోల్డ్ భూముల అవకతవకలపై ఇప్పటికే నివేదికలు
- రీసర్వే ఫిర్యాదుల పరిష్కారం దిశగా.. పెద్ద ఎత్తున రెవెన్యూ సదస్సులు
- మెప్మా బోగస్ రుణాల విషయంలోనూ కదలిక
- గత ప్రభుత్వ ఇసుక దోపిడీ నివేదిక ప్రభుత్వ పెద్దల చేతుల్లో
- ఇప్పుడు పింఛన్ల వంతు.. త్వరలోనే నోటీసులు.. ఆ పై చర్యలు

అక్రమాల డొంకలు

కదులుతున్నాయ్..!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెలలు గడుస్తున్నాయ్...కానీ గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా వ్యవహరించిన అక్రమార్కుల భరతం పట్టడం లేదన్న అసంతృప్తి ఇటు పార్టీ క్యాడర్‌లోనూ, ఇటు సామాన్య జనంలోనూ వ్యక్తమవుతూ వస్తోంది. మూడు నెలల క్రితం నుంచే ప్రతి విభాగంలోనూ గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై అంతర్గతంగా విచారణ మొదలయింది. రెవెన్యూ లాంటి విభాగాల్లో బాహాటంగా ప్రక్రియ కనబడితే మైనింగ్, మెప్మా, డీఆర్‌డీఏ, డ్వామా, సహకార సొసైటీలవంటి పలు శాఖలలో అంతర్గతంగా కసరత్తు చేసి అక్రమాల చిట్టాను తయారు చేశారు. వీటన్నింటి విషయంలో తుది నిర్ణయానికి రావడానికి ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. మరోవైపు రేషన్ మాఫియా విషయంలో గతంలో పీడీ యాక్టు వరకు వెళ్లిన మాఫియా డాన్‌లు ఎవరూ అనే కోణంలో కూడా ఇప్పటికే ప్రత్యేక విభాగం జిల్లా యంత్రాంగాన్ని వివరాలు అడిగినట్లు తెలుస్తోంది. అధికారం అండతో కులాసాగా దోపిడీకి పాల్పడిన వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటే వారి ఆగడాలకు సహకరించిన యంత్రాంగం ఏం జరుగుతుంది అనే కోణంలో విచారణ చేస్తూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఆయా శాఖల మూలాల్లోకి తీగలు లాగే ప్రక్రియ ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లనుంచే ప్రారంభం కాగా ఇప్పటికీ డొంకలు కదలడం మొదలయింది. అక్రమాలకు పాల్పడిన వారిపై, సహకరించిన వారందరిపైన చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం పావులు కదుపుతోంది

తొలుత ఫ్రీహోల్డ్ భూముల అవకతవకలపై...

నిరుపేదలకు భూమిపై యాజమాన్యహక్కు కల్పించే పేరిట గత పాలకులు భూ అక్రమాలకు పాల్పడ్డారనే నిర్ధారణకు కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలోనే వచ్చింది. దానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు రావడం, మండలాల వారీగా గత ఐదేళ్లలో ఫ్రీహోల్డ్ చేసిన భూముల వివరాలను జల్లెడ పట్టడంతోపాటు వాటిలో ఎన్ని రిజిస్ట్రేషన్ జరిగాయి అనే అంశంపై కూడా దృష్టిసారించారు. దాదాపు 250 ఎకరాల వరకు నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలినట్లు సమాచారం. వీటిలో 72 ఎకరాల వరకు రిజిష్టర్ కూడా జరిగినట్లు అధికారులు తేల్చారు. ఇక రీసర్వే ప్రహసనంపై 72 గ్రామాల్లో సభలు నిర్వహిస్తే రికార్డు స్థాయిలో 4,280 అర్జీలు రావడంతో కంగుతినడం అధికారుల వంతైంది. ఈమొత్తం వినతుల్లో అక్రమాల పరంగా మేజర్‌గా జరిగినవి 258 వరకు గుర్తించి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇక ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సుకు కూడా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తుండడంతో వాటిని కూడా జల్లెడ పట్టి అన్నింటిని క్రోడీకరించి చర్యల కొరడా విధించడానికి ప్రభుత్వం సమాయత్తమవుతోంది

మైనింగ్ విషయంలో శ్రీముఖాలు....

వైసీపీ ప్రభుత్వంలో సహజవనరుల దోపిడీ ఏ విధంగా జరిగిందో అందరికి తెలిసిందే. దీనిలో ప్రధాన వాటా ఇసుకదే. గత ప్రభుత్వంలో నిబద్ధతతో పనిచేసిన కొంతమంది అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతూ పట్టుబడిన వారిపై జరిమానాల కొరడా విధించారు. అధికారం అండగా ఉండడంతో అప్పట్లో వాటిని పట్టించుకోకపోగా నోటీసులను సైతం లెక్కలేని తనంతో బుట్టదాఖలు చేసేశారు. వీరిలో ఎక్కువమంది వైసీపీ కీలక నేతల అనుచరగణమే. ప్రస్తుత ప్రభుత్వంలో ఆ అక్రమాల నిగ్గు తేల్చడంతోపాటు జరిమానాలను పెనాల్టీతో ముక్కుపిండి వసూలు చేయడానికి కార్యస్థలం ఇప్పటికే సిద్ధం చేశారు. 29 కేసులకు సంబంధించి రూ.9 కోట్ల వరకు జరిమానా కట్టాల్సి ఉండగా పెనాల్టీతో కలిపి మొత్తం రూ.49 కోట్లు వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేసే విధంగా చట్టపరంగా అడుగులేస్తున్నారు. జరిమానాతో సరిపెట్ట కుండా క్రిమినల్ కేసుల నమోదు విషయంలో సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలిస్తున్నారు

బోగస్ రుణాలది మరో తంతు.....

బినామీ గ్రూపులను ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి రుణాలను తీసుకోవడం గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున జరిగింది. ఒక్క బాపట్ల పరిధిలోనే ఈ తరహా అక్రమాలు దాదాపు రూ.2 కోట్ల వరకు జరిగినట్లు ఇప్పటికే అంతర్గత విచారణలో తేటతెల్లం కాగా, రేపల్లె పరిధిలో వెలుగు చూసిన అక్రమాలపై వైసీపీ ప్రభుత్వంలోనే అధికారులు విచారణ జరపగా వాటి వెనక కీలక నేతల పాత్ర ఉండడంతో ఆ నివేదికను అటకెక్కించారు. దాని బూజు దులిపి నివేదిక తయారు చేసే పనిని యంత్రాంగం రెండు నెలల క్రితమే చేసింది. బోగస్ రుణాల విషయంలో నోటీసులు జారీ చేయడం వివరణ అడగడం, చర్యలకు సిఫారసు చేస్తూ నివేదిక తయారు చేయడం కూడా ఇప్పటికే పూర్తయింది. ఇక చర్యలే తరువాయి అనే విధంగా మెప్మాలో పరిస్థితి ఉంది

రేషన్ మాఫియా విషయంలోనూ....

రేషన్ దందాకు ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకట్ట వేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వ పెద్దలు ఉన్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగా గత ప్రభుత్వంలో ఈ దందాను వ్యవస్థీకృతం చేయడంలో కీలకంగా వ్యవహరించిందెవరు అనే కోణంలో విచారణను ప్రారంభించారు. గతంలో ముగ్గురిపై పీడీయాక్టు ప్రతిపాదనలు చేయడం, రాజకీయ ఒత్తిళ్లతో వాటిని పక్కన పడేయడం జరిగిన సంగతి తెలిసిందే. అప్పుడు పీడీయాక్టు ప్రతిపాదనలు సిద్ధమైన ఆ ముగ్గురి యాక్టివిటీస్‌పై సదరు విభాగాలు దృష్టి పెట్టడంతో పాటు వారి వెనక అప్పట్లో కీలకంగా వ్యవహరించిన పెద్ద తలకాయలు ఎవరనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు.

ప్రస్తుతం పింఛన్ల వంతు...

గత ప్రభుత్వంలో అర్హులను వేధించడం, పార్టీ భజనపరులకు పెద్ద పీట వేస్తూ అర్హత లేకపోయినా సర్కారు సొమ్మును పెద్ద ఎత్తున దోచి పెట్టిన సంగతి తెలిసిందే. దీనిలో ముఖ్యంగా సామాజిక పింఛన్ల విషయంలో మరీ అడ్డూ అదుపూ లేకుండా వ్యవహరించారు. గతంలో ప్రాథమికంగా పింఛన్ల విషయంలో లబ్ధి పొందుతున్న అనర్హులెవరనే కోణంలో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టగా జిల్లా వ్యాప్తంగా దాదాపు 2,600 వరకు తేలాయి. కానీ ప్రస్తుతం ఇదే అంశంపై రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండడంతో ఈ సంఖ్య భారీగానే పెరగొచ్చని తెలుస్తోంది. ఇక సహకార సంఘాల్లో రుణాల దుర్వినియోగం విషయంలో దాదాపు పది సొసైటీలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో అధికారులు గుర్తించారు. వీటి విషయంలో కూడా చర్యల కోసం నివేదికలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇక జగనన్న కాలనీల లబ్ధిదారుల జాబితాను గత ప్రభుత్వం పారదర్శకతకు పాతరేసి అత్యంత గోప్యంగా ఉంచింది. ప్రస్తుతం ఆ లెక్కలు తేల్చే పనిలో నిమగ్నమయి ఉన్న అధికారులకు భూసేకరణలో జరిగిన అవకతవకలు కళ్లు బైర్లు కమ్మేలా చేస్తున్నాయి. ఇదే సమయంలో అనర్హులు సైతం పెద్ద సంఖ్యలో లబ్ధి పొందినట్లు నిర్ధారణకు వచ్చారు.



యద్దనపూడి మండల పరిధిలో పింఛన్ అర్హతపై విచారణ చేస్తున్న యంత్రాంగం

మరో ఎమ్మెల్సీ.. వైసీపీకి గుడ్‌బై

(5వ పేజీ తరువాయి)

మండలికి వెళ్లొద్దన్న ఆదేశాలను పాటించని ఏసురత్నం

పోలీసు అధికారిగా మహిళలు, ప్రజా జీవితంలో ఉన్నవారి గౌరవాన్ని తగ్గించేలా, హీనంగా అటువంటి పోస్టులు పెట్టే వ్యక్తులు ఏ పార్టీ వారైనా శిక్ష అనుభవించాల్సిందే అని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ మాటలతో వైసీపీ పెద్దలు ఆయనపై మరింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అంతమాత్రమే కాకుండా వైసీపీ ఎమ్మెల్సీ ఈ మధ్య కాలంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరైన సమావేశాల్లో కూడా ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడం వంటి వాటిపై వైసీపీ పెద్దలకు నచ్చనట్లు తెలుస్తోంది.

టీడీపీ నేపథ్యమే...

పల్నాడు జిల్లా గురజాలలో పుట్టిన ఏసురత్నంది మొదట నుంచి టీడీపీ నేపథ్యమే. ఆయన చాలా కాలం పాటు స్వర్గీయ నందమూరి తారకరామారావు, నారా చంద్రబాబు నాయుడు వద్ద సెక్యూరిటీ అధికారిగా పనిచేశారు. వైసీపీ 2019లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సీటు కేటాయించటంతో ఆ పార్టీలో చేరారు. మూడు సార్లు దేశంలోనే అతి పెద్దదైన గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్ గా పనిచేశారు.ఇప్పుడు వైసీపీ పెద్దల వైఖరిని ఆయన బహిరంగంగా నే వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.

అటువైపే చూపు...

జనసేన నేతలు ఇప్పటికే పలుమార్లు ఆయన ఇంటికి వెళ్లి పార్టీ లోకి రావాలని కోరినట్లు సమాచారం. పవన్ కల్యాణ్ కూడా ఆయన గురించి ఇప్పటికే ఆరా తీసినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తం మీద వైసీపీ ఎమ్మెల్సీ ఏసురత్నం రేపో మాపో జనసేన లో చేరే అవకాశం మెండుగా కనిపిస్తున్నది.

సాగునీటి సంఘాల ఎన్నికలకు...రేపు నోటిఫికేషన్

(5వ పేజీ తరువాయి)

మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-1,2, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారిపాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి.

కృష్ణా పశ్చిమ డెల్టాలో డీసీల వివరాలు

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో మొత్తం 21 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వాటిల్లో వేమూరు, కొల్లూరు, వెల్లటూరు, రేపల్లె, మోర్తోట, దుగ్గిరాల, తెనాలి, గోవాడ, కూచిపూడి, పీవీ పాలెం, జాగర్లమూడి, పొన్నూరు-1, పొన్నూరు-2, పొన్నూరు-3, బాపట్ల-1, చేబ్రోల, బాపట్ల-2, చీరాల, చినగంజాం, తక్కెళ్లపాడు, పల్లపాడలకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బందికి శిక్షణను పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రిని కూడా సిద్ధం చేశారు. గ్రామల్లో ఒక వైపు రైతులు వరి కోతల బీజీలో ఉండగా మరోవైపు ఎన్నికల జరగుతున్నాయి. పల్లెల్లో నీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది. రానున్న వారం రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ముగియనున్నది.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు

రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా స్వీకరిస్తుండటంతో ఏకగ్రీవ ఎన్నికలు జరగుతాయా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జనవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎం చంద్రబాబు ఎన్నికలపై చేసిన కామెంట్స్ నేపథ్యంలో ఎమ్మెల్యేలు ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎకగ్రీవ ఎన్నికలు జరిగేలా కూటమి కసరత్తు చేస్తోంది. గతంలో ఎక్కువ నీటి సంఘాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. ఈ సారి కూడా అదే స్థాయిలో ఏకగ్రీవాలు జరగుతుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

మట్టి దోపిడీ జరగకుండా పటిష్ట చర్యలు

దర్శి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో మట్టి దోపిడీ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు గనులు, భూగర్భశాఖ అధికారి ఎం.విష్ణువర్ధన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మట్టి దోపిడీపై చర్యలు నిల్' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దర్శి ప్రాంతంలోని లంకోజనపల్లి, చందలూరు, తానంచింతల, వెంకటచలంపల్లి కొండల మట్టిని, బొట్లపాలెం రెవెన్యూలోని పశువులమేత పోరంబోకు భూమిలోని మట్టిని గత వైసీపీ ప్రభుత్వంలో కొల్లగొట్టారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి భవిష్యత్తులో మట్టి దోపిడీ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కుమార్తె మృతిపై ఆందోళన

- పుట్టింటి నుంచి ఆస్తి తేలేదని హత్య చేసినట్లు ఆమె తల్లిదండ్రులకు అనుమానం
- పోలీసులకు ఫిర్యాదు
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్


కుటుంబ సభ్యులతో నవ్య భవాని(ఫైల్)


చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద ఆందోళన చేపట్టిన కుటుంబ సభ్యులు

చీరాలటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మెట్టినింట్లో వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో బంధువులు ఆందోళనకు దిగారు. ఆమె బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కారంచేడు మండలం కుంకులమర్రు గ్రామానికి చెందిన కొమ్మోజు నాగవెంకట బ్రహ్మం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అక్కడ విధులు నిర్వహిస్తూ బీహెచ్ఎల్‌కు చెందిన పెద్దప్రోలు నవ్యభవానీతో పరిచయం పెంచుకున్నాడు. అది కాస్త ప్రేమగా మారడంతో విషయం పెద్దల దగ్గరకు చేరింది. ఆ సమయంలో భవానీ తల్లిదండ్రులు పెళ్లికి నిరాకరించారు. తర్వాత పెద్దలు భారీగానే ముట్టజెప్పి లాంఛనంగా పెళ్లి చేశారు. వీరికి బాబు, పాప జన్మించారు. ప్రస్తుతం అతను కుంకలమర్రులో రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో బ్రహ్మం తన భార్య తరఫున ఉన్న ఇంటిని తన పేరు మీద రాయాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. అందుకు షుగర్ వ్యాధితో బాధపడుతున్న తండ్రి శ్రీనివాస్, కేన్సర్‌తో బాధపడుతున్న తల్లి లక్ష్మీపార్వతి సహకరించలేదు. దీంతో కుటుంబంలో కలతలు చోటుచేసుకున్నాయి. ఇదిలా ఉండగా ఆదివారం మధ్యాహ్నం మీకుమార్తె మెట్లు మీద జారిపడి చనిపోయినట్లు బ్రహ్మం ఫోన్ చేసి చెప్పాడు. ఆశ్చర్యపోయిన కుటుంబ సభ్యులు బంధువులతో కుంకులమర్రు చేరుకున్నారు.

ఉరివేసుకుని మరణించినట్లు చిత్రీకరణ

కుమార్తె మరణవార్త విని కుంకులమర్రు చేరుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆరాతీయగా, ఉరివేసుకుని మరణించినట్లు చెప్పారు. అనుమానం వచ్చి స్థానికులను అడగ్గా.. ఉదయమే కుమార్తె మరణిస్తే సమాచారం మధ్యాహ్నం అందించడంపై మృతిపై అనుమానాలు పెరిగాయి. దీంతో ఎస్సై వెంకటరావుకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ నేపథ్యంలోనే నవ్యభవానీ మృతిపై ఆమె బంధువులు సోమవారం ఉదయం నుంచి చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద ఆందోళనకు దిగారు. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నట్లు ఆరోపించారు. ఘటనకు పోలీసులు కూడా కప్పిపుచ్చేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. డీఎస్పీ మొయిన్‌ను కలిసి ఎస్సైపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై విచారించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో డ్రోన్ కెమేరాను ప్రారంభిస్తున్న దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ తదితరులు

ముండ్లమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ముండ్లమూరు పోలీసు స్టేషన్‌కు సోమవారం దర్శి మండలం రాజంపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు తానికొండ వెంకటరావు డ్రోన్ కెమెరాను అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ నేరాల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈక్రమంలో సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్‌లను ఉపయోగించి ఎలాంటి నేరం కూడా జరగకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. నేరాలు, రోడ్డు ప్రమాదాలతో పాటు వివిధ ఘటనలలో వెంటనే నేరం చేసిన వారిని గుర్తించేందుకు డ్రోన్ కెమెరా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డ్రోన్ కెమెరా దాత వెంకటరావును ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, సీఐ రామారావు, ఎస్ఐలు వై.నాగరాజు, మురపాటి శ్రీనివాస రావు, సోమేపల్లి శ్రీనివాసరావు, కోడిగ మస్తాన్‌రావు, మేదరమెట్ల వెంకటరావు, వేముల పద్మజాన కిరామయ్య, కూరపాటి నారాయణస్వామి, గజ్జల సుబ్బారెడ్డి, పాలపర్తి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసిన్ డిమాండ్



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కనిగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్య ద్ యాసిన్ అన్నారు. సోమవారం స్థాని క మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మి నెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను ఆప్కాస్ లో నమోదు చేసి జీతాలు చెల్లించాలన్నారు. చనిపోయిన, రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబసభ్యులను చేర్చుకోవాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్కువ మందితో ఎక్కువ పనిచేయించటం దుర్మార్గమన్నారు. మున్సిపాలీ పరిధిలో అవసరమైనంత మంది పారిశుధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాం డ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు గుజ్జుల బాలిరెడ్డి, సీపీఐ నాయకుడు జీపీరామారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియ న్ నాయకులు కోటయ్య, అశోక్, కిరణ్, సుబ్రహ్మణ్యం, మస్తాన్, శేషయ్య, ఇమాం హుస్సేన్, తాజుద్దీన్, ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణ

- రాకపోకలకు ఇబ్బందులు
- సిద్దాయిపాలెం గ్రామస్థుల ఆందోళన


రహదారి స్థలం ఆక్రమించారని ఎంపీడీవోకు విన్నవిస్తున్న సిద్దాయిపాలెం గ్రామస్థులు

దొనకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలు రాకపోకలు జరుపుకునే రహదారిని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆక్రమించుకోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈమేరకు సోమవారం సిద్దాయిపాలెం గ్రామస్థులు ఎంపీడీవోకు తమగోడు వెళ్లబోసుకున్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి ప్రజలు రాకపోకలు జరుపుకునే రహదారిపై మట్టికుప్పలు పోశారు. ట్రాక్టర్‌ను దారికి అడ్డంగా పెట్టి రాకపోకలు జరగకుండా దౌర్జన్యంగా అడ్డగిస్తున్నాడని మందగిరి ఇన్నయ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై న్యాయం చేయాలంటూ రెండుసార్లు జిల్లా అధికారులు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. ఇటీవల వీఆర్వో వచ్చి పరిశీలించాడేగాని ఎటువంటి చర్యలు చేపట్టలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తే, తమకు సంబంధంలేదని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నట్టు వారు తెలిపారు. రాకపోకలు జరుపుకునే దారిని ఆక్రమిస్తే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎవరికి వారు మౌనంగా వ్యవహరిస్తుండటంతో న్యాయం కోసం తాము ఎవరిని ఆశ్రయించాలో అర్థంకావడంలేదని వాపోయారు.

స్పందించిన ఎంపీడీవో శ్రీదేవి సమస్యను తహసీల్దార్‌తో ఫోన్‌లో చర్చించారు. తహసీల్దార్ సూచనల మేరకు గ్రామ కార్యదర్శి డేవిడ్, రెవెన్యూ సిబ్బంది వీలైనంత త్వరలో వచ్చి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

విద్యుత్ శాఖ అధికారుల తనిఖీ


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తర్లుపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలం లో విద్యుత్‌శాఖ అధి కారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మార్కా పురం ఏడీఏ పీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 37 బృందాలుగా విడిపోయి 33 గ్రామాల్లో 2532 సర్వీస్‌లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 36 మందిపై కేసులు నమోదు చేశారు. రూ.1.36లక్షల అపరాధ రుసుం విధించినట్లు నాగేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో ఒంగోలు డీపీఈ హైమావతి, డీఈఈలు ఎన్‌సీయా నాయక్, హనుమంత నాయక్, కంభం, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల ఏఈలు పాల్గొన్నారు.

అందుబాటు ధరలో ఇసుకను అందించడమే ప్రభుత్వ ధ్యేయం


ఇసుక నిల్వ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అందరికీ అందుబాటులో ఇసుకను ఉంచేందుకే కూటమి ప్రభుత్వం నియోజకవర్గస్థాయిలో నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక బోడపాడు రోడ్డులో నియోజకవర్గ స్థాయి ఇసుక నిల్వ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుకను ప్రజలకు అందుబాటులో లేకుండా చేశారన్నారు. దీంతో ఒకవైపు కార్మికులు పనిలేక, మరోవైపు భవన నిర్మాణదారులు అధిక ధరలతో తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చిందన్నారు. గత ప్రభుత్వ పాపాల వలన నిర్మాణరంగం కుదేలై తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక విధానాన్ని ప్రకటించి ప్రజలకు అందుబాటు ధరలో ఇసుకను అందిస్తోందన్నారు. నిల్వ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నకిలీమందులు అమ్మితే కఠిన చర్యలు

పొదిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నకిలీ పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి జైన్‌లుబ్దీన్ చెప్పారు. పట్టణంలో సోమవారం పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలకు పంటలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. పురుగు మందులు పిచికారీ చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారన్నారు. అది అదునుగా చేసుకొని దుకాణ యజమానులు రైతులకు నకిలీ మందులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేయరాదని చెప్పారు. అదేవిధంగా రైతులు కొనుగోలు చేసిన పురుగుమందులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. బిల్లు ఇవ్వకపోయినా, స్టాకు రికార్డులు నిర్వహణ సక్రమంగా లేకపోయినా చర్యలు ఉంటాయన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం


మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలకు కూటమి ప్రభుత్వంలో గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేస్తామని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. మండలంలోని విశ్వనాథపురం, ఎండూరివారిపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ధాన్యం సేకరించిన 24 గంటలలోనే రైతుల ఖాతాల్లో నగదును జమ చేసే వీలు కూడా కల్పించిందన్నారు. దళారులను నమ్మవద్దని, ప్రతి రైతూ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని చెప్పారు. గతంలో ఇక్కడ చాలా అవినీతి జరిగిందని, ప్రస్తుతం పారదర్శకంగా కేంద్రాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఏవో నీరజ, మండల టీడీపీ నాయకులు ఎం.వలరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, డి.చలమయ్య, ఆళ్ల నాసరరెడ్డి, జి.వెంకటనారాయణ, కె.కొండలు, బి.వెంగళరెడ్డి పాల్గొన్నారు.

అవీఇవీ

కమ్మేసిన మంచు

దట్టంగా వ్యాపించడంతో వాహనచోదకులకు ఇక్కట్లు


గుండ్లకమ్మ బ్రిడ్జిపై మంచులో ప్రయాణిస్తున్న బస్సులు, వాహనాలు

అద్దంకి, డిసెంబరు 9 : అద్దంకి ప్రాంతంలో మంచు దట్టంగా వ్యాపించింది. మూడు రోజులుగా ఉదయం సమయంలో మంచు ఎక్కువగా ఉంటుంది. ఉదయం 8 గంటల వరకు కూడా మంచు వీడకపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రోడ్లలో సైతం వాహనాల ప్రయాణానికి మంచు అడ్డంకిగా మారింది. దగ్గరకు వచ్చే వరకు ముందు, ఎదురు వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు కూడా దైనందిన కార్యక్రమాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. మంచు ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


మాట్లాడుతున్న ఆర్డీవో గ్లోరియా

పర్చూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో గ్లోరియా అన్నారు. పర్చూరు మండలం చిననందిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ పీ.బ్రహ్మయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆర్డీవో తెలిపారు. రైతుల సమస్యలను అర్జీల రూపంలో అందజేస్తే వాటిని పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆచూకీ తెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు


ఆచూకీ తెలియని వ్యక్తి మృతదేహం

టంగుటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు ఉత్తర బైపాస్‌లో ఆచూకీ తెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. అతని వయసు 40 ఏళ్ల లోపు ఉంటుంది. నీలిరంగు జీన్ ప్యాంటు, కృష్ణ బులుగురంగు చొక్కా ధరించి ఉన్నాడు. కాలర్‌పైన టాన్ ట్యాట్స్ టైలర్స్, చిలకలూరిపేట అని రాసి ఉందని ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తనకు కానీ, సింగరాయకొండ సీఐ, ఒంగోలు డీఎస్పీలలో ఎవరికైనా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

చెన్నుపాడులో యువతి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపాడు గ్రామానికి చెందిన గుత్తి మౌనిక (22) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై అనూక్ కథనం ప్రకారం.. మౌనిక తల్లి ఏడాది క్రితం మృతి చెందింది. తాను కూడా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనేపథ్యంలో సోమవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈమేరకు మౌనిక తండ్రి అంజయ్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గాయపడ్డ మహిళ మృతి

ముండ్లమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లు వద్ద ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. అద్దంకి పట్టణంలోని వసుమర్తివారిపాలెంకు చెందిన పసుమర్తి స్వరూప(40) అనే మహిళ తన భర్త సామేలుతో ద్విచక్ర వాహనంపై మార్కాపురం మండలం గజ్జలకొండకు వెళుతున్నారు. ఈక్రమంలో ఉల్లగల్లు వద్ద ద్విచక్ర వాహనంపైనుంచి జారి పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందింది. భర్త సామ్యేల్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీసీకి మోడల్ స్కూల్ ఎంపిక



ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులతో ప్రిన్సిపాల్

ముండ్లమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని మోడల్ స్కూల్ ఎన్‌సీసీకి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరరావు తెలిపారు. 34వ ఎన్‌సీసీ బెటాలి యన్‌కు చెందిన సుబేదార్ సంతోష్‌సింగ్, ఆర్మీ అధికారి వెంకటనారాయణ సోమవారం మోడల్ స్కూల్‌ను సందర్శించి 70 మంది విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మంది విద్యార్థులను ఎన్‌సీసీ మొదటి బ్యాచ్‌కి ఎంపిక చేశారు. ఈసందర్భంగా సుబేదారు సంతోష్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఎన్‌సీసీ శిక్షణతో భవిష్యత్‌లో వివిధ దళాలు, పోలీసు నియామకాల్లో చాలా సులువుగా ఉద్యోగాలు సాధించవచ్చునని చెప్పారు. ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ స్కూల్ ఎన్‌సీసీ యూనిట్‌కు కేర్ టేకర్‌గా సోషల్ ఉపాధ్యాయుడు సాధు వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారన్నారు.

వివాదాస్పద భూమిలో ఆన్‌లైన్ నిలిపివేత

పామూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కరోళ్లపాడు రెవెన్యూ గ్రామంలో గల సర్వేనెంబర్ 34లో గల 30.26ఎకరాల్లో ఆన్‌లైన్ చేయడంలేదని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. ఈ భూమి కోర్టు వివాదంలో ఉన్నందున ఎవరిపేరు మీద పాస్ పుస్తకం, ఆన్‌లైన్ చేయడం లేదని తెలిపారు. కరోళ్లపాడు సర్వేనెంబర్ 34లో భూ మాయ శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈభూమికి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. ఈభూమి ప్రస్తుత్తం సాగులో లేకపోవడంతో చిల్లచెట్లతో నిండి ఉందన్నారు. ఆ భూమిపై కనిగిరి జూనియర్ జడ్జి కోర్టులో ఓఎస్ నెంబర్ 117/2017 విచారణ పెండింగ్‌లో ఉందని తెలిపారు.



మంగు వాతావరణంతో ఆగిన మగ్గం

వీడని మంగు ఆగిన మగ్గం

చీరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గత కొంతకాలంగా తుఫాన్లు ప్రభావంతో వర్షాలు, ఆ తరువాత మంగు వాతావరణంతో మగ్గం పని కుంటుపడింది. ప్రస్తుతం వర్షం ఆగినప్పటికీ మంగు వాతావరణం కొనసాగుతోంది. మగ్గం పని సక్రమంగా సాగడం లేదు. రోజుకు మూడు, నాలుగు గంటల పని కూడా సాగటం లేదని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా సగటు చేనేత కార్మికులు వారంతపు మజూరీ బట్వాడా(కూలీ పంపిణీ)తోనే భృతి సాగిస్తుంటారు. అయితే దాదాపు 10, 15 రోజుల నుంచి సక్రమంగా పని సాగడం లేదు. వ్యాపారులు వాతావరణం సక్రమంగా లేకపోవడంతో పెట్టుబడులు పెట్టేందుకు వెనకడుగు వేస్తున్నారు. పెద్ద రకాలు నేసే వారు ఒకింత ఆర్థిక పరిపుష్టితో ఉంటారు. వారికి కొన్ని రోజులు పని ఆగినా పెద్ద కష్టమేమీ ఉండదు. చిన్న రకాలు నేసే వారి పరిస్థితి చెప్పలేనిది. ప్రధానంగా వ్యాపారుల వద్ద కూలికి వెళ్లే కార్మికుల పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని ఆ రంగ ప్రతినిధులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో కార్మికులకు పని భద్రత కల్పించాలని కోరుతున్నారు.

ఏఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ఇంకొల్లు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండల పరిధిలో రాత్రివేళ గస్తీ పెంచడంతో పాటు నేర నియంత్రణకు కృషి చేస్తానని ఏఎస్ఐ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన నాగలక్ష్మి మాట్లాడారు. గతంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇంటిలిజెన్స్ అధికారిగా, తదుపరి చందోలులో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇంకొల్లుకు వచ్చినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తానని, సిబ్బంది సమష్టి కృషితో ముం దుకు సాగుతామని చెప్పారు.

తాగి నిద్రపోతున్నారు!

- మందుబాబులకు అడ్డాగా ఆర్టీసీ బస్టాండ్‌లు
- మద్యం మత్తులో బల్లలపై సేదతీరుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



నిరుపయెగంగా ఉన్న బల్లికురవ బస్ స్టేషన్‌లో మద్యం బాటిళ్లు, గ్లాసులు

అద్దంకిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ మందుబాబులకు లాడ్జిగా మారింది. ఫుల్లుగా తాగొచ్చి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు వేచి ఉండే బెంచీలపై దర్జాగా నిద్రపోతున్నారు. కొందరు మద్యం తాగి తూలుతూ వచ్చి బల్లలపై స్పృహ లేకుండా ఉంటున్నారు. మత్తులో అక్కడే మల విసర్జన చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు బల్లలపై, మరికొందరు బల్లల కింద పడి ఉండడంతో అటుగా వెళ్లేందుకు ప్రయాణికులు భయపడుతున్నారు. పైగా ఆ ప్రాంతమంతా దుర్గంధంగా మారడంతో నిల్చోలేని పరిస్థితి నెలకొంటుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ బస్టాండ్‌లో మద్యం తాగొచ్చి ఇలా చేస్తున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు అంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో మందుబాబులు లేకుండా చర్యలు తీసుకోవాలని, లోపలా బయట పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అద్దంకిలో తాగి పడి ఉన్న వ్యక్తి

బల్లికురవలో నిరుపయోగం

బస్సులు రాకపోవడంతో బార్‌గా మారిన స్టేషన్

బల్లికురవ : ప్రయాణికుల సౌకర్యార్థం ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసిన నిర్మించిన బస్టాండ్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ప్రయాణికులకు ఉపయెగ పడాల్సిన బస్ స్టేషన్ మందుబాబులకు నిలయంగా మారింది. బస్సులు బస్ స్టేసన్‌లోకి రాకపోవడం వలనే ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు అరోపిస్తున్నారు. బల్లికురవలో మూడు దశాబ్దాల కిందట ప్రయాణికులకు ఇబ్బందిలు లేకుండా ప్రభుత్వం రూ.లక్షల ఖర్చుతో బస్ స్టేషన్‌ను నాలుగు రోడ్ల జంక్షన్‌లో నిర్మించింది. మెదట్లో బస్సులు అన్ని స్టేషన్‌లోకి రావడం కంట్రోలర్‌ను ఉంచడంతో ప్రయాణికులు కూడా లోపలికి వచ్చి అక్కడే బస్సులను ఎక్కేవారు. ఆ తర్వాత అర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో బస్సులు బస్టాండ్ రాకుండా రోడ్డు మీది నుంచే వెళ్తున్నాయి. అప్పటి నుంచి బస్టాండ్ నిరుపయోగంగా మారింది. దీనిని ఆసరాగా తీసుకొని మద్యం తాగివచ్చిన వారు బస్టాండ్‌లోనే సేద తీరుతున్నారు. దీనిపై పలుమార్లు ప్రయాణికులు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు నాలుగు రోడ్ల కూడలి వ్ద ఎండైనా, వానైనా బస్సుల కోసం వేచి ఉండి వెళ్తున్నారు. దీంతో బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి వేళ లైట్లు లేకపోవడంతో మందుబాబులు బార్‌గా ఉపయోగించుకుంటున్నారు. పగటి పూట కూడా అక్కడే మందు తాగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆర్టీసీ బస్టాండ్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకు రావాలని, అన్ని బస్సులు స్టేషన్ నుంచి తీస్తే మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



బల్లలపై పడుకున్న వ్యక్తులు



చెన్నుపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చెన్నుపాటి ఆశయాలను అనుసరించాలి

అద్దంకిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు చెన్నుపాటి లక్ష్మయ్య అని, ఆయన ఆశయాలను ఉపాధ్యాయులందరూ కొనసాగించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో లక్ష్మయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.బాబూరావు, గౌరవ అధ్యక్షుడు వి.సుధాకర్, ప్రధాన కార్యదర్శి బి. పూర్ణచంద్రరావు, ఉపాధ్యాక్షుడు రాజశేఖర్, ట్రెజరర్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు హనుమంతరావు, చంద్రశేఖర్, గంగాధర్, కృష్ణారావు, శ్రీను పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యలకు పరిష్కారం

అద్దంకి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డయల్ యువర్ డీఎంకు ప్రయాణికుల నుంచి వచ్చిన సమస్యలకు పరిష్కారం చేపట్టినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. వినుకొండ నుంచి అద్దంకి వచ్చేందుకు సాయంత్రం సమయంలో అదనపు బస్‌ను ఏర్పాటు చేయడంతో పాటు సమయాలను ప్రయాణికులకు అనుకూలంగా మార్పు చేసినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 4-30, 5-00, 5-00 గంటలకు వినుకొండలో బయలు దేరే విధంగా సమయాలను మార్పు చేసినట్లు తెలిపారు. బొద్దికూరపాడు నుంచి విజయవాడకు నడుపుతున్న బస్‌ను మిగిలిన రోజులలో మాదిరిగానే ఆదివారం కూడా నడిపేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బల్లికురవ మీదుగా గుంటూరు సర్వీసును నడపడం సాధ్యం కాదని తెలిపారు.

కోలలపూడిలో నేలకొరిగిన వరి

- ఆవేదనలో రైతులు
- పరిశీలించిన వ్యవసాయాధికారులు



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

మార్టూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజుల కిందట కురిసిన వర్షాలకు మండలంలోని కోలలపూడి గ్రామంలో చేతికి అంది వచ్చిన సుమారు 80ఎకరాల వరి పంట సాగు పొలంలో నేలకొరిగింది. పొలంలో పడిపోయిన వరి పంటను వ్యవసాయ సిబ్బంది పరిశీలించారు. వాస్తవంగా గత వారం రోజుల కిందట తుఫాన్ కారణంగా అడపా దడపా కురిసిన వర్షాలకు, గాలులకు పొలంలో చేతికి అందేదశలో ఉన్న వరిపంట వడ్లగింజలు బరువై మొక్కలకు కొంతభారం ఏర్పడింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి 80 ఎకరాలలోని వరి పంట నేలకు ఆనింది. గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది మండలంలో వరిపంట సాగు విస్తీర్ణ పెరిగింది. ఖరీఫ్, రబీలలో 2070 ఎకరాలు వరి పంట సాగుచేస్తున్నారు. ఇదిలా వుండగా పడిపోయిన వరి పంటను పరిశీలించిన వ్యవసాయ సిబ్బంది వడ్లు మొలకలు రాకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. నేలకొరిగిన వరి పంటను పరిశీలించిన అనంతరం ఈ విషయాన్ని జిల్లా వ్యవసాయఅధికారులకు తెలియచేస్తామని వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ తెలిపారు.

మూడు రోజులు వరి కోతలు వద్దు

తుఫాను హెచ్చరిక ఉన్నందువలన మంగళ, బుధ, గురు వారాలలో రైతులు వరికోతలు చేపట్టవద్దని వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కోలలపూడిలో వరి, మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. గత మూడురోజులు క్రితం కురిసిన వర్షాలకు మొక్కజొన్న ఎదుగుదల పై ప్రభావం పడే అవకాశం ఉందని, అందుకు సంబంధించి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు మండలంలో రైతులు నష్టపోయిన పంట వివరాలను గుర్తించాలని, రైతులకు పంట నష్టపరిహారాన్ని అందచేయాలని రైతుసంఘ మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మినుము, వైట్ బర్లీ, పొగాకు నష్టం జరిగిందన్నారు. సమావేశంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, హనుమంతరావు, రాంబాబు, సూరిబాబు, మోహనరావు పాల్గొన్నారు.

మొక్కజొన్న వరి కోతను వాయిదా వేయండి

అద్దంకిటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాయుగుండం కారణంగా ఈ నెల 11, 12 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మొక్కజొన్న, వరిని సాగు చేసిన రైతులు కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సోమవారం పకటన ద్వారా తెలిపారు.



రేషన్ డీలర్ పోస్టులకు పకడ్బందీగా పరీక్ష

హాజరైన 94 మంది



రాత పరీక్షలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాలటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల డివిజన్ పరిధిలోని నోటిఫికేషన్ ద్వారా జారీ అయిన చౌకధరల దుకాణాలకు డీలర్‌ల నియామకానికి సంబంధించి రాత పరీక్షలు సోమవారం స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్‌లో పటిష్ట భద్రత నడుమ జరిగాయి. వీటిని తహసీల్దార్ గోపీకృష్ణ పర్యవేక్షించారు. డివిజన్ పరిధిలో మొత్తం 139 రెగ్యులర్ డీలర్‌లు ఖాళీగా ఉండగా, కొత్తగా మరో నాలుగు దుకాణాలు ఏర్పాటు అ య్యాయి. దీంతో 143 దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే ఈ పరీక్షలు ఈనెల 2వ తేదీనే జరగాల్సి ఉండగా, తుఫాన్ ఒకవైపు అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు బాపట్ల కార్యక్రమం ఉండడంతో పరీక్షలు సోమవారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పది మండలాలకు సంబంధించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పనలో భాగంగా చేపట్టిన ఈ పరీక్షలకు 112 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 94 మంది మాత్రమే హాజరయ్యారు. 18 మంది గైర్హాజరయినట్లు అధికారులు తెలిపారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు ఆధారంగా త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

అదుపుతప్పి కారును ఢీకొన్న ఆటో

ఇద్దరికి తీవ్ర గాయాలు

చీరాలటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో ఆటో అదుపు తప్పింది. ఈక్రమంలో ముందు వెళుతున్న కారును ఢీకొంది. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం 216 జాతీయ రహదారిలోని అక్కాయిపాలెం వద్ద చోటుచేసుకుంది. ఆటో డ్రైవర్ సురేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు కేశవస్వామి వీధికి చేందిన దండూరి సురేంద్ర, క్లీనర్ రవితేజ పీవోపీ మెటీరియల్ లోడును బాపట్ల దించేందుకు ఆటోలో వెళ్తున్నారు. ఈక్రమంలో అక్కాయిపాలెం వద్ద అదుపు తప్పి ముందు వెళుతున్న కారును ఢీకొన్నారు. ఘటనలో కారు వెనుక భాగం దెబ్బతినగా, వీరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటో కూడా చాలాభాగం దెబ్బతింది. అయితే స్థానికులు వీరిని 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లకు మరమ్మతులు

ఇంకొల్లు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : 40 గ్రామాలకు కేంద్రంగా ఉన్న ఇంకొల్లు ఆర్టీసీ బస్టాండులో మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టారు. 1993లో వాటిని నిర్మించగా నాటి నుంచి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేదు. చీరాల డీఎం శ్యామల సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మరమ్మతులకు రూ.4లక్షల నిధులు కేటాయించారు. సోమవారం పనులు మొదలు పెట్టారు. లోపల పైపులైన్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. బస్టాండ్‌లో అభివృద్ధి పనులు చేయడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తపరుస్తున్నారు.



బస్టాండ్‌లో జరుగుతున్న పనులు



ఎంపికైన అభ్యర్థులతో కళాశాల ప్రిన్సిపాల్, ప్రతినిధులు

జాబ్ మేళాలో 59 మంది ఎంపిక

అద్దంకిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 59 మంది ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు తెలిపారు. మొత్తం 116 ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 104 మంది హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో పలు కంపెనీలకు 59 మంది ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని ప్రిన్సిపాల్ మోహనరావుతో పాటు ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ ఎంవీ సత్యనారాయణ, జేకేసీ కోఆర్డినేటర్ ఎస్.షర్మిలారాణి, వి.శిఖామణి, మెంటర్ వినుకొండ రమేష్ అభినందించి శుభాకంక్షలు తెలియజేశారు.

దివ్యాంగుల ఇళ్ల సమస్యను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చినగంజాం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దివ్యాంగుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కారాల వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావుకు మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సైకం ఏడుకొండలుతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని 58 మంది దివ్యాంగులకు గతంలో సర్వే నెంబరు 595 లో ఎకరా30సెంట్ల ప్రభుత్వ భూమిని కేటాయించి ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు ప్రతాప్‌కుమార్ తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో ఆ స్థలంలో కొందరి గుడిసెలను తొలగించి కొంత మంది అక్రమార్కులు నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉన్నారని తెలిపారు. తగు చర్యలు తీసుకొని దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చినగంజాం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ ఎరెక్షన్ పనుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలింగా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ పి.గణనారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మున్నంవారిపాలెం, సోపిరాల, పూలవారిపాలెం, కడవకుదురు, చింతగుంపల్లి, గొనసపూడి గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హైస్కూల్‌కు బల్లల బహూకరణ



పూర్వవిద్యార్థులు బహూకరించిన బల్లలతో ఉపాధ్యాయులు

మార్టూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ హైస్కూల్‌లో 1983-84కు చెందిన 10 వతరగతి పూర్వ విద్యార్థులు 6 బల్లలను బహుకరించారు. సోమవారం వాటిని ఉపాధ్యాయుల సమక్షంలో స్కూలుకు అప్పగించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఘంటసాల బంగారుబాబు, కమ్మ సుబ్బయ్య, పొత్తూరి రమేష్ బాబు ప్రధానోపాధ్యాయులు రూత్‌మెర్సీజాయ్, ఉపాధ్యాయులు రాము, గిరి, వెంకట్రావు పాల్గొన్నారు.

అదానితో గత వైసీపీ ప్రభుత్వ ఒప్పందాన్ని రద్దు చేయాలి

బల్లికురవ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం అదానితో కుదుర్చుకున్న ఆర్థిక ఒప్పందాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌ను కలిసి విన్నవించారు. పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, మండల నాయకులు వల్లెపు నరసింహం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

బల్లికురవ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైదన గ్రామ శివార్లో పేకాట ఆడుతున్న శిబిరంపై సోమవారం సంతమాగులూరు సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,18,300 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి, సంతమాగులూరు ఎస్ఐ పట్టాభిరామ్య, బల్లికురవ స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బల్లికురవ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన పూసుకూరి హరిబాబు(39) సోమవారం చిలకలూరిపేట సమీపంలోని హైవే రోడ్డు వద్ద లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. పొలం పనులతోపాటు చిరు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న యువకుడు హరిబాబు చిలకలూరిపేట వెళ్లి తిరిగి వస్తుండగా లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. హరిబాబుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతూ..

మార్టూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని బైక్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రగాయాలకు గురై గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎస్‌కే సుభాని (40) ఆదివారం రాత్రి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ పులి ఆంజనేయులు సోమవారం తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కందుకూరుకు చెందిన ఆయన నాలుగేళ్లుగా మార్టూరులోనే అత్త వారింట్లోనే ఉంటున్నారు. ఈనెల 7వ తేదీన ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఆయన్ని మరో బైకిస్టు ఢీకొట్టాడు. సుభాని భార్య మస్తాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ ఢీకొని పూజారి మృతి



శ్రీరామచంద్రమూర్తి

అద్దంకి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొని పూజారి శ్రీరామచంద్రమూర్తి (73) మృతి చెందారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. శింగరకొండకు చెందిన కోట శ్రీరామచంద్రమూర్తి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూజారిగా పనిచేస్తూ దశాబ్ద కాలం కిందట ఉద్యోగ విరమణ చేశారు. శింగరకొండపాలెం దేవాలయంలో పూజారిగా చేయడంతో పాటు పలు గ్రా మాలకు పురోహితులుగా ఉంటూ వివాహ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తుంటూ అందరికీ సుపరిచుతులుగా ఉన్నారు. సోమవారం సాయంత్రం శింగరకొండ నుంచి మోటార్‌సైకిల్‌పై అద్దంకి పట్టణానికి వచ్చి పోతురాజు గండి వద్ద నామ్ రోడ్డు క్రాస్ చేసే క్రమంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. లారీ ముందు బంపర్‌లో ఇరుక్కుపోయి సుమారు 20 మీటర్ల దూరం ఈడ్చుకుపోయింది. ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతి చెందారు. శ్రీరామచంద్రమూర్తికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు కిషోర్, రామకృష్ణ శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూజారులుగా పనిచేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నా పిత్రార్జిత భూమి... ప్రభుత్వ రికార్డుకెక్కించారు!

పరిశీలించి న్యాయం చేయండి

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఆత్మకూరు కౌన్సిలర్



మీడియాతో మాట్లాడుతున్న భాస్కరరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తనకు పిత్రార్జితంగా సక్రమించిన భూమిని అధికారులు ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో చేర్చారని, పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ ఆత్మకూరు లోని 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కరరెడ్డి సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఆత్మకూరు మండలం నాగులపాడు మదిర చెర్లోఎడవల్లిలో భాస్కరరెడ్డికి పిత్రార్జితం ద్వారా 1.24 ఎకరాల పొలం సక్రమించింది. అయితే ఈ భూమిని ప్రభుత్వ భూమిగా రికార్డులలో నమోదు కావటంతో దానిని తొలగించాలంటూ తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగాడు. పలుమార్లు తిరిగిన తర్వాత ఆ ఫైల్‌ను కలెక్టరేట్‌కు పంపారు. కలెక్టరేట్‌కు ఫైల్ వచ్చి నాలుగు నెలలైనా, 17 సార్లు కలెక్టరేట్ చుట్టూ తిరిగినా, తన సమస్య పరిష్కారం కాలేదని భాస్కరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

కౌన్సిలర్‌కే కష్టం

ఉద్యాన రైతులకు ప్రోత్సాహక రాయితీలు

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోత అనంతరం యాజమాన్య పథకం కింద కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూం, మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా 35 నుంచి 40శాతం వరకు రాయితీ అందిస్తున్నట్లు ఆ శాఖ అధికారి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పండ్లు, కూరగాయలు, పూలను సేకరించి గ్రేడింగ్, క్లీనింగ్, ప్యాకింగ్ చేసేందుకు ఉపయోగపడే కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి రూ.15లక్షలు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఇందులో రూ.5.25 లక్షల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు. అదేవిధంగా పంటను ఎక్కువ రోజులు నిల్వ చేసేందుకు ఉపయోగపడే కోల్డ్ రూము నిర్మాణానికి రూ.12.5 లక్షలు ఖర్చవుతుండగా, రూ.5లక్షల వరకు, మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణానికి రూ.25 లక్షలు ఖర్చవుతుండగా, రూ.10 లక్షల వరకు రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

బోగస్‌పై ఫోకస్

- అనర్హులను తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయం
- ఇంటింటి సర్వేకు పైలట్ గ్రామంగా చెంచుగానిపాలెం
- పది ప్రత్యేక బృందాలతో వివరాలు సేకరణ
- ఫిర్యాదుల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చర్యలు

నెల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బోగస్ పింఛన్లపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. గత ప్రభుత్వంలో నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ విచ్చలవిడిగా అనర్హులకు పింఛన్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఆస్తులున్నా లేనట్లుగా చూపడం, దివ్యాంగులు కాకపోయినా ఆ కోటాలో పింఛన్లు పొందడం వంటి అనేక వ్యవహారాలు ఆధారాలతో సహా ఫిర్యాదులు వెళుతున్నాయి. అదే సమయంలో రాజకీయ కక్షలతో అర్హులకు పింఛన్లు తొలగించినట్లు కూడా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో పింఛన్లపై సర్వే చేయాలని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పింఛన్ అందుకుంటున్న వారి అర్హత వివరాలను పరిశీలించాలని నిర్ణయించింది. తొలుత జిల్లాకు ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా సర్వే చేయాలని భావించింది. ఆ సర్వేలో వచ్చే ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ మేరకు సెర్ప్ సీఈవో నుంచి కలెక్టర్‌కు ఉత్తర్వులు అందాయి. జిల్లాలో కావలి మండలం చెంచుగానిపాలెం గ్రామాన్ని పైలట్ గ్రామంగా తీసుకొని ఆ గ్రామంలోని పింఛన్‌దారుల అర్హతపై సర్వే చేయాలని ఆదేశించారు. సోమ, మంగళవారాల్లో ఈ సర్వేను పూర్తి చేసి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పింఛన్ల యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సెర్ప్ సీఈవో తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● రంగంలోకి ప్రత్యేక బృందాలు

చెంచుగానిపల్లిలో సర్వేకు కలెక్టర్ ఓ ఆనంద్.. పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఒక ఈవోపీఆర్‌డీ, ఒక జూనియర్ లేదా సీనియర్ అసిస్టెంట్ ఉంటారు. వింజమూరు, జల దంకి, కలిగిరి, కందుకూరు, ఉలవపాడు, బోగోలు, దగదర్తి, అల్లూరు, కొడవలూరు, విడవలూరు మండలాలకు చెందిన ఈవోపీఆర్‌డీలు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు విచారణ బృందాల్లో సభ్యులుగా ఉన్నారు. ఈ సర్వేను కావలి డీఎల్‌డీవో పర్యవేక్షిస్తున్నారు. చెంచుగాని పల్లిలో మొత్తం 396 పింఛన్లు ఉన్నాయి. ఈ క్రమంలో ఒక్కో విచారణ బృందం 40 పింఛన్లు సర్వే చేసే విధంగా విభజించారు. సోమవారం నుంచి క్షేత్రస్థాయిలో ఈ బృందాలు సర్వే ప్రారంభించాయి. పింఛన్‌దారుడి ఇంటికి వెళ్లి వారి కుటుంబ వివరాలు, ఆస్తుల వివరాలను విచారిస్తున్నారు. దివ్యాంగుల కోటాలో పింఛన్ తీసుకుంటుంటే.. నిజంగా వారు దివ్యాంగులా? కాదా? అన్నది పరిశీలిస్తారు. అలానే ఆ గ్రామంలో కూడా పింఛన్‌దారుడి గురించిన వివరాలు తెలుసుకుంటారు. కాగా ప్రస్తుతం జిల్లాలో 3,09,997 మంది వివిధ కోటాలో పింఛన్లు అందుకుంటున్నారు. వీరికి ప్రతి నెలా రూ.131.62 కోట్లను ప్రభుత్వం చెల్లిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో కొత్త పింఛన్లు మంజూరు చేయగా వాటిల్లో చాలా వరకూ అనర్హమైనవి ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వివిధ కేటగిరీల్లో నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ సానుభూతిపరులకు పింఛన్లు మంజూరు చేసినట్లు అనేక ఫిర్యాదులున్నాయి. ఇప్పుడు క్షేత్రస్థాయి సర్వే పూర్తయ్యాక వాస్తవాలు తేలనున్నాయి.



కావలి రూరల్ : చెంచుగానిపాలెంలో పింఛన్లు తనిఖీ చేస్తున్న ప్రత్యేక బృందాలు

బకాయిలు 163 కోట్లు

- పన్ను వసూళ్లకు కార్పొరేషన్ అధికారుల విశ్వప్రయత్నం

వసూలు 40 కోట్లే!

- మొండి బకాయిదారులకు 'రెడ్ నోటీసులు'
- అయినా స్పందించకుంటే విద్యుత్ సర్వీసుల కట్

నెల్లూరు నగర పాలక సంస్థకు ప్రధాన ఆదాయ వనరైన పన్ను వసూళ్ల పై ఆ సంస్థ దృష్టి సారించింది. మరో మూడు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో మొండి బకాయిలు వసూళ్లు చేయాలన్న నిర్ణయానికి ఉన్నతాధికారులు వచ్చారు. గత కొన్నేళ్లగా రూ.92.58 కోట్ల పన్నుబకాయిలు పేరుకుపోగా, తాజాగా మరో రూ.71.02 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మొత్తంగా రూ.163.06 కోట్లు కార్పొరేషన్ ఖజానాకు చేరాల్సి ఉండగా అందులో ఇప్పటి వరకు రూ.40 కోట్లు మాత్రమే వసూళ్లు చేశారు. మిగిలిన రూ.123.06 కోట్ల వసూలుకు ఆర్ఐ, ఆర్వోల ద్వారా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. మొండి బకాయిదారులను గుర్తించి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నా స్పందించకపోతే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు.

నెల్లూరు (సిటీ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని 166 సచివాలయాల ద్వారా 1.34 లక్షల అసెస్‌మెంట్లు, మరో 6,907 ఖాళీ స్థలాల ద్వారా భారీగా ఆర్థిక వనరులు ఎన్‌ఎంసీ ఖజానాకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కానీ వీటిని వసూలు చేయడంలో కార్పొరేషన్ రెవెన్యూ విభాగం ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు గుప్పుమనడంతో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్వయంగా రంగంలోకి దిగారు. ఆయన నెల్లూరుకు వచ్చినప్పుడల్లా కార్పొరేషన్‌లో సమీక్ష నిర్వహించి వసూళ్లపై ఆరా తీస్తున్నారు. కమిషనర్ సూర్యతేజ కూడా ఆర్‌ఐలు, ఆర్వోలకు నిత్య టార్గెట్లు విధించి, మొండి బకాయిలను వసూళ్లు చేసే పనిలోపడ్డారు. వారాంతపు రోజుల్లో ప్రత్యేక డ్రైవ్‌లను కూడా నిర్వహిస్తున్నారు. నగరంలోని 54 డివిజన్లలో రూ.163.06 కోట్ల పన్నుల రూపేణా వసూళ్లు చేయాల్సిన భారీ లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు సుమారు రూ. 40 కోట్లు మాత్రమే వసూళ్లు చేశారు.



ఇటీవల ఓ భవంతికి విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

● రెవెన్యూ మార్పునకు బీజం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన రెవెన్యూలో ఆర్వో, ఆర్‌ఐల బదిలీల వ్యవహారం పన్ను వసూళ్ల వద్దే బీజం పడింది. అటు మంత్రి, ఇటు కమిషనర్‌లు ఎంత హెచ్చరించినా రెవెన్యూ అధికారుల్లో మార్పు రాకపోవడంతో తుది దశలో కఠిన నిర్ణయం తీసుకున్నారు. సమూలంగా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన కమిషనర్ సూర్యతేజ ఆర్వో, ఆర్‌ఐలను బదిలీ చేసి శానిటేషన్ బాధ్యతలను అప్పగించారు. ఆస్తి పన్ను వసూళ్లలో పురోగతి లేకపోవడం, సచివాలయాలు, ఆర్‌ఐల వారీగా వివరాలు అందచేయడంలో జాప్యం చూపుతున్నారన్న కారణంతో రెవెన్యూ ప్రక్షాళనకు బీజం పడిందన్న విమర్శలు ఉన్నాయి.

● పన్నుల వసూళ్లకు కఠిన చర్యలు

మొండి బకాయిదారులకు ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు పురపాలక చట్టంలోని అన్ని మార్గాలను అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారు. ఇప్పటికే భారీగా పేరుకుపోయిన బకాయిలున్న సంస్థలు, వ్యక్తులను సచివాలయాల వారీగా గుర్తించిన రెవెన్యూ అధికారులు వరుస నోటీసులు ఇచ్చారు. అనంతరం తుది హెచ్చరికగా రెడ్ నోటీసులను జారీ చేశారు. అయినా స్పందన లేకపోవడంతో కొళాయి కనెక్షన్లను కట్ చేసి హెచ్చరించారు. అప్పటికీ కొందరు స్పందించకపోడంతో తాజాగా విద్యుత్ కనెక్షన్లను కట్ చేస్తున్నారు. తదుపరి మరింత కఠినంగా వ్యవహరించేందుకు పురపాలక శాఖ ప్రభుత్వం నుంచి మరిన్ని అనుమతులు తీసుకునేందుకు సిద్ధమైంది.



డిమాండ్ నోటీసులు సిద్ధం చేస్తున్న ఉద్యోగులు

ఎవరికీ మినహాయింపులేదు



నెల్లూరు సిటీని అన్నింటా అభివృద్ధి చేసి ప్రజలకు సకల సౌకర్యాలు సమకూర్చాలంటే డబ్బులు కావాలి. అదంతా పన్నుల రూపేణా రావాల్సిందే. ప్రతి ఒక్కరు పన్ను చెల్లించి తీరాలి. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు. పన్నులు చెల్లించడం పౌరులు తమ బాధ్యతగా వ్యవహరించాలి.

- సూర్యతేజ, ఎన్‌ఎంసీ కమిషనర్

'రాళ్లపాడు'లో పూర్తికాని గేటు మరమ్మతు పనులు


లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : దెబ్బతిన్న రాళ్లపాడు కుడి కాలువ గేటు మరమ్మతు పనులు సోమవారం సాయంత్రానికి కూడా పూర్తి కాలేదు. ప్రాజెక్టు డీఈ వెంకటేశ్వర్లు, ఏఈలు, సిబ్బంది తూము లోపలకు వెళ్లి గేటుకు తాడు కట్టి పైకి లాగేందుకు ప్రయత్నించారు. రెండు సార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో గేట్ల మరమ్మతు నిపుణుడు బాషా కోసం ఎదురు చూస్తున్నారు. కాగా, గేటుకు సంబంధించిన కొన్ని పరికరాలు తెచ్చేందుకు, మరికొన్ని పరికరాల వెల్డింగ్ పనుల కోసం బాషా ఒంగోలు వెళ్లారు. ఆయన వచ్చాక మంగళవారం ఉదయం నుంచి మరమ్మతు పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కుడికాలువలో నీటి ప్రవాహం లేకపోవడంతో వరి నారుమడులు, వరినాట్లు, దుక్కులు ఎండి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కుడి కాలువ గేటును పైకి లాగేందుకు ప్రయత్నిస్తున్న యంత్రాంగం

ఇక జాగ్రత్త అవసరం

- గరిష్ఠ మట్టానికి చేరిన సోమశిల
- కొనసాగుతున్న 4,751 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో




అనంతసాగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నిండుకుండను తలపిస్తూ గరిష్ఠ మట్టానికి చేరుకొంది. దీంతో అధికార యంత్రాగం అప్రమత్తమైంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 73.002 టీఎంసీలు దాటి 74 టీఎంసీలకు చేరువైంది. పైతట్టు ప్రాంతాల నుంచి 4,751 క్యూసెక్కుల వరద వస్తుండటంతో ఇంజనీర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఎగువ నుంచి వచ్చే ప్రతి నీటిబొట్టును ప్రాధ్యానతగా చూడాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాజెక్టు మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది. గత వైసీపీ పాలనలో చేసిన తప్పిదాలు పునరావృత్తం కాకుండా నిపుణుల మండలి ఇప్పటికే ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేసింది. అనుకోని రీతిలో ఎగువన భారీ వర్షాలు కురిసి సోమశిలకు వచ్చే వరద స్థాయి పెరిగితే నీటి నిల్వను అంచనా వేసుకొంటూ దిగువకు వదులుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడినట్లు విశ్రాంత ఉద్యోగులు చెబుతున్నారు. ఆ దిశగా అప్రమత్తం అవసరం ఎంతైనా ఉంది. మరోవైపు రానున్న 20 రోజుల్లో వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తుండగా ఇక సోమశిలలో ఎగువ నుంచి వచ్చే భారీ వరదను బట్టి డ్యాం క్రస్ట్‌గేట్లు ఎత్తే అవసరం ఏర్పడనుంది.

● కండలేరుకు ఐదువేల క్యూసెక్కులు

సోమశిల నుంచి కండలేరుకు వరద కాలువ ద్వారా 5000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. మొదటిపంటకు ఉత్తర కాలువ ద్వారా 500, దక్షిణ కాలువ ద్వారా 150 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● 'కండలేరు'లో 55.2 టీఎంసీలు

రాపూరు (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 55.2 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 4800 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 1795 క్యూసెక్కులు ఉన్నట్లు పేర్కొన్నారు.



నేలకూలిన జెండామాను

ముత్తుకూరు మండలం పల్లెపాడుదిన్నెలో సోమవారం వందేళ్ల నాటి వేపచెట్టు నేలకొరిగింది. సిమెంటు రోడ్డు పక్కనే ఉన్న రచ్చబండ బీటలు వారి వేర్లు బయటపడడంతో ఈ భారీ వృక్షం పడిపోయింది. వందేళ్ల నుంచి జెండా మానుగా పూజలు అందుకుంటున్న ఈ చెట్టు కుప్పకూలడంతో స్థానిక ముస్లింలు ఆశ్చర్యానికిలోను కావడంతో పాటు ఆవేదన చెందారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మట్టి గుల్లబారి ఈ ప్రమాదం జరిగి ఉంటుందని వారు భావిస్తున్నారు.

- ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి)



మైదానం కాదండోయ్ !

ఈ చిత్రంలో అంతా పచ్చగా కనిపిస్తుంది కదూ... ఇదేదో క్రీడా మైదానం అనుకోకండి. బాగా గమనిస్తే నీళ్లు కూడా కనిపిస్తున్నాయి. మై దానంలోకి వాననీళ్లు వచ్చాయా.. అంటే కా నేకాదు. కనుపూరు కాలువ నుంచి గురి విందపూడి చెరువుకు సాగునీరందించే వరవ కాలువ ఇది. ఇదిగో ఇలా గుర్రపుడెక్క పెరిగి మైదానాన్ని తలపిస్తోంది. గుర్రపుడెక్కను తొలగిస్తే చెరువుకు వేగంగా నీరు చేరే అవకాశం ఉంటుంది. అధికారులు తొలగింపు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

-మనుబోలు, (ఆంధ్రజ్యోతి)



దాహం తీర్చండి సార్!

కోవూరు, డిసెంబరు 9: తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఇనమడుగు మిక్సిడ్ కాలనీకి చెందిన మహిళలు సోమవారం సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. నాలుగైదు రోజులుగా పంచాయతీ సి బ్బంది నిర్లక్ష్యం వల్ల తమకు తాగునీటి సమస్య తలె త్తిందని వారు వాపోయారు. అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తానని సర్పంచు ప్రమీల హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

రాజకీయాల్లోనే ఉంటా..

కూటమి ప్రభుత్వానికి జై!

● మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం

కలువాయి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి రిటైర్డు కావాలనుకున్న తాను రాజకీయాల్లోనే ఉండాలని నిర్ణయించుకున్నట్లు మాజీ ఎమ్మెల్సీ, వైసీపీ నాయకుడు మాదాసు గంగాధరం అన్నారు. సోమవారం కుల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్ల తన రాజకీయ జీవితాల్లో ఇప్పటివరకు నాయకుల సిఫారసులతోనే అభివృద్ధి పనులు మంజూరు చేయడం చూసినట్లు చెప్పుకొచ్చారు. అయితే, కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రజల అవసరాలను



విలేకరులతో మాట్లాడుతున్న మాదాసు

గుర్తించి చేస్తున్నారని ఆయన కూటమి ప్రభుత్వ పనితీరును కొనియాడారు. ఇలాంటి ప్రభుత్వానికి నియోజకవర్గంలో ఉన్న తమ అభిమానులంతా కలిసి మద్దతు తెలిపేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ ఇచ్చి చంద్రబాబు రాజకీయ భిక్ష పెట్టగా, పవన్ కల్యాణ్ కూడా తనను ఎంతో అభిమానించే వారని వారితో ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేశారు. త్వరలో పవన్, లోకేష్, చంద్రబాబుతో మాట్లాడి రాజకీయంగా నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచు అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మ జ్ఞాపకాలే..

సేవకు తోవ

అమ్మ జ్ఞాపకాలే.. సేవకు తోవయింది. ఆయన చిన్నతనంలో తల్లి చేస్తున్న సేవా కార్యక్రమాలే నాంది పలికింది. తల్లి మీద ఉన్న ప్రేమతో ఆమె అకాలంగా కాలం తీరినా చేస్తున్న సేవా కార్యక్రమాలు సజీవంగా ఉండాలని తలచాడు. తల్లి జ్ఞాపకార్థం అమ్మానాన్నల పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి మూడు గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రశంసలందుకుంటున్నాడు ఎన్నారై ముత్యాల విజయ చంద్ర.

● తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్..
● మూడు గ్రామాల్లో సామాజిక సేవ
● జంగాలకండ్రిక వాసి విజయచంద్ర దాతృత్వం

సంగం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సంగం మండలం జంగాలకండ్రికకు చెందిన ప్రమీలమ్మకు విడవలూరు మండలానికి చెందిన ముత్యాల మల్లికార్జునరావుతో వివాహమైంది. వీరి కుమారుడు విజయచంద్ర. తండ్రి బ్యాంకు మేనేజర్ కావడంతో చదువు, పెరిగినదంతా నెల్లూరులోనే. వేసవి సెలవులకు తల్లితో కలిసి జంగాలకండ్రికలోగడిపేవారు. ప్రమీలమ్మ తండ్రి గ్రామంలో వీఆర్వో కావడంతో పెళ్లికి ముందే సేవా భావం అలవడింది. తండ్రి మల్లికార్జున బ్యాంక్ మేనేజర్ కావడంతో ఆర్థికంగా ఉన్నారు. దీంతో జంగాలకండ్రికలకు వచ్చినప్పుడల్లా పేదలకు సాయం చేసేవారు. విజయచంద్ర ఇదంతా గమనించేవారు.



మర్రిపాడు ఉన్నత పాఠశాలలో నిర్మించిన తరగతి గది



బాలింతలకు పండ్లు అందజేస్తున్న విజయచంద్ర

అమెరికాలో 12 ఏళ్లు..

నెల్లూరులో ప్రాథమిక విద్య అనంతరం వరంగల్లులో విజయచంద్ర బీటెక్ పూర్తి చేశారు. 2001లో ఎంఎస్ చేసేందుకు అమెరికాకు వెళ్లాడు. చదువు పూర్తయ్యాక అక్కడే ఉద్యోగం సంపాదించారు 2006లో స్వగ్రామానికి వచ్చి వివాహ అనంతరం మళ్లీ అమెరికాకు వెళ్లి 12 ఏళ్లపాటు ఉద్యోగం చేసి తిరిగి వచ్చి నెల్లూరుకు వచ్చి స్థిరపడ్డారు.

2021లో తల్లి మృతి..

విజయచంద్ర తల్లి ప్రమీలమ్మ కరోనా మహమ్మారికి గురై 2021లో మృతి చెందారు. తీవ్రమనోవైదనకు గురైన విజయచంద్ర తల్లి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఎంతో మదనపడ్డాడు. తల్లి సేవా గుణాన్ని నిరంతరం నిరంతరం కొనసాగించాలన్న ఉద్దేశంతో తల్లిపేరుతోపాటు తండ్రి పేరు కలిపి ముత్యాల ప్రమీల, మల్లిఖార్జున చారిట్రబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. జంగాలకండ్రికతోపాటు సమీపంలో ఉన్న వంగల్లు, మర్రిపాడు గ్రామాలను ఎంచుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- మర్రిపాడు ఉన్నత పాఠశాలలో మూడు అదనపు గదుల నిర్మాణానికి చేయూత. ఎస్టీ కాలనీల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు అందచేస్తున్నారు.
- జంగాలకండ్రిక, వంగల్లు, మర్రిపాడు గ్రామాల్లోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదింట్లో ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.
- అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలకు అందించే పాలు, కోడిగుడ్లు 15 రోజులు సరిపోతాయి. మిగిలిన రోజులు పౌష్టికాహారం లోపం లేకుండా మూడు గ్రామాల్లోని 7 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు 15 రోజులకు సరిపడా నాలుగు రకాల పండ్లను ప్రతి నెలా 15వ తేదీన పంపిణీ చేస్తున్నారు.
- ఎవరైనా పేదలు చనిపోయి అంత్యక్రియలకు సాయం కోరితే ట్రస్ట్ తరఫున ఆర్థిక సాయం అందచేస్తున్నారు.
- గ్రామాలలోని దేవాలయాల్లో జరిగే పర్వదినాల్లో అన్నదానం చేస్తున్నారు.

ఏడాదికి రూ. 10 లక్షలు వెచ్చిస్తా

ప్రతి ఏడాది ట్రస్ట్ పేరుతో సేవా కార్యక్రమాలకు రూ.10 లక్షలు ఖర్చు చేస్తున్నారు. మూడు గ్రామాల్లో ప్రస్తుతం చేస్తున్న సేవా కార్యక్రమాల తోపాటు నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ, పోటీ పరీక్షలు తీర్చదు కోసం నిదులు వెచ్చిస్తాను. మా అమ్మ పేరుతో సేవ చేసే భాగ్యం దేవుడు కల్పించినందుకు ఆనందంగా ఉంది.

- విజయచంద్ర, ఎన్నారై



ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రారంభం

● ఈనెల 19వతేదీ వరకు నిర్వహణ

నెల్లూరు(విద్య), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలస్థాయి పరీక్షలు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1ను స్వీయ ముదింపు టర్మ్-1 పేరుతో సోమవారం నుంచి జిల్లాలో ప్రారంభమయ్యాయి. అయితే కొన్ని పాఠశాలల్లో మాత్రమే ఉండే సంస్కృతం పరీక్షను మాత్రమే నిర్వహించారు. ఈనెల 11వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో ప్రధాన పరీక్షలు ప్రారంభం కానున్నట్లు డీఈవో బాలాజీరావు తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు 11న తెలుగు, ఉర్దూ, 12న ఇంగ్లీష్, 13న గణితం, 16న ఈవీఎస్ పరీక్షలు ఉంటాయన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు 11న తెలుగు, ఉర్దూ, 12న హిందీ, 13న ఇంగ్లీష్, 16న మ్యాథ్స్, 17న భౌతికశాస్త్రం, 18న జీవశాస్త్రం, 19న సోషల్ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రాథమిక తరగతుల ప్రశ్నాపత్రాలు స్కూల్ కాంప్లెక్స్‌లకు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రశ్నాపత్రాలు ఎంఈవో కార్యాలయాలకు చేర్చామన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆయా తేదీల్లో పరీక్షకు గంట ముందుగా ప్రశ్నాపత్రాలు తీసుకుని పరీక్ష నిర్వహించాలన్నారు. అలాగే జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు కూడా షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలన్నారు. అన్ని పాఠశాలల్లో పరీక్ష అనంతరం ఉపాధ్యాయులు జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఈనెల 22వ తేదీ లోపల మార్కులను ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేసి తల్లిదండ్రులకు పంపించడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు.

డబుల్ రోడ్డు ఎప్పుడయ్యేనో..!



లింగసముద్రం మీదుగా కొత్తపేట వరకు 14కి.మీ పొడవునా డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు 2018లో రూ.16 కోట్లతో కందుకూరు ఆర్అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపారు. 2019లో ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదనలను పట్టించుకోలేదు. దీంతో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నది రోడ్డు పరిస్థితి. ప్రధానంగా మండలకేంద్రంలోని సింగిల్‌రోడ్డుతో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

ఆచార్య శ్రీనివాసరావుకు విశిష్ట పరిశోధకుడి అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

కావలి టౌన్, డిసెంబరు 9: స్థానిక పీజీ కళాశాలలో కామర్స్ విభా గాధిపతి ఆచార్య చిలమూరి శ్రీనివాసరావు విక్రమ సింహపురి యూనివర్సిటీ విశిష్ట పరిశోధకుడు పుర స్కారం అందుకున్నారు. చెన్నైలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో వీనస్ ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ నిర్వాహ కులు సోమవారం నిర్వహించిన పదవ వార్షిక రీసెర్చ్ మీట్‌లో ఈ పురస్కారాన్ని అందజేశారు. పలువురు ప్రముఖులు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.



కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు నడపడంతో దెబ్బతిన్న రోడ్డు

కేజ్ వీల్స్‌తో రోడ్లు ఛిద్రం

కొందరు ట్రాక్టర్ల యజమానులు నిర్లక్ష్యంగా కేజ్ వీల్స్‌తో తారురోడ్లపై తిరుగు తుండటంతో రోడ్లు ఛిద్రమైపోతున్నాయని పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలువాయి నుంచి సీతారాం పల్లి, రామన్నగారిపల్లె, చింతల పాళెం రోడ్డుపై కేజీ వీల్స్‌తో తరచుగా ట్రాక్టర్లు తిరుగుతుండటంతో రోడ్లు అధ్వానంగా తయారై ఇబ్బందులకు గురవుతున్నా మని, అధికారులు తగు చర్యలు తీసుకుని రోడ్లను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- కలువాయి (ఆంధ్రజ్యోతి)

హనుమాన్ చాలీసా అఖండ పారాయణం



శబరి శ్రీరామక్షేత్రంలో హనుమాన్ చాలీసా అఖండపారాయణం

నెల్లూరు నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో హనుమద్ర్వతం సందర్భంగా విజయవాడ అఖిల భారత హనుమాన్ దీక్షా పీఠం ఆధ్వర్యంలో నిరంతర హనుమాన్ చాలీసా అఖండ పారాయణం సోమవారం ప్రారంభమైంది. తొలుత ఆంజనేయ స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఈ పారాయణం 12వ తేదీ సాయంత్రం వరకు జరుగుతుంది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 13వ తేదీ హనుమద్ర్వతం కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు శబరి శ్రీరామక్షేత్రం చైర్మన్ చెన్నూరు వెంటేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 6గంటలకు అభిషేకం, 9గంటలకు హనుమద్ర్వతం హోమం, 10గంటలకు నాగవల్లీదళ (ఆకుపూజ) అర్చన, 11.30 గంటలకు పూర్ణాహుతి జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 4గంటలకు శ్రీరామస్తూపంలో భక్తులు రాసిన రామకోటి గ్రంథాల నిక్షిప్తం వేడుకలు జరగనున్నాయి.

- నెల్లూరు(సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

అలా వచ్చి.. ఇలా వెళ్లి!

● 'ప్రజావేదిక'లో అధికారుల తీరిది! ● ప్రజల్లో సన్నగిల్లుతున్న నమ్మకం

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఉదయగిరి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సోమవారం తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తోంది. అయితే, ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు డుమ్మా కొట్టడంతో తమ సమస్యలపై వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ వెనుతిరగాల్సిన దుస్థితి నెలకొంది. సోమవారం ఉదయగిరి తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి 17 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా 11.14 గంటలకు కేవలం 7 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో వీడియోకాన్ఫరెన్స్ మరమ్మతులకు గురి కావడంతో కార్యక్రమం నిర్వహించలేదు. సమయపాలన పాటించకుండా కొందరు అధికారులు వచ్చామా.. వెళ్లమా.. అంటూ, మరికొందరు తమ సిబ్బందిని పంపి రిజిస్టర్‌లో సంతకాలు చేయిస్తూమమ అనిపిస్తున్నారు. కొందరు అక్కడ అధికారులు ఉండరు.. అర్జీలు అందజేసినా సమస్యలు పరిష్కారం కావడంలేదంటూ అసలు ఇవ్వడమే మానేశారు. మరికొందరు తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చినా సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ఉదయగిరి : తహసీల్దారు కార్యాలయంలో జరిగిన పరిష్కార వేదికలో పాల్గొన్న ఏడు శాఖల అధికారులు, సిబ్బంది

● సంగం (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో 12 గంటల సమయానికి ఐదు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. తహసీల్దారు సోమ్లానాయక్, హౌసింగ్ ఏఈ గౌస్‌మోహిద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి ఉండగా, డీఆర్‌డీఏ వెలుగు, విద్యాశాఖ అధికారులు మాత్రం సంతకం చేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. అగ్రికల్చర్ ఏవో శ్రీహరి ఆలస్యంగా వచ్చి సంతకం చేశారు. మిగిలిన శాఖ అధికారులు హాజరు కాలేదు. ఒకరిద్దరు తప్ప మిగిలిన వీఆర్వోలు అందుబాటులో లేరు. ప్రజల నుంచి ఐదు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.



● లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్సు లు వీక్షించే మోనిటర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో తహసీల్దారు సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసులు తమ చాంబర్లలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్పీడీవోతో పాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధాదేవి తప్ప మిగిలిన అధికారులు హాజరుకాలేదు. అయితే, వారంతా కందుకూరులో హాజరైనట్టు ఎమ్పీడీవో తెలిపారు. ఎమ్పీడీవోకు 3, తహసీల్దారుకు 3 అర్జీలు అందాయి.

● ఉలవపాడు (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు ప్రజావేదిక జరిగింది. మండల అధికారులు ఒక్కొక్కరిగా తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని 11.30 గంటలకే వెళ్లిపోయారు. తహసీల్దారు కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ టీవీ సెట్ మరమతుకు గురికావడంతో ఎంపీడీవో కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్‌కు ఎంపీడీవో విజయతోపాటు తహసీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ హాజరయ్యారు.

● వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి) : ఎమ్పీడీవో కార్యాలయలో సోమవారం ప్రజావేదిక జరగలేదు. వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు పనిచేయక పోవడంతో పలు శాఖల అధికారులు కందుకూరులోని తహసీల్దారు కార్యాలయానికి వెళ్లారు. తహసీల్దార్ అబ్దుల్ అమీద్ హైకోర్టు పనిమీద అమరావతి వెళ్లడంతో డిప్యూటీ తహసీల్దారు నాయబ్‌రసూల్ కందుకూరులో పాల్గొన్నారు.



లింగసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో మరమ్మతులకు గురైన మోనిటర్

కావలిలో ప్రజాస్పందనే లేదు!

కావలి, (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కేవలంలో 8 అర్జీలు మాత్రమే వచ్చాయి. ఆర్డీవో వంశీకృష్ణ తోపాటు వివిధ శాఖలకు చెందిన సుమారు 20 మంది అధికారులు ఇందులో పాల్గొన్నారు. డివిజన్‌లోని 10 మండలాలు ఉన్నా ప్రజల నుంచి స్పందన కరువయ్యింది. అధికార పార్టీ నేతలను కాదని అధికారులకు సమస్యలు చెప్పినా గత ప్రభుత్వంలోలా పరిష్కారం కావనే భావనలో ఇంకా ప్రజలు ఉన్నారు. ప్రజావేదికలో ఇచ్చిన అర్జీలకు పరిష్కారం దొరుకుతుందన్న నమ్మకాన్ని అధికారులు ప్రజలకు కల్పించాల్సి ఉంది.

అర్జీలపై స్పందించండి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు అధికంగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సోమవారం పరిష్కార వేదికకు 256 అర్జీలు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్ రావు, జడ్పీ సీఈఓ విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.



● వెంకటేశ్వరపురంలోని ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు జేసీకి వినతిపత్రం సమర్పించారు.

● 12వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజనులు జేసీకి వినతిపత్రం సమర్పించారు. తమ ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. దొరతోపు ప్రాంతంలో పొర్లుకట్ట సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

బాధితులకు న్యాయం చేయండి : ఎస్పీ

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులను ఎస్పీ జి కృష్ణకాంత్ ఆదేశించారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 85 మంది ఫిర్యాదుదారులు తరలి వచ్చి వారి సమస్యలు ఎస్పీకి విన్నవించుకున్నారు.

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి : సీపీఐ



కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

కందుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ నాయకులు సోమవారం కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మాలకొండయ్య మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలను వెంటనే బహిర్గతం చేయాలని, ఇటీవల పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. గౌతమ్ అదానీ అవినీతిపై అమెరికా న్యాయస్థానంలో కేసు నమోదైనందున కేంద్రం ఆయన్ను వెంటనే అరెస్టు చేసి సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సబ్ కలెక్టరు కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బూసి సురేష్ బాబు, షేక్ హస్సేన్, మురళీ, ఉప్పుటూరి మాధవరావు, ఎండ్లూరి వీరాంజనేయ కుమార్, జడ సునీల్, నత్తా రామారావు, కోటేశ్వరరావు, సీతారామయ్య, సుభాన్, దుర్గాప్రసాద్, ఆనంద్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలి : లోక్‌సత్తా

కావలిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలని లోక్ సత్తా ఉద్యమ నాయకులు మాలకొండారెడ్డి తెలిపారు. ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవంను పురస్కరించుకుని సోమవారం పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అవినీతి వ్యతిరేక చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో పౌరులందరూ విధిగా అవినీతి వ్యతిరేక చట్టాల పట్ల అవగాహన కలిగివుండాలని అప్పుడే అవినీతిని ప్రశ్నించగలం అన్నారు. అవినీతి నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు వీవీ.సుబ్బారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

ఆత్మకూరు, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ వేణుగోపాల్ సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఈ ఏడాది నమోదైన కేసులు, పరిష్కారమైన కేసుల వివరాలను, సిబ్బంది సమస్యలను అగిగి తెలుసుకున్నారు. అనంతరం నేరాల ని యంత్రణకు పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సైబర్ మోసాలకు లోను కాకుండా జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు జిలాని, సాయి ప్రసాద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గానుగపెంటలో రెవెన్యూ సదస్సు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు, తదితరులు

కొండాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గానుగపెంటలో సోమవారం నిర్వ హించిన గ్రామ రెవెన్యూ స దస్సుకు భూ సమస్యలపై 8 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ ఎమ్. కోటేశ్వర రావు తెలిపారు. వెబ్‌ల్యాం డ్‌లో భూ వివరాలు నమో దుకు 4, అసైన్డ్‌మెంటు భూ ఆక్రమణపై 3, వినతులు, పట్టాదారు పాసుపుస్తకం ఉ న్న ఆన్‌లైన్లో పేరు లేదని ఒక వినతి వచ్చిందన్నారు. కార్యక్రమంలో వీఆర్ కొండయ్య, సర్పంచ మల్లికార్జున, ప్రజాప్రతినిదులు నర్రావుల వెంకటేశ్వర్లు, కిలారి నరేంద్ర, సర్వే యర్ల బృందం, అధికారులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాల్లో మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నగారిపాలెం పంచాయతీ ఒట్టూరులోని బెల్టు దుకాణంపై సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న అప్పనగిరి పొట్టెయ్యను అదుపులోకి తీసుకుని 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ దేవిక సిబ్బంది ఉన్నారు.

బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలుకుదాం



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌బాబు

కావలి టౌన్, డిసెంబరు 9: బట్టీ పట్టే విధానానికి ఇకనుంచి స్వస్తి పలుకుదామని సైక్రియాటిస్ట్ సురేష్ బాబు తెలిపారు. సోమవారం గొల్ల మూడివీధిలోని నలందా హైస్కూల్‌లో ఈ అంశంపై అవగాహన కల్పించారు. మేధాశక్తి ఏ విధంగా పెంచుకోవాలి, చదువులలో ఎలా రాణించాలి అన్న అంశంపై మట్లాడారు. సెల్ ఫోన్‌తో చదువులపై పడే దుష్ప్రభావంపై అవగాహన కలిగివుండాలన్నారు. తల్లితండ్రులతో చర్చా వేదిక నిర్వహించి వారి సందేహాలను నివృతి చేశారు. కార్యక్రమంలో నలండా డైరెక్టర్ ఎండీ వశీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే కేసులు నమోదు



డ్రైవర్‌ను హెచ్చరిస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు

ఆత్మకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు ట్రాక్టర్లకు కేజ్ వీల్స్ తగిలించి రహదారులపై నడిపితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఆత్మకూరు బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు హెచ్చరించారు. సోమవారం ఆయన ఆత్మకూరు రహదారిపై కేజ్‌వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను నిలిపి రైతును హెచ్చరించారు. ఇనుప చక్రాల వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని, రోడ్డు నిబంధనల మేరకు ఇది నేరమని, రహదారులకు నష్టం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాడు ఘనం... నేడు అధ్వానం

- శిథిలమైన భవనం... ఉరుస్తున్న గదులు
- దుస్థితిలో కొరిమెర్ల ప్రభుత్వ హైస్కూల్



శిథిలస్థితిలో పాఠశాల భవనం



వర్షానికి ఉరుస్తున్న గదులు

సంగం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒకనాడు తరగతుల నిండుగా విద్యార్థులతో ఎంతో వైభవం సంతరించుకున్న మండలంలోని కొరిమెర్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నేడు వసతులు కరువై విద్యార్థుల్లేక వెలవెల పోతూ దైన్య స్థితిలో ఉంది. దీంతో విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాది తగ్గిపోయింది. సుమారు ఏడు దశాబ్దాల కిందట 1956లో సుమారు 5 ఎకరాల సువిశాల స్థలంలో దీన్ని స్థాపించారు. నాడు తరగతికి ఒక గది, హెచ్‌ఎం, క్రాఫ్ట్, లైబ్రరీ, ల్యాబ్ వంటి వసతులతో భవనం, విశాలమైన ఆటస్థలం ఉండేవి. ఈ పాఠశాల అనుబంధంగా బీసీ బాలికలు, ఎస్సీ బాలుర వసతి గృహాలు ఉండేవి. నాడు 6 నుండి 10 తరగతుల వరకు సుమారు 500 మంది విద్యార్థులతో పాఠశాల కళకళలాడేది. నేడు పాఠశాల శిథిలస్థితికి చేరడంతో విద్యార్థుల సంఖ్య 142 మంది పడిపోయింది. అప్పట్లో నిర్మించిన ప్రహరీ దెబ్బతినడంతో గత టీడీపీ ప్రభుత్వంలో రూ. 30 లక్షలకు పైగా వెచ్చించి విశాలమైన ఆటస్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. కానీ నూతన తరగతి గదులు నిర్మించలేదు. చాలా గదులున్నా అన్నీ శిథిల స్థితికి చేరి ఉరుస్తున్నాయి. వానొస్తే విద్యార్థులు కూర్చొనేందుకు స్థలం లేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

భూ సమస్యలపై అర్జీల వెల్లువ

- రీసర్వేలో తప్పులు సరిదిద్దాలని సబ్ కలెక్టరుకు బాధితుల మొర



అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ

కందుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో భూ సమస్యలపైనే డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వచ్చి సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు అర్జీలు అంద జేశారు. ప్రధానంగా ఆన్‌లైన్ పొరపాట్లని సరిచేయించాలని, రీసర్వేలో తప్పులను సరిదిద్దాలని అధిక సంఖ్యలో ఫిర్యాదు చేశారు. మ్యూటేషన్ సమస్యలపైనా పలువురు అర్జీలు అందజేశారు. రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల భూసేకరణలో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మాకు చేస్తున్న అన్యాయాన్ని నివారించాలని గుడ్లూరు మండలం రావూరువాసులు సబ్ కలెక్టరుకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన జీ. సుబ్బరామయ్య నేతృత్వంలో పలువురు రైతులు 2013 భూసేకరణ చట్టానికి విరుద్ధంగా జరుగుతున్న బలవంతపు భూసేకరణను అడ్డుకుని తమకు న్యాయం చేయాలని విన్నవించారు. వ్యవసాయం జీవనాధారంగా బతికే మా భూములను పరిశ్రమల పేరుతో తీసుకుంటే ఎలాగో ఆలోచన చేయాలని విన్నవించారు. అలాగే భూసేకరణ చట్టాన్ని అనుసరించి పరిహారం ఇవ్వటం లేదన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు. అలాగే కందుకూరు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదికలో పారిశుధ్యం, ఇళ్లమధ్య మురుగునీరు, రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి తదితర సమస్యలపై కమిషనర్ అనూషకు 10అర్జీలు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా



కావలి: ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు



ఆత్మకూరు: మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కావలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని మున్సిపల్ కార్మికులు తెలిపారు. సోమవారం మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ ఆధ్వర్యంలో వారు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని రాజగోపాల్ మాట్లాడారు. ఔట్ సోర్సింగ్, డైలీవేజ్, చనిపోయిన, వయసు రీత్యా తొలగించిన కార్మికుల కుటుంబసభ్యులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్ హెల్త్ అరియర్స్, పెండింగ్ సరెండర్ లీవ్‌లు, ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కే.నాగరాజు, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు, చేవూరు కొడయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లె అంకయ్య గుంజి క్రిషోర్, ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, ఉఎండ్లూరి రవి, వెంకటేశ్వర్లు, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

●ఆత్మకూరు : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. పాత పంచాయతీ కార్యాలయం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ఏఐటీయూసి జెండాలు పట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికుల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ఇంజనీరింగ్ విభాగ కార్మికులు, ఆఫీస్ సిబ్బంది వేతనాలు పెంచాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, హజరత్తయ్య, ముస్వీర్ బాష, కృష్ణయ్య, నాగేంద్ర, వాసు, జానీ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యంగిరా వారాహిదేవి హోమాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దగుమాటి

కావలి, డిసెంబరు9 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ముసునూరు హనుమక్షేత్రంలో సోమవారం ప్రత్యంగిరా వారాహిదేవి హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా కేరళ తంత్రం శ్రీకృత్య కృతంగిరా తాంత్రిక పీఠం గురువర్యులు శ్రీకొమండూరి శేషాచార్యులు మాట్లాడారు. కావలిలో వచ్చే ఏడాది నాటికి ప్రత్యంగిరా వారాహిదేవి ఆలయాన్ని నిర్మింపజేస్తామన్నారు. మంగళవారం ఉదయం పంచామృతాభిషేకం, అనంతరం భద్రభాళీ హోమాలు, రుద్ర ప్రత్యంగిరా హోమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్‌క్షేత్ర వ్యవ స్థాపకులు వేదగిరి సూర్యనారాయణ చార్యులు, నిర్వహకులు ఇంటూరి రమణయ్య, పొట్టేపాలెం సుధీర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కావలి రూరల్: పల్నాడు జిల్లా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కావలి పట్టణంలోని వైకుంఠపురం తాతా తిరుపతి, సిరిపురం ఉప్పాల ఏబులు, తుమ్మలూరు సురేష్ వనిత దంపతుల పార్థివ దేహాలకు సోమవారం ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి నివాళులర్పించి కుటుంబసభ్యులతో పరామర్శించారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన సురేష్ పిల్లలు సురుచి, మహేష్‌లకు అవసరాల నిమిత్తం ఎమ్మెల్యే రూ. 50వేలు అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు నాయుడు రాంప్రసాద్ మృతులకు టీడీపీ సభ్యత్వం ఉందని పార్టీ నుండి ప్రమాదబీమా, ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నేతలు గంటా మల్లికార్జున్, చాగంటి వెంకటే శ్వర్లు, గుర్రం సునీల్ ఉన్నారు.

రైతుసేవా కేంద్రం భవనానికి అవినీతి పగుళ్లు

- బయటపడిన నాణ్యతలో డొల్లతనం



భవనానికి పగుళ్లు ఇచ్చి లోపలికి చేరుతున్న వర్షపు నీరు

వలేటివారిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కూనిపాలెం రైతు సేవా కేంద్రం భవనం నిర్మించిన ఏడాదికే గోడలకు పగుళ్లు వచ్చాయి. గత ప్రభుత్వ హయంలో రూ.21.75 లక్షలతో ఈ కేంద్రంను నిర్మాంచారు. నిర్మాణ పనుల్లో సిమెంటు తగ్గించి ఇసుక ఎక్కువ మోతాదులో వేయడం, దానికి తోడు పూర్తిస్థాయిలో వాటర్ క్యూరింగ్ చేయకపోవడం తదితర కారణాలతో ఈ సమస్య నెలకొందన్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ పగుళ్ల నుంచి వర్షపు నీరు భవనంలోకి వస్తుందని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే గోడలు త్వరగా దెబ్బతిని కూలిపోయే అవకాశం ఉందన్నారు. వైసీపీ నాయకులు ఇచ్చిన ఆమ్యామ్యాయాలకు పంచాయతీ ఇంజనీరింగ్ పర్యవేక్షణాధికారులు ఇలా చేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. పది కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన భవనం మూణాళ్ల ముచ్చటగా మారింది. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైంది.

ఆర్వో ప్లాంట్‌కు మోక్షమెప్పుడో..?



వలేటివారిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి) : చుండి మోడల్‌స్కూల్‌లోని ఆర్వో ప్లాంటు రెండు నెలల నుంచి పని చేయక పోవడంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. ఈ ప్లాంట్ తరచుగా మరమ్మతులకు గురి అవుతుండటంతో పాఠశాల ప్రిన్సిపాల్ ఏం చేయాలో తెలియక చేతులెత్తేసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

కాస్త చూసుకుని వెళ్లండి !

గోగులపల్లి, కావలి రోడ్డులోని మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో అనేకసార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు ఇప్పటివరకు ఎలాంటి సూచిక బోర్డు, స్పీడ్‌బ్రేకర్‌లు ఏర్పాటు చేయలేదు. దీనికితోడు రోడ్డుకు ఇరు వైపులా ఉన్న చిల్లచెట్లు ఏపుగా పెరిగి రోడ్డును కమ్మేశాయి. మూడేళ్ల నుంచి అధికారులు వీటిని తొలగించే చర్యలు తీసుకోలేదు. వాహనదారులూ.. ఈప్రాంతంలో వేగంగా వెళ్లకుండా కాస్త చూస్కొని వెళ్లండి. - అల్లూరు (ఆంధ్రజ్యోతి)



ప్రమాదకరంగా ఉన్న అల్లూరు-కావలి రోడ్డు

నిర్ణీత వ్యవధిలో రైతుల సమస్యలు పరిష్కారం

- ఇన్‌చార్జి తహసీల్దారు అనీల్‌కుమార్



మర్రిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చలానా కట్టిన 23 రోజుల వ్యవధిలో రైతుల సమస్యలను పరిష్కరిస్తామని, కొన్ని సమస్యలకు చలానాలు కట్టుకునేందుకు వీలులేకుండా ప్రభుత్వం తాత్కాలికంగా కంప్యూటర్‌లో లాక్ చేసిందని ఇన్‌చార్జి తహసీల్దారు అనీల్‌కుమార్ తెలిపారు.

? అసైన్మెంట్ పట్టా దారుడి మరణానంతరం వారసులు భూమిని మార్చు కునేందుకు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనా.

! అడంగల్‌లో భూమి స్వభావం.. ప్రభుత్వం మెట్ట లేదా ప్రభుత్వం అనాధీనం అని ఉంటే చలానా కట్టుకునేందుకు వీలులేదు. గత 3 సంవత్సరాల నుంచి ప్రభుత్వం నిలిపివేసింది.

? నోషనల్ ఖాతాల రైతులు తమ ఖాతాలను ఒరిజినల్‌గా మార్చుకోవాలంటే ఏమి చేయాలి.

! రైతు తమ వద్ద ఉన్న ఆధారాలతో ఇచ్చిన అర్జీకి రిపోర్టు రాసి జాయింట్ కలెక్టరుకు సిఫారసు చేస్తాము.

? ఎక్కువమంది రైతులు ఏ విధమైన సమస్యలపై తరచూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

! నోషనల్ ఖాతాల రైతులు, 6వ విడత భూ పంపిణీలో పట్టాలు పొందామంటూ.. వాటిని కంప్యూటర్ అడంగల్‌లో ఎక్కించాలని తిరుగుతున్నారు.

న్యూస్ బాక్స్

సచివాలయం తనిఖీ

వలేటివారిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): పోకూరు సచివాలయంను సోమవారం ఎంపీడీఓ నరేంద్రదేవ్ తనిఖీ చేశారు. సచివాలయంలో మూమెంట్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సమయంలో డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. మిగిలిన ఉద్యోగులు సెలవులో ఉన్నట్లు తెలిపారు. సమయపాలన పాటించాలని ఎంపీడీఓ సూచించారు.

అధికారులు, సర్పంచులకు శిక్షణ

కలిగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మంగళ, బుధవారం స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ ప్రత్యూష తెలిపారు. 170 మంది ప్రజాప్రతినిధులు, సిబ్బందిని రెండు బ్యాచ్‌లుగా విభజించి, ఎంపీడీఎట కార్యాలయం, ఆర్‌బీకే బిల్డింగ్, గ్రామ సచివాలయం-2లో నిర్వహించే శిక్షణకు సంబందిత అధికారులు, ప్రజాఅప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఇనాం భూముల రిజిస్ట్రేషన్‌పై వివాదం

బిట్రగుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా తాము సాగు చేసుకుంటున్న ఇనాం భూములు రికార్డుల్లోకి ఎక్కలేదని, వాటిని ఏ విధంగా రిజిస్టేషన్ చేసుకున్నారని గ్రామస్తులు డిమాండ్ చేశారు. బోగోలు పంచాయతీ అక్కరాజువారి కండ్రికలో సోమవారం పుల్లయ్య అనే వ్యక్తి ఇనాం భూమిని దున్నుతుండగా అక్కరాజువారి కండ్రిక, చెంచులక్ష్మీపురానికి చెందిన కొందరు వచ్చి అడ్డుకున్నారు. పొలానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తీసుకుని రెవెన్యూ అధికారుల వద్దకు రావాలని మండిపడ్డారు. అలాగే 2007, 2017, 2023లో కొందరు వచ్చారని వారు నిలదీయడంతో పుల్లయ్య అక్కడి నుంచి వెనుదిరిగాడు.

రేపటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్-1 పరీక్షలు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్-1 పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో-1 షేక్ మస్తాన్‌వలి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలలకు అందిస్తుందని, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రశ్నాపత్రాల కోసం నగదు చెల్లించి ఉంటే వారికి కూడా సరఫరా చేస్తామన్నారు. నగదు చెల్లించని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రశ్నాపత్రాలు తయారుచేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కరేడు విద్యార్థినులు

ఉలవపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటలకు కరేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు కుమారి నిరీష, వాయల రోహిణి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పోన్నూరు శ్రీనివాసులు తెలిపారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరుగుతున్న 71వ రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ టోర్నీలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ ఓగుబోయిన శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీరిని పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోటంగారి బాలేశ్వరరావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ కాటా బత్తిన కృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.